ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 10 - సంచిక 10
**ఫిబ్రవరి 2010**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 110**
**3 సం॥ చందా రూ॥ 310**
**10 సం॥ చందా రూ॥ 1050**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TRUST
BUSINESS DIVISION,
HYDERABAD

## మన అదృష్టం మన చేతిలోనే ఉంది

కష్టించి పనిచేశాక ఆకలి నకనకలాడుతుంది. అలాంటి వ్యక్తికే ఆహారం రుచి, విలువ తెలుస్తాయి. చమటోడ్చి సంపాదించిన వ్యక్తికే ధనాన్ని ఎలా ఉపయోగించాలో తెలుస్తుంది. సమస్యలను ఎదుర్కొంటూ, అపజయాలను రుచిచూచిన వ్యక్తికే విజయం యొక్క విలువ, ఆనందం అర్థం అవుతాయి. వ్యతిరేక పరిస్థితుల్లో కూడా కష్టాలను సహిస్తూ, అపజయాలను చిరునవ్వుతో స్వీకరిస్తూ, ఉత్సాహంగా ముందుకు సాగిన వ్యక్తినే విజయలక్ష్మి వరిస్తుంది.

లక్ష్యసాధనలో ఆలస్యం జరిగినప్పుడు సహనంతో ఎదురుచూడలేనివారు, మంచిపని తలపెట్టినప్పుడు మధ్యలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోలేనివారు తమ అయోగ్యతను ఒప్పుకోలేరు. పైగా దోషమంతా అదృష్టం మీద రుద్ది తాము మాత్రం నిర్దోషులుగా చెప్పుకునే ప్రయత్నం చేస్తారు. ఇది ఆత్మవంచన అని అర్థం చేసుకోరు. దీనివల్ల లాభం లేకపోగా, అంతులేని నష్టం కలుగుతుంది. అన్నింటికన్నా పెద్ద నష్టం ఏమిటంటే తనను తాను నిర్భాగ్యుడుగా, అభాగ్యుడుగా భావించుకుంటూ తిరిగే వ్యక్తి నిరాశ అనే అంధకారంలో కూరుకునిపోతాడు. ఆశకు, ఫలప్రాప్తికి క్రోసుల దూరం జరిగిపోతాడు.

ఏ పనిలో అయినా ఎదురయ్యే బాధలు, కష్టాలు, ప్రమాదాలు, అపజయాలు ఒకరకంగా మనశక్తి సామర్థ్యాలకు గీటురాళ్ళు అని చెప్పకతప్పదు. వాటిమీదనే మనయోగ్యతను పరీక్షించుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా మన కృషిలో మార్పు వస్తుంది. ఆ మార్పే మనకు విజయలక్ష్మిని దగ్గరకు చేరుస్తుంది.

పత్రిక అందనివారు, పత్రికకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్లను సంప్రదించగలరు.
**(1) 9603509900 (2) 9032674117**

**తొందరపాటు కూడదు. తొందరపాటు అనిశ్చిత స్థితిని తయారుచేస్తుంది.**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :**
మన అదృష్టం మన చేతిలోనే ఉంది 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :**
సంస్కారాల ద్వారా మనసుకు మార్గాలు 2
3. **వేదమంత్రం :** మానవ ధర్మం 3
4. **వర్తమాన భారతం :**
వినాశం వద్దు అనుకుంటే భూమిని వేడి నుండి కాపాడండి 4
5. **ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం**
ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా? 7
6. **పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది :**
2400 కోట్ల మంత్రజపం 8
7. **బాలల భవితకు బంగారు బాట-4 :**
నాయకుడంటే ఇలా ఉండాలి 9
8. **ధారావాహిక : ప్రశ్నోపనిషద్-3**
ప్రథమ మండలం - ప్రథమాధ్యాయం 10
9. **తత్వచింతన :** పరమాత్మ సచ్చిదానంద స్వరూపుడు 12
10. **ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-9**
ప్రేమమయి-ప్రకృతి మాత 14
11. **మనం-మన ఆరోగ్యం :** ఆరోగ్య నియమాలు-దినచర్య 16
12. **ధారావాహిక : హనుమత్కథామృతం-22**
ధ్యానమగ్నుడైన బాలసూర్యుడు 20
13. **కుటుంబ నిర్మాణం :**
కుటుంబంలో ధార్మిక వాతావరణాన్ని నెలకొల్పాలి 22
14. **ధారావాహిక : భక్తిగాథ-27 :**
సమస్త సాధనల ఫల స్వరూపమే భక్తి 24
15. **ప్రత్యేక వ్యాసం : శ్రీరామకృష్ణ పరమహంస జయంతి సందర్భంగా (16-02-2010)**
పరమహంస పావన కథాసుధలు 26
16. **చతుర్ముఖీ సాధన : గురుదేవుల అమృతవాణి-3**
సమర్పణకు సరిఅయిన సమయం ఇదే 28
17. **ఆధ్యాత్మిక విజ్ఞానం :** వైజ్ఞానిక ఆధ్యాత్మికత యొక్క మూలమంత్రం-గాయత్రీ మహా మంత్రం 30
18. **జీవించేకళ :** ధర్మాన్ని తెలుసుకోండి-రక్షించండి 32
19. **ధారావాహిక : వృద్ధాప్యం-జీవిత నవనీతం-2**
రోగాలు-ఒంటరితనం-అపేక్ష-ఉపేక్ష 34
20. **గాయత్రీమాత-24 శక్తిధారలు :** ఋతంభర-8 38
21. **మహిళాజాగరణ :**
భారత్ అగ్రగామిగా ఉండేది-ఉంటుంది 39
22. **నా వారితో నా మాట : 2011-2012 (శతాబ్ది సం॥)**
శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-13
శతజయంతి వైభవం ప్రచారకుల చేతిలోనే ఉంది 40
23. **ఆలోచించండి - ఆచరించండి :**
జన్మ శతాబ్దికి మన కర్తవ్యం 43
24. **ఏ పుస్తకంలో ఏమున్నది?**
బాల సంస్కారశాల - మార్గదర్శిని 44
25. **వార్తలు** 45


# సద్గురు వచనామృతం



## సంస్కారాల ద్వారా మనస్సును మంచి మార్గానికి మళ్లించవచ్చు

కొందరు మనం కోరకుండా సలహాలు ఇస్తూ ఉంటారు. కానీ అందరూ ఇష్టపడరు. "అవి ఆచరణ యోగ్యమైనవి అయినా, వారి అభిప్రాయాలు శ్రేష్ఠమైనవి అయినా పూర్తిగా ఇష్టపడలేరు." అని మనస్తత్వ శాస్త్రం చెబుతుంది. సలహాలను స్వీకరించడంలో మన అహానికి దెబ్బతగులుతుంది. దాన్ని మనం అప్రతిష్ఠ అనుకుంటాం. తాను పరాజయం చెందానని భావించడానికి ఎవరూ ఇష్టపడరు.

ఎలా జీవిస్తూ ఉంటే అలాగే జీవించడంలో మనిషికి ఎంతో ఆత్మ సంతృప్తి లభిస్తుంది. మనిషి ఇతరుల అనుభవాల నుండి ప్రయోజనం పొందడు. ఇతరుల ఆలోచనా విధానాలను అవలంబించడంలో మనిషి అంతర్గతంగా సంతృప్తి పొందడు. తన అనుభవ జ్ఞానమే మనిషికి శాశ్వత ప్రయోజనాన్ని కలిగిస్తుంది.

అలాగే శ్రమ పడకుండా ఉచితంగా లభించిన వస్తువుల పట్ల ఎవ్వరూ శ్రద్ధ చూపరు. వాటి విలువను గుర్తించరు. ఇతరులు ఇచ్చిన వస్తువుల పట్ల మనిషికి 'నాది' అనే భావం కలుగదు. నాది అనే భావం కలుగనందువల్ల ఆ వస్తువులు అతని వ్యక్తిత్వంలో అంతర్భాగం కాలేవు.

మనసులో దాగిఉన్న సంస్కారాల నిర్మాణం ఒక విధమైన మానసిక మార్గాన్ని ఉత్పన్నం చేస్తుంది. బండి నడిచేటపుడు గాడులు పడతాయి. అలాగే ఈ మానసికమైన గాడులూ ఏర్పడుతాయి. ఎంత నిదానంగా వీటి నిర్మాణం జరుగుతుందో, అంత నిదానంగా వీటిని తొలగించి, క్రొత్త సంస్కారాలను నింపవచ్చు, క్రొత్త దారులను ఏర్పరచవచ్చును.

*అఖండజ్యోతి, జనవరి, 1952, 25,26,27వ పుటలు*

*అనువాదం - ఊటుకూరి సత్యనారాయణ గుప్త*

## పండుగలు

**ఫిబ్రవరి 2010**

| | |
|---|---|
| 7-02-2010 | సమర్థగురు రామదాసు జయంతి |
| 12-02-2010 | మహా శివరాత్రి |
| 16-02-2010 | శ్రీరామకృష్ణ పరమహంస జయంతి |

**మార్చి 2010**

| | |
|---|---|
| 16-03-2010 | శ్రీ వికృతినామ ఉగాది |
| 24-03-2010 | శ్రీరామనవమి |
| 28-03-2010 | మహావీర్ జయంతి |

**ఆశ అనేది లేకుంటే ప్రయత్నమే ఉండదు.**

వేద మంత్రం

# మానవ ధర్మం

**యత్ర బ్రహ్మ చ క్షత్రం చ సమూచౌ చరతః సహ ।**

**తల్లోకం పుణ్యం ప్రజ్ఞేయం యత్ర దేవాః సహాగ్నినా ॥**

***(యజుర్వేదం 20/25)***

**భావార్థం:** శాస్త్రాల ద్వారా సత్కర్మలను జాగృతం చేయుట, శస్త్రముల ద్వారా దుష్టుల సంహారం రెండూ అవసరమే. జ్ఞానం, కర్మల సంయోగం చేతనే సర్వాంగపూర్ణ ఆధ్యాత్మిక జీవనం లభిస్తుంది. బ్రాహ్మణ వర్ణం యొక్క జ్ఞానం, క్షత్రియ వర్ణం యొక్క తేజస్సు ఎక్కడ కలిసిమెలిసి ఉంటాయో, ఆ సమాజం ఎల్లప్పుడూ ఫలిస్తుంది పుష్పిస్తుంది.

**సందేశం:** ఆయా సమయాలలో పృథ్విపై అవతరిస్తానని గీతలో భగవానుడన్నాడు. ఎందుకు? 'పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతాం' ఆయన లక్ష్యం. ప్రపంచంలో సత్కర్మ చేసేవారిని, సాధు వ్యక్తులను రక్షించుట, దుష్టులు, దురాచారులు, పాపులను సంహరించుట చేయాలి. నచ్చచెప్పిన పనికాకపోతే, సామదాన భేద దండోపాయాలతో వారిని సరియైన దారిలోకి తీసుకురాలేకపోతే, వారిని సంహరించుట ధర్మమే. 'నిశిచర హీన కరౌమహి' యే ప్రపంచాన్ని సుఖంగా ఉంచే మూల మంత్రము. దీనితోనే రామరాజ్య స్థాపన జరిగింది.

పరమాత్మ ధనుస్సు-బాణాలు ధరించి, వేణువు ఊదుతూ అవతరించి, భూమి నుండి పాపులను, రాక్షసులను తొలగించవలసిన ఆవశ్యకత ఏమీ లేదు. ఆయన ప్రతి సమయం, ప్రతి స్థలంలో ఉండి ఉన్నాడు. మన శరీరంలోని రోమరోమంలో, కణకణంలో, అణువణువులో నిండి ఉన్నాడు. ఆ పరమాత్మ యొక్క పవిత్ర అంశయే మన ఆత్మ. మనమే ఆయన ప్రతినిధి. ప్రియమైన రాజకుమారులం, ఆయన అసంఖ్యాక అనుదానాలు, వరదానాలు మనకు ప్రాప్తించాయి. మనమే మనలోని ప్రతిభ, సామర్థ్యాలను ప్రపంచంలో సత్కర్మల వ్యాప్తికి, దుష్కర్మల నాశనానికి ఉపయోగించాలి. ఇదే సరియైన మానవధర్మం. జ్ఞానయోగం, కర్మయోగం సాధనలు కలిపి చేయుటలోనే మానవ శరీరం యొక్క ఉపయోగం. లేకపోతే మనకు పశువులకు తేడా లేనట్లే.

మనుష్యునికి పశువుకు ముఖ్యమైన తేడా ఏమిటంటే, పశువు ఏలాటి నియమాలతోనూ బంధించబడిలేదు. మనుష్యునిపై వేలాది నైతిక నియమాల బంధన ఉన్నది. అనేక బాధ్యతలు మోపబడ్డాయి. బాధ్యతలు, కర్తవ్యాలు నిర్వర్తించుట అతని ధర్మం. శరీరంపట్ల మన కర్తవ్యం దానిని రోగరహితంగా ఉంచడం. మస్తిష్కంపట్ల మన కర్తవ్యం దానిని సద్గుణాలతో నింపడం. దేశం, ధర్మం, సమాజం సంస్కృతిపట్ల మన కర్తవ్యం వాటిని సమున్నతంగా చేయడానికి సంపూర్ణశ్రద్ధ వహించడం. లోభ, మోహాల పాశం నుండి తనను తాను విడిపించుకొని జీవాత్మను ఉద్ధరించుట కూడా మన కర్తవ్యమే. భగవంతుడు మనలను ఏ పని నిమిత్తం ప్రపంచంలోకి పంపించాడో, ఏ పని కోసం మనుష్య జన్మ ఇచ్చాడో ఆ పని పూర్తి చేయుట మన కర్తవ్యం. మనజ్ఞానం, ప్రతిభలను మరింత వృద్ధి చేసుకుంటూ తదనుసారము శ్రేష్ఠ ఆచరణ చేయుట కూడా మన పవిత్ర కర్తవ్యమే. ఇదే జ్ఞానయోగం, కర్మయోగం యొక్క నిజమైన సాధన. నిజమైన ఈశ్వర భక్తి. ఇదే మానవుడికి మానవత్వ శ్రేష్ఠతను ప్రదానం చేస్తుంది.

వర్ణవ్యవస్థలోని నాలుగు వర్ణాలు సమాజ ఉన్నతికోసం కలిసిమెలిసి పనిచేసే విధానం మనం మరచిపోతూ ఉన్నాం. ఈ జ్ఞానం యొక్క సదుపయోగం ద్వారా సమాజం తేజస్వి, వర్చస్వి అవుతుంది, ఉన్నతమవుతుంది, ఫలిస్తుంది, పుష్పిస్తుంది. అందుకొరకు కృషి చేయడమే మానవ ధర్మం.

★ ★ ★

**కృతజ్ఞతా బద్ధులు ఆనందంగా జీవిస్తారు.**

వర్తమాన భారతం

# వినాశం వద్దు అనుకుంటే భూమిని వేడినుండి కాపాడండి

## 2012 గూర్చిన వార్త నిజమేనా?

ఈనాడు ఎవరి నోట విన్నా '2012' ప్రమాదాలే చర్చించ బడుతున్నాయి. "సూర్యతాపం హఠాత్తుగా పెరిగిపోతుందట. భూమి విపరీతంగా వేడెక్కిపోతుందట. దానితో అనేక ప్రమాదాలు విరుచుకుపడతాయట. భూమి యొక్క ('టెక్టానిక్ ప్లేట్స్') కదిలిపోతాయట. (వదులైపోతాయట) భూకంపాలు వస్తాయట. ప్రకృతి భీభతత్సాలు హెచ్చుమీరిపోతాయట. భూమండలం సర్వనాశనం అయిపోతుందట. కొన్ని ఆధునిక భవనాలు మినహాయిస్తే అన్నింటికి నష్టం వాటిల్లుతుందట." ఇలా జరిగి తీరుతుందని ఫిలిమ్ నిర్మాత మాయన్ కేలండరులో శాస్త్రజ్ఞులు రాబోయే ప్రళయాన్ని గూర్చి చెప్పారు. వారి భవిష్యవాణిని జోడిస్తూ యుగాంతాన్ని ఊహించి చెప్పడం జరుగుతోంది. ఇదంతా భ్రమ అనుకోకూడదు. గత 50 సంవత్సరాల నుండి జరుగుతున్న వాస్తవాలను సి.డి.ల ద్వారా చూపిస్తూనే ఉన్నారు. చూస్తూనే ఉన్నాం.

## వినాశనం తొందర్లోనే (దగ్గర్లోనే)

ఈ రోజుల్లో ఎక్కువగా చర్చించబడుతున్న విషయం పెరిగిపోతున్న భూమి యొక్క వేడి గురించే. భూమి మీద వేడి పెరిగిపోతోంది. వర్షాలు నియమబద్ధంగా లేవు. ఋతువులు సక్రమంగా నడవడం లేదు. ఈ భయంకర పరిస్థితిని ప్రపంచం మొత్తం ఎదుర్కొంటోంది. ప్రపంచ దేశాలన్నీ పరిస్థితిని అర్థం చేసుకున్నాయి. కానీ ఏ ఒక్కదేశమూ దీని నుండి బయటపడే ప్రయత్నం చేయడం లేదు. కొపెన్‌హేగెన్‌లో 2009 డిసెంబర్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశాలలో దీనిని గురించే చర్చించడం జరిగింది. విశ్వనాశనం జరుగబోతోంది. అయినా ఈ విషయంలో ఎవ్వరూ ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. ప్రపంచంలో అనేక రకాల ఉద్యమాలు నడుస్తున్నాయి. "భూమి ఇప్పటికే బాగా వేడెక్కిపోయింది. ఇంకా ఇంకా పెరిగితే ఏ దేశానికీ హద్దులు కనిపించవు" అన్న మాట ఎవరికీ చెవి దూరడం లేదు. ఈ ప్రళయానికి నల్లవారు, తెల్లవారు, ధనికులు, పేదలు అన్న భేదం ఉండదు. దానికి అందరూ సమానమే. ఇది రాబోయే పది సంవత్సరాలలోపు జరుగుతుందని శాస్త్రజ్ఞులు ఘోషిస్తున్నారు.

ఈ విషయంలో పరిశోధనలు చేసి భారతదేశం తరపున 2007లో శ్రీ ఆర్.కె.పచౌరీ విశ్వశాంతి – పర్యావరణ క్షేత్రంలో చేసిన ప్రమాణాలకు అమెరికాకు చెందిన అల్‌గోర్‌తో నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారు. ఈయన ఐ.పి.సి.సి "ఇంటర్ గవర్నమెంట్ ఫైనల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్" జలవాయు పరివర్తన మీద ఏర్పాటైన అంతర్జాతీయ సంస్థకు అధ్యక్షులు. ఇదే విధంగా ప్రపంచదేశాలన్నీ వాతావరణం మీద గ్రీన్‌హౌస్ వాయువులను (జి.హెచ్.జి.)ను వదులుతూ ఉన్నట్లైతే జరుగబోయే పరిణామాల ప్రభావం ప్రపంచ దేశాలన్నింటిమీద పడితీరుతుంది. దానికి ఎంతో దూరం లేదు. 2015 నుండి ప్రారంభం అవుతుంది.

1990 నుండి 2010 వరకు గ్రీష్మఋతువులో గల ఉష్ణోగ్రత, శీతల ప్రదేశాలలో కూడా వీచిన వడగాడ్పులు, సముద్ర తుఫానులు, పెరుగుతూ ఉన్న సముద్ర మట్టం వ్యవసాయరంగం మీద ప్రభావాన్ని చూపించాయి. వర్షాలు తగ్గిపోతున్నాయి. పల్లెలు పట్టణాలుగా మారిపోవడం, పరిశ్రమలు పెరిగిపోవడం, వాహనాల జోరు, క్లోరోఫ్లోరో కార్బన్స్ వాతావరణంలో కలసిపోవడం, పెరిగిపోయిన విమాన యాత్రలు, ధూళి దుమారం మొదలైనవన్నీ ప్రకృతితో చెలగాటం ఆడుతున్నాయి. అడవులను నరికివేయడం, ఆనకట్టల నిర్మాణం, పట్టణాలను తీర్చిదిద్దే పనిలో సిమెంట్ ఉపయోగం, అన్నింటికన్నా మించి విలాస జీవనం వల్ల కలిగే కష్టాలు దాదాపు అన్ని దేశాలను బాధిస్తున్నాయి. ఇది ధనిక దేశాలను ఇంకా పీడిస్తోంది. పర్యావరణ దృష్టిలో వారు వెనుకబడి ఉన్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాలు ఈ కోవకు చెందినవే. చైనా, భారత్‌లతో సహా అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా కాలుష్యాన్ని పెంచుతూ ఉన్నాయి.

## తప్పుచేస్తున్న దేశాలు ఒప్పుకోవడం లేదు

డెన్మార్క్‌లోని కొపెన్‌హేగన్‌లో 192 దేశాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. క్యోటో ప్రోటోకాల్ తర్వాత ఈ సమావేశం జరిగింది. ప్రపంచీకరణ వాతావరణంలో కార్బన్‌డైయాక్సైడ్ పెరిగిపోతున్న విషయం మీద చర్చ జరిగింది. దీని వల్ల

**శత్రువులు మిత్రులుగా మారేవరకు ప్రేమించడం నేర్చుకో.**

భూమండలానికి నాలుగువైపులా ఒక కృత్రిమమైన పొర ఏర్పడుతుంది. దాని వల్ల ప్రమాదకరంగా వేడి పెరిగిపోతోంది. మంచు కొండలు కరిగి పోతున్నాయి. సముద్రమట్టం పెరిగిపోతోంది. ఋతువులు గతులు తప్పుతున్నాయి. కాలంతో పనిలేకుండా వరదలు వస్తున్నాయి. కరువు విలయనృత్యం చేస్తున్నది. "ప్రతీ దేశం విడుదల చేస్తున్న ఉద్గారాలు తగ్గించాలి" అన్న నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఏ దేశం? ఎంత శాతం? విడుదల చేస్తోంది అన్న లెక్కలు తయారు చేయబడ్డాయి. అయినా ప్రధాన అపరాధి కూడ తన తప్పును ఒప్పుకోవడం లేదు. ఇది శోచనీయమైన విషయం. తగ్గించుకునే ప్రయత్నం చేయడానికి కూడా సిద్ధపడడం లేదు.

## ప్రపంచ ఉష్ణోగ్రత - మన భవిష్యత్తు

ఇంకా ఇంకా లోతులకు పోకుండా గడిచిపోయిన సంవత్సరాలను మూల్యాంకనం చేద్దాం. దీని వల్ల ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు అవగాహనకు వస్తాయి. 1960లో 13.6 డిగ్రీల సెల్సియస్ ఉన్నచోట ఇప్పుడు 14.6కు వచ్చింది. 1989 నుండి 1990 తర్వాత మహావేగంతో పెరిగిపోతోంది. 1998లో అన్నింటికన్న ఎక్కువ ఉష్ణోగ్రత నమోదయింది. దానితర్వాత తీవ్రత ఈ క్రమంలో ఉన్నది. 2005, 2003, 2002, 2004, 2006, 2001, 1997, 1995, 1999, 2000. **2010 అయితే అన్నింటికన్నా ఎక్కువ ఉష్ణోగ్రతా సంవత్సరంగా లెక్కింప బడుతోంది.** ప్రతీ సంవత్సరం 27 ఖరబుల టన్నులు (ఖరబు = 10వేల కోట్లు) కార్బన్‌డైయాక్సైడ్ వాతావరణంలో చేర్చబడుతోంది. ఇది ఉండవలసినదాని కంటే 200 రెట్లు ఎక్కువ. ప్రపంచం ఏమైపోవాలి? ప్రపంచ దేశాలన్నీ పర్యావరణాన్ని ఒక ముఖ్యమైన అంశంగా తీసుకుని ముందుకు సాగాలి. అందరు కంకణబద్ధులై పర్యావరణ రక్షణకై అడుగులు వేయాలి. పర్యావరణాన్ని "రక్షించు కోవడం మనందరి కర్తవ్యం" అని ఏక కంఠంతో ఎలుగెత్తి చాటాలి.

## ఎందుకు ఉద్యమించాలి?

1. భారతదేశం ఇప్పుడు ప్రగతిశీల దేశం. ప్రపంచంలో చైనాతోపాటు భారతదేశం కూడా ఆర్థిక ప్రగతివైపు అడుగులు వేస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల ధనికులకు, పేదలకు మధ్యగల అంతరం మరింత పెరిగిపోతోంది. ఆకలి చావులు పెరిగిపోతాయి.
2. సముద్రమట్టం పెరిగిపోవడంతో ఒడ్డునగల క్షేత్రాలు, పట్టణాలు, బీచ్‌లు మొదలైనవన్నీ నీటిలో మునిగిపోతాయి. ఇంక ముందు వాటిని చూడలేం. ఇప్పటిలాగే కార్బన్‌డైయాక్సైడ్, ఉష్ణోగ్రతలు కొనసాగినట్లైతే కోల్‌కత్తా, ముంబై, చెన్నై లాంటి సముద్రతీర నగరాలు 2020 తరువాత కనిపించవు.
3. ఋతువులు గతితప్పడం వల్ల పంటలు పండవు. కరువు రాక్షసి విజృంభిస్తుంది. భయంకరమైన రోగాలు ప్రత్యక్షం అవుతాయి. నేరాలు పెరిగిపోతాయి. రాబోయే 2,3 సంవత్సరాలల్లో భయంకర వాతావరణం ఎదురౌతుంది. వర్గపోరాటాలు, కొట్లాటలు ఆఫ్రికాలో జరిగిన విధంగా చిన్నపాటి యుద్ధాలను సృష్టిస్తాయి.
4. హిమాలయాలపైనున్న మంచు కరిగిపోయి నదుల ద్వారా సముద్రంలో చేరిపోతుంది. సముద్రం పెరిగిపోతుంది. ఆధునికజీవన శైలికి కావలసిన శక్తి సామర్థ్యాలు తరిగిపోతాయి. కాలుష్యం నిండిన నదీనదాలు ఆపదలను పుట్టిస్తాయి. ఈనాడు పెద్ద పెద్ద పట్టణాలలో కనిపిస్తున్న వైజ్ఞానిక సామాగ్రితో అవసరమే లేకుండాపోతుంది. అవన్నీ దిష్టిబొమ్మల్లా నిలబడే రోజువస్తుంది.
5. గంగా, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, నర్మద మొదలైన నదుల మీద పెద్ద పెద్ద ఆనకట్టలు నిర్మించడంతో వాటి నీటి ప్రవాహం తగ్గిపోతుంది. క్రమంగా ఇవి కనిపించకుండా పోతాయి. సర్వనాశనానికి నాంది పలుకుతుంది.
6. సముద్రంలో తుఫానులు చెలరేగుతాయి. భారతదేశంలో అధిక జనాభాగల క్షేత్రాలు దాదాపు సగం దెబ్బతింటాయి పంటలు నాశనం అవుతాయి. అతివృష్టి లేక అనావృష్టి ఉంటుంది. భయంకరమైన కరువుతో పాటు జల ప్రళయానికి మార్గాలు తెరుచుకుంటాయి.

పైన తెలిపిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచ దేశాలన్నీ ఒకే తాటిపై నడవాల్సి ఉంటుంది.

## మనం ఏం చెయ్యాలి?

అయితే మనం చెయ్యాల్సింది ఏమిటి? ప్రజలలో చైతన్యం కలిగించడానికి ఒక ఉద్యమాన్ని లేవదీయాలి. ప్రతి ఒక్కరు ముందుగా తనను తాను సంస్కరించుకోవాలి. గ్రీన్ టెక్నాలజీని

ఏ విషయమైనా పూర్తిగా తెలుసు అనుకోవడం పొరపాటు.

ఎక్కువగా ఉపయోగించుకోవాలి. నీటిని రక్షించుకోవాలి. రక్షించిన నీటితో వ్యవసాయం ప్రారంభించాలి. నదుల మీద పెద్ద పెద్ద ఆనకట్టలు కట్టకుండా ఉద్యమాలు నడపాలి. నదులను సరోవరాలను, నల్లాలను (పంపులను) కలుషితం చేయరాదు. గోవును, గ్రామాన్ని అభివృద్ధి పరచుకోవాలి. గ్రామాలనుండి పట్టణాలకు వచ్చే వలసలను నిలిపి వేయాలి. అత్యవసర పరిస్థితులలోనే గ్యాస్‌ను విడుదల చేసే వస్తువులను వాడుకోవాలి. వాహనాలు, వంటగ్యాస్, మైక్రోవేవ్ మొదలైన వస్తువులు ఈ కోవకు చెందినవే. నడవడం మంచిది. సైకిల్‌ను ఎక్కువగా ఉపయోగించటం శ్రేష్ఠం. అనవసరమైన వాహనాలను ప్రోత్సహించవద్దు. "గ్రీన్‌ఫ్యుయల్" మీద ఎక్కువగా ఆధారపడాలి. ఎయిర్ కండిషనర్స్, ఫ్రిజ్‌లు సాధ్యమయినంత తగ్గించివేయాలి. సౌరశక్తి మీద, పవనశక్తి మీద ఆధారపడి నడిచే సాధనాలను వాడుకోవాలి. వాటిని గూర్చి ఎక్కువగా ప్రచారం చెయ్యాలి. ఎక్కువలో ఎక్కువ మూలికావనాలను పెంచాలి. వాటిని కంటికి రెప్పలా కాపాడాలి. స్మారక వనాల నిర్మాణాన్ని నిలిపివేసే ప్రయత్నం చెయ్యాలి. సాధనా ఉద్యమాన్ని లేవదీసి, సూక్ష్మ పరిశోధనలు చెయ్యాలి. జనాన్ని సమీకరించాలి. వీటిల్లో కొంతవరకు చెయ్యగల్గినా మనం నివసిస్తూ ఉన్న భూమి రక్షింపబడుతుంది.

### అందరికీ అవసరమైన అంశం

**భారతదేశం ద్వారా వాతావరణం 3% మాత్రమే కలుషితం అవుతోంది. ప్రపంచంలోని ధనిక దేశాలు కార్బన్‌డైయాక్సైడ్‌లో 90% తగ్గించాల్సి ఉంటుంది.** దీని కోసం ప్రపంచస్థాయిలోనే ఒక ఫండును ఏర్పాటు చేయాలి. కార్బన్ లేనంత మాత్రాన ప్రగతి నిలిచిపోదు. ఇది ఒక్క దేశానికి సంబంధించిన విషయం కాదు. అందువల్ల అన్ని దేశాలు పాల్గొనాల్సి ఉంటుంది. 2050 నాటికి ప్రపంచాన్ని రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 1.అమెరికా 2. ఆస్ట్రేలియా 3. జపాన్ 4. కెనడా 5. ఫ్రాన్స్ 6.జర్మనీ 7. ఇంగ్లాండు 8. రష్యా 9. సౌదీ అరేబియా 10.ఇటలీ 11. భారత్ 12. చైనా కలిసి కృషి చేయాల్సి ఉంది. భగవంతుడు ఈ దేశాధినేతలకు సద్బుద్ధిని ప్రసాదించుగాక! అందుకోసం మనం కూడా మనవంతు కృషి చేయాలి. పైన తెలిపిన అంశాలను అమలుచేయడం అంత తేలికైనపని కాదు. ముందు ఆలోచనలను మార్చుకోవాలి. సౌరశక్తి ఉత్పాదనలు ఖర్చుతో కూడుకున్నవే. అయినా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు కలిసి పనిచేయాల్సి ఉంటుంది. కార్పొరేట్ సంస్థలు కూడా కలసినట్లైతే అసంభవం కానేకాదు.

అంటే ప్రపంచాన్ని 18వ శతాబ్దంలోనికి తీసుకవెళ్లమని కాదు. ప్రగతిని సాధించవలసిందే. ఋతువులు క్రమంగా నడవాలి. ప్రకృతిమాత మళ్లీ కళకళలాడాలి. వినాశం ఆగాలి. అంటే ప్రపంచస్థాయిలో కృషి జరగాలి. మన వంతుకృషిగా గ్రామాల స్థాయి నుండి ప్రారంభమై చిన్న-పెద్ద పట్టణాల స్థాయి వరకు ప్రాకిపోతూ ఉండాలి. గాయత్రీ పరివార్ చైతన్యవంతమై, విశ్వమంతటినీ చైతన్యపరుస్తోంది. అందరూ భాగస్వాములు కండి.

★★★

### శ్రీ గాయత్రీ శతకం

20. *అరయనొక కోటి మారులు స్థిరతతోడ*
*మనన మొనరింప మంత్రమున్ భక్తితోడ*
*జన్మ జన్మాల పాపమున్ సమయజేయు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. స్థిరమైన మనస్సుతో, నియమంతో, నిర్దిష్టకాలంలో గాయత్రీ మంత్రాన్ని కోటిమార్లు జపిస్తే దేవతలందరూ హర్షించి నీకు మేలు చేసేలా చేస్తుంది.

21. *క్రమము తప్పక మంత్రమ్ము ఘనత నెరిగి*
*నిర్మలమతివై పలుమార్లు నెమరువేయ*
*పాపినెయ్యపు దోషమున్ పారగొట్టు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. ఒక క్రమ పద్ధతిలో ప్రణాళికా బద్ధంగా గాయత్రీ మంత్రము యొక్క గొప్పతనాన్ని తెలుసుకొని నిర్మలమైన మనస్సుతో అనేకసార్లు స్మరణ చేస్తే పాపాలు చేసే మిత్రునితో స్నేహం చేసినందువల్ల కలిగే దోషాలను తొలగిస్తుంది.

రచన
సహజ కవి, సాహిత్య రత్న,
శతక చతురానన, పద్య కవితాసుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు

**దురదృష్టాన్ని నవ్వుతూ ఎదుర్కోవాలి.**

ఉపాసన - రెండు పాదాలు : జపం-ధ్యానం

# ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?

తన్మయత్వం అనేది అత్యంత మహత్తరమైంది. నమ్మశక్యం గాని సంఘటన. అయినా నమ్మకతప్పదు. లోకమాన్య బాలగంగాధర తిలక్ జీవితానికి సంబంధించిన ప్రసిద్ధ సంఘటన. ఒకసారి ఆయన బొటనవ్రేలికి ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. డాక్టరు మత్తుమందు ఇవ్వాలని ప్రయత్నించాడు. "నేను భగవద్గీతను చదువుకుంటూ ఉంటాను. మీరు నిస్సంకోచంగా ఆపరేషన్ చేయండి. ఏ మత్తు మందూ అక్కర్లేదు.'' అన్నారు తిలక్. డాక్టరు ముందు కాస్త తటపటాయించినా ఆయన పట్టుపట్టడంతో ధైర్యంగా ఆపరేషన్ చేశారు. తిలక్ నిశ్చలంగా కూర్చుని ఆపరేషన్ చేయించుకున్నారు. డాక్టర్ల ఆశ్చర్యానికి అంతేలేదు. "భగవద్గీత చదివితే నేను తన్మయుడనైపోతాను. నాకు ఆపరేషన్ వైపు ధ్యాసే పోలేదు. ఏ మాత్రం నొప్పి తెలియలేదు." అన్నారు నవ్వుతూ.

తుమ్మెద 'కీచురాయి' అనే కీటకాన్ని తెచ్చి గూట్లో పెడుతుంది. దాని చుట్టూ తిరుగుతూ నిరంతరం ఝుంకారం చేస్తుంది. ఆ ధ్వనిని వినీ వినీ కీచురాయి మనస్సు తనను తుమ్మెదలాగే అనుకుంటుంది. ఆ భావనతో క్రమంగా దాని శరీరం కూడా తుమ్మెదలాగానే మారిపోతుంది. అదేవిధంగా **ఒక వ్యక్తి ఏదేని వస్తువుగానీ, ఏదేని పరిస్థితిని గానీ ఏకాగ్రతగా చాలాకాలం ఆలోచిస్తూ ఉంటే అతని శక్తి అదే మూసలోపోత పోసుకుంటుంది** అన్న విషయం సునిశ్చితం. ఏదైనా ఒక విషయంపై మనస్సును కేంద్రీకృతం చేస్తే కలిగే పరిణామం ఇదే. దీనినే ధ్యానం అంటారు.

మానవునిలో లెక్కలేనన్ని శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. మానవుని శరీరంలోని 10 ఇంద్రియాలు గారడీవాని బుట్టలుగా చెప్పవచ్చు. ఈ ఇంద్రియాలను దారి తప్పనీయకుండా నిర్మాణాత్మక దశలో ఉంచగలిగితే కోరిన ఫలితం వేగంగా లభిస్తుంది. మనస్సు 11వ ఇంద్రియం. మానసిక సామర్థ్యానికి పరిమితుల్లేవు. దాని ఆలోచనాశక్తి, బుద్ధిశక్తి కొంత వరకే ఉపయోగపడతాయి. ఆలోచనాశక్తి, బుద్ధిశక్తి ఎంతవరకు ఉపయోగపడతాయో అంతే మోతాదులో చిత్తం, అహంకారమునకు సంబంధించిన భాగం కూడ ఉపయోగపడినట్లైతే మానవుడు వ్యవహారజ్ఞానం కలిగిన తెలివివంతుల కన్నా మిన్నగా మనగలుగుతాడు. అతడే తత్వద్రష్ట కాగలుగుతాడు. అతడే ధ్యానయోగి.

చెదిరిపోయే దాన్ని నిరోధించి, లభించినదానిని ప్రోగుచేసుకుంటూ, కోరుకున్న ఫలితాల కోసం ఉపయోగించు కోవడాన్నే ఆధ్యాత్మిక ఏకాగ్రత అంటారు. దీనినే ఆధ్యాత్మిక శాస్త్రంలో మనోనిగ్రహం, చిత్త నిరోధం అంటారు. ఏకాగ్రత ద్వారానే మానవుడు చేతనత్వాన్ని చెదిరిపోనివ్వకుండా ఏకత్రితం చేసి, ఏదోఒక విషయం మీద లగ్నం చేయగలుగుతాడు. ఫలితాన్ని పొందగలుగుతాడు.

ఒక మొండికత్తిని తీసుకుని ఏదైనా గట్టి వస్తువులో గుచ్చాలంటే చాలా కష్టం. కాని సన్నని మొనకు పదును పెట్టి ప్రయత్నిస్తే సామాన్యమైన ఒత్తిడితోటే చాలాలోతుకు చొచ్చుకుపోతుంది. సన్నని దారాన్ని గానీ, సన్నని తీగనుగానీ కాగితంలోనికి దూర్చలేం. అదే పని సన్నని మొన ఉన్న సూది చేయగలుగుతుంది. కొయ్య, లోహం వంటి గట్టి పదార్థాలలో రంధ్రం చేయాలంటే బర్మాను ఉపయోగించాల్సి వస్తుంది. తక్కువ పరిధిలో ఒత్తిడి కేంద్రీకృతం అయితే దాని శక్తి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుందని దీని ద్వారా మనకు అర్థం అవుతోంది. సూక్ష్మదృష్టితో ఆలోచిస్తే ధ్యానం యొక్క మహిమ విలువకట్టలేనిది. శ్రద్ధ అనే కత్తికి ఏకాగ్రత అనే పదును పెట్టాలి. అప్పుడే ధ్యానం సఫలీకృతం అవుతుంది.

అనువాదం – ఊటుకూరి సత్యనారాయణ గుప్త

**సత్యంతో కూడిన ప్రియమైన మాటలనే మాట్లాడాలి.**

# పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది-2400 కోట్ల మంత్రజపం

కారణజన్ములైన పరమపూజ్య గురుదేవులు గాయత్రీ మంత్రజపం ద్వారానే విజయాలు సాధించారు. వారి జన్మ శతాబ్దినాటికి మనం అంటే దక్షిణ భారత విభాగం 2400ల కోట్ల గాయత్రీ మంత్రజపాన్ని సామూహికంగా నిర్వహించి గురుదక్షిణగా సమర్పించాలన్న నిర్ణయం జరిగింది. ఇప్పటికే అనేకచోట్ల ప్రారంభింపబడింది. పరిజనులందరు రోజుకు మూడు మాలలు మంత్ర జపం చేయాలి. మీమీ బంధుమిత్రులను ప్రభావితం చేసి వారిచేత జపం చేయించాలి. ఏ రోజైనా ఏ కారణంగానైనా చేయలేకపోయినట్లైతే మరియొకరోజు పూర్తి చేసుకోవచ్చు. సగటున రోజుకు మూడు మాలలు వచ్చేలా చూసుకోవాలి. మూడు మాలలకన్నా ఎక్కువ చేయగలిగితే మరీమంచిది. మూడుమాలలు చేయలేనివారు కనీసం ఒక్క మాలైనా చెయ్యాలి.

**ముఖ్యగమనిక :** ప్రముఖ కార్యకర్తలు, పరిజనులు తమతమ ప్రదేశాలలోని పాఠశాలలకు పర్యటించి విద్యార్థుల చేత కనీసం 10-15 నిమిషాలు మంత్రజపం చేయించాలి. ఇప్పటికే చీరాలలోని ఒక పాఠశాలలో చేయించుచున్నారు. "విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరిగింది. ఏకాగ్రత కుదిరింది. బుద్ధివికసించింది. ప్రవర్తనం మారింది" అని తెలియచేశారు. కనుక మన ప్రయత్నం ఆ వైపుగా సాగాలి. లెక్కింపు సౌకర్యార్థం క్రింద ఒక పట్టిక ఇవ్వబడింది. దానిలో 31 గడులు ఉన్నాయి. ప్రతిరోజు ఆ రోజు చేసిన మాలల సంఖ్యను ఒక్కొక్క గడిలో వెయ్యాలి. చేయనిరోజు డాష్ పెట్టాలి. నెలపూర్తికాగానే క్రింది ప్రొఫార్మాను నింపి క్రింది చిరునామాకు పంపాలి. ఈ పేజిని చింపుకొని నింపవచ్చు. లేకపోతే స్వయంగా తయారుచేసుకోవచ్చు.

*శ్రీ కె.పి.విఠల్, 48 LIG-II,బి.కె.గూడా,*
*సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-500 038*
*ఫోన్ : 040-23705749, సెల్ : 9989655310*

ఇట్లు
మీ
అశ్విని సుబ్బారావు
*(విశ్వగాయత్రీ పరివార్-దక్షిణ భారత సంయోజకులు)*

**2400ల కోట్ల సామూహిక గాయత్రీ మంత్రజపము**

*తేదీ ........................ నుంచి ................. వరకు*

*నెం :* *పూర్తి జప మాలల సంఖ్య :* [ ]

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | *ప్రతిరోజు మీరు మంత్రజప మాలల సంఖ్యను పైన ఇచ్చిన గడులలో రాయండి* | | | | |

*పేరు : ..........................................................*

*గోత్రము : ......................................................*

*చిరునామా : ..................................................*

*..................................................................*

*..................................................................*

*పుట్టిన రోజు మరియు వివాహదినము : ........................*

*..................................................................*

*ఫోన్ : ..........................................................*

*యుగశక్తి గాయత్రి మాసపత్రికకు క్రొత్త చందాదారులను చేర్పించండి.*

**ఉపాధ్యాయుడు నిత్యవిద్యార్థిగా నేర్చుకోవాలి.**



## బాలల భవితకు బంగారు బాట-4

# నాయకుడంటే ఇలా ఉండాలి

ఒరిస్సాలోని కటక్ నగరంలో గౌరవ కుటుంబంలో నేతాజీ జన్మించాడు. అతని అసలు పేరు సుభాష్ చంద్రబోస్. సుభాష్‌కు 8 మంది అన్నలు, 6 గురు అక్కలు ఉన్నారు. ఆయన 15 వ సంతానం.

5 సంవత్సరాల వయస్సురాగానే ఇంగ్లీషు కాన్వెంట్లో చేర్పించాడు తండ్రి. ఆ రోజుల్లో ఆంగ్లేయుల పాలన. స్కూల్లో భారతీయుల పిల్లల్ని ఉపాధ్యాయులు అవమానపరుస్తూ ఉండేవారు. ఎందుకంటే వారంతా ఆంగ్లేయులే. ఇది చూచి అంత చిన్న వయస్సులోనే సహించలేకపోయేవాడు సుభాష్.

ఒక సారి పిల్లలంతా ఆడుకుంటున్నారు. ఒక ఆంగ్ల విద్యార్థి “భారతీయులంతా నీచులు. వీళ్లను చావగొట్టాలి.” అన్నాడు. ఆ మాటలు విన్న భారతీయులందరు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఎంత కోపం వచ్చినా ఏమీ చేయలేకపోయారు. ఎదురు తిరగాలని ఉన్నా భయంతో మౌనంగా ఉండిపోయారు. కాని సుభాష్ ఉండలేకపోయాడు. రౌద్రంగా వారి ముందుకు వెళ్ళి నిలబడ్డాడు. “నేను భారతీయుణ్ణి. రండి ఎవరు నన్ను చావగొడతారో రండి'' అని గర్జించాడు. వారంతా అవాక్కైపోయారు. తలలు వంచుకుని నిలబడ్డారు. సుభాష్ అంతటితో ఆగలేదు. భారతీయులు నీచులు అన్న విద్యార్థిని క్రిందపడేసి కొట్టాడు. భారతీయ విద్యార్థులందరికీ ధైర్యం వచ్చింది. “సుభాష్ చంద్రబోస్ జిందాబాద్” అంటూ పెద్దగా నినాదాలు ఇచ్చారు. ఇదంతా విన్న హెడ్మాష్టరు బయటకు వచ్చి చూశాడు. ఇది సమయం కాదు అనుకుని లోపలకు వెళ్ళిపోయాడు.

సుభాష్ 12 సంవత్సరాల బాలుడయ్యాడు. నగరంలో కలరా వ్యాధి వ్యాపించింది. అనేకమంది చనిపోతున్నారు. సుభాష్ తోటి విద్యార్థులను వెంటబెట్టుకుని మురికివాడలకు వెళ్ళేవాడు. రోగులకు సేవలు చేసేవాడు. మందులు అందించేవాడు. చిన్న చిన్న కథలు చెప్పి వారిని సంతోషపెట్టేవాడు. ఈ విధంగా ప్రతీపనిలో నాయకత్వం వహించేవాడు.

ఇతని నాయకత్వానికి ‘హైదర్ ఖా’ అనే రౌడీ అసూయ పడేవాడు. అసూయ కారణంగా సుభాష్‌ను శత్రువుగా భావించేవాడు. వాడు ఒక రౌడీ మూకను తయారు చేసుకున్నాడు. సమయం చూచి సుభాష్‌ను ఎదిరించాలని సిద్ధంగా ఉన్నాడు. పాపం! అతడు ఉండే వాడకు కలరా వ్యాపించింది. ఎంత బ్రతిమలాడినా ఏ వైద్యుడూ అక్కడ కాలు పెట్టలేదు. అందరూ చాలా బాధపడుతున్నారు. సరిగ్గా అదే సమయంలో సుభాష్ తన బృందంతో ఆ వాడకు వెళ్ళాడు. వాడవాడంతా శుభ్రం చేశారు. రోగులకు సేవలు చేశారు. మందులు పంచి పెట్టారు. ప్రేమగా లాలించారు. ఆర్థికసహాయం చేశారు. వీరి సేవలవల్ల వాడలో చాలామంది బ్రతికి బయటపడ్డారు. దానితో కాకలుతీరిన గుండా తన మిత్రబృందంతో వచ్చి సుభాష్ బృందాన్ని కౌగిలించుకున్నాడు. అందరు కలిసి పెద్ద బృందంగా తయారై మిగిలిన వారికి సేవలు చేశారు. ఆ విధంగా చిన్నతనం నుండే ప్రతి విషయంలో నాయకుడుగానే చలామణి అయ్యేవాడు.

క్రమంగా సుభాష్ ఐ.సి.ఎస్. పాసయ్యాడు. కాని ఆంగ్లేయుల దగ్గర నౌకరీ చెయ్యనని భీష్మించుకు కూచున్నాడు. చేస్తే మాత్రం గొప్ప అధికారి అయ్యేవాడు. కాని ఆయన జీవించి ఉన్నంతకాలం ఆంగ్లేయులనెదిరిస్తూ జీవించాడు. ఇక్కడి పరిస్థితులు అనుకూలంగా లేనందున విదేశాలకు వెళ్ళిపోయాడు. అక్కడ ఉన్న భారతీయులను ప్రోత్సహించి “ఆజాద్ హింద్ ఫౌజ్”ను స్థాపించాడు. ఆ సైన్యానికి నాయకత్వం వహించి ‘నేతాజీ’గా ఖ్యాతి గడించాడు. ఆ సైనాన్ని ఆంగ్లేయుల మీదికి నడిపించాడు. కాని విజయాన్ని సాధించలేకపోయాడు. అయినప్పటికీ నేతాజీ అందించిన స్ఫూర్తితో మహాత్మాగాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్య సమరం జరిగింది. ఆంగ్లేయులకు స్వాతంత్ర్యం ఇవ్వక తప్పలేదు.

ఈ విధంగా సుభాష్ చంద్రబోస్ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను నాయకత్వం వహించి స్వాతంత్ర్య సంపాదనకు మూలకారకుడయ్యాడు. ముఖ్యనాయకుడయ్యాడు. అందుకే మనందరికీ ‘నేతాజీ’ అయ్యాడు బాలలూ! మీకు కూడా నాయకుడు కావాలని ఉంది కదూ!

నీతి: *నాయకపాత్రను నడుపగ*
*పాయక ధైర్యంబునెపుడు పరుగున మీరున్*
*సాయము సేయంగ తగును*
*పాయముతోడన్ కదలగ వలయును బాలా!*

**దీపం తాను వెలిగితేనే తప్ప మరొక్క దీపాన్ని వెలిగించలేదు.**

ధారావాహిక : ప్రజ్ఞోపనిషద్-3

# ప్రథమ మండలం - ప్రథమాధ్యాయం

*సమాధిస్తో నారదోభూత్తస్మిన్నేవ క్షణే ప్రభః*
*ప్రజ్ఞా పురాణమేత్తద్ హృదయస్థ మకారయత్* (60)

*ఉవాచ చ మహమేఘమండలీవ సమన్తతః*
*కురు త్వం ముసలాధారం వర్షా తాం యుగచేతనామ్* (61)

*అనాస్థా తపశుష్కాం చ మహర్షే ధర్మధారణామ్*
*జీవయైతదిదం కార్య ప్రథమం తే వ్యవస్థితమ్* (62)

**టీకా:** నారదుడు సమాధి స్థితిలోనికి వెళ్ళాడు. భగవంతుడు ఆ సమయంలో, ప్రజ్ఞాపురాణమును కంఠస్థం చేయించాడు. "మేఘముల ద్వారా వర్షింపచేసినట్లు యుగచేతనలో దీనిని సర్వత్రా కురిపించు. అవిశ్వాసముతో ఎండిపోయిన ధర్మాన్ని తిరిగి సస్యశ్యామలం చేయాలి. ఇదే నీ ప్రథమ కర్తవ్యం." అని బోధించాడు.

*ఉవాచ నారదో దేవ! వాచ్యః శ్రీవ్యస్త్వయం మతః*
*జ్ఞాన పక్షః పూరకం తం కర్మపక్షం వివోధయ* (63)

*కర్తవ్యం యధ్యదన్యోశ్యాప్యనుష్ఠేయం సమగ్రతా*
*ఉత్పద్యతే ధ్వయోర్జ్ఞాన కర్మణోస్తు సమన్వయాత్* (64)

**టీకా:** నారదుడు ఇలా అన్నాడు "ఇది జ్ఞాన పక్షం దీనిని ఎవరికి చెప్పాలి. దీని కర్మ పక్షం కూడా వివరించండి. ఏమి చెయ్యాలో, ఏమి చేయించాలో చెప్పండి. జ్ఞానకర్మల సమన్వయంతోనే సమగ్రత లభిస్తుంది."

*ఉవాచ విష్ణు జ్ఞానార్థ కథా ప్రజ్ఞాపురాణజా*
*వివేచ్యా కర్మణే ప్రజ్ఞాభిమానస్య విధిష్వలమ్* (65)

*విధయోస్య చ స్వీకర్తు ప్రగల్భాన్ ప్రేరయానిశమ్*
*యుగస్య సృజనే సర్వే సహయోగం దదత్వలమ్* (66)

*యధాతధా వివోధ్యాస్తే భావుకా అంశదాయినః*
*సమయస్య చ దాతార సోత్సాహా ఉత్ఫురన్తుయత్* (67)

*సంయుక్త శక్త్యా శ్రేష్ఠానాం దుర్గావతరణో జ్వాలా*
*ప్రచండతా సముత్పన్నా సమస్యా దూరయిష్యతి* (68)

**టీకా:** విష్ణు భగవానుడు ఇలా అన్నాడు – "జ్ఞానము కొరకు ప్రజ్ఞాపురాణ కథల వివేచన బాగుంటుంది. కర్మ కొరకు ప్రజ్ఞా అభియాన్ యొక్క వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు ప్రేరణ ఇవ్వాలి. యుగ సృజన కొరకు ముందుకు వచ్చినవారిలో సమయదానం, అంశదానం ఇవ్వాలనే ఉత్సాహం పెల్లుబకాలి. ఇటువంటి వారి సంయుక్త శక్తితోనే దుర్గావతరణ వంటి ప్రచండ శక్తి ఉత్పన్నం అవుతుంది. ఈనాటి సమస్యలను తీర్చగలుగుతుంది."

*ధర్మస్య చేతనాం భూయో జీవితాం కర్తుమధ్య తు*
*అధిష్ఠాత్రీ యుగస్యాస్య మహాప్రజ్ఞామృతమ్భరామ్* (69)

*గాయత్రీ లోకచిత్తే తాం కురు పూర్ణప్రతిష్ఠితామ్*
*పరాక్రమం చ ప్రఖరం కర్తు సర్వత్ర నారద* (70)

*పవిత్రతో దారతాం తు యజ్ఞజాం చ ప్రచండతామ్*
*ప్రఖరాం కర్తుమేవాధ్యాని వార్య మాన్యతాం త్వయా* (71)

**టీకా:** "ఈరోజున ధర్మ చేతనను పునర్జీవింపచేసేందుకు ఈ యుగ అధిష్ఠాత్రి ఋతంభరా గాయత్రిని జనుల మనస్సులో ప్రతిష్ఠించాలి. హే నారదా! ఇంతేగాక యజ్ఞీయ పవిత్రత, ఉదారత, ప్రచండత సర్వత్రా విస్తరింపచేయాలి."

*ప్రజ్ఞాపీఠస్వరూపేషు యుగదేవాలయా భువి*
*భవస్తు తత పతాసాం సృజ్యానామథ నారద* (72)

*సూత్రం సంస్కారయోగ్యానాం ప్రవృత్తీనాం సాంచలేత్*
*నృణాం యేన స్వరూపం చ భవిష్యత్సం స్కృతం భలేత్* (73)

*సహైవ పృష్ఠం భూమిశ్చ పరివర్తన హేతవే*
*నిర్మితా శ్యాద్ యుగశ్యాస్తు సంధికాలస్తు వింశతిః* (74)

*వర్ణానాం సుప్రభాతస్య వేలావర్తన హేతుకా*
*అవాంఛనాయతాగ్లానిః సదాశయవినిర్మితిః* (75)

**టీకా:** "హే నారదా! యుగ దేవాలయాలను ప్రజ్ఞాపీఠాల రూపంలో ఏర్పాటు చేయాలి. ప్రజ్ఞా పీఠాల నుండి సృజనాత్మకమైన,

**అవకాశం తలుపుతట్టినప్పుడే అందుకోవడానికి సిద్ధంగా ఉండాలి.**

సుధారాత్మకమైన ప్రవృత్తుల ప్రసారం ప్రారంభం కావాలి. దానివల్ల మానవుని స్వరూప స్వభావాలతోపాటు భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుంది. అంతేకాక మహా పరివర్తనకు అవసరమైన పీఠిక తయారవుతుంది. యుగసంధికి సంబంధించిన 20 సంవత్సరాల కృషి ఫలితంగా పరివర్తనాభానుడు ఉదయిస్తాడు. అందువల్ల అవాంఛనీయతలు తొలగిపోయి, సదాశయాల రూపురేఖలు తయారవుతాయి."

*గ్రామే గ్రామే సభాకార్యాః గ్రామే గ్రామే కథా శుభాః ।*
*పాఠశాలా, మల్లాశాలా, ప్రతిపర్వా మహోత్సవ ః ॥*

"గ్రామ గ్రామంలో దేవమందిరాలు స్థాపించబడాలి. అక్కడ న్యాయమునకు సంబంధించిన తీర్పులు జరుగుతూ ఉండాలి. పండుగలు, ఉత్సవాలు, సంస్కారాలు జరుపుతూ ఉండాలి. విద్యనేర్పబడాలి. ఆరోగ్య సంరక్షణకు తగినటువంటి చికిత్సా కార్యక్రమాలు నిర్వహించబడాలి. కేవలం మందిరాల నిర్మాణంతో లక్ష్యం నెరవేరదు" అని దీని భావం.

ఆదిశంకరాచార్యులు ఇదే విషయాన్ని మాంధాతకు తెలియచేశారు. వెంటనే ఆయన దేశం నలుమూలలా నాలుగు పీఠాలు నిర్మింపచేశాడు. ఈ నాలుగు పీఠాల ద్వారా జరిగిన ధర్మస్థాపన గురించి వేనోళ్ల పొగిడినా తక్కువే అవుతుంది.

కర్మయోగాన్ని నేర్పగలిగేదే మందిరం అనిపించుకుంటుంది. దేవాలయాలను జన జాగృత కేంద్రాలుగా భావించి, సత్ప్రవృత్తి సద్బుద్ధులను వ్యక్తి వ్యక్తిలో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అప్పుడే యుగపరివర్తన మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఇది యుగ సంధి సమయం. ఈనాడు ప్రపంచంలోని మేధావులు, విద్వాంసులు, జ్యోతిషశాస్త్రవేత్తలు, అతీంద్రియ శక్తులు కలవారు అందరు ఒక్కటై యుగపరివర్తనను ఏక కంఠంతో సమర్థిస్తూ ఉన్నారు. ఈ నాటి విషమ పరిస్థితులకు దేవాలయాలు తమ వంతు పాత్రను నిర్వహించాల్సి ఉంది.

*"ఏకసహస్ర్ నౌ సౌకే ఊపర్ఐసో యోగ్ పరై ।*
*సహస్రవర్ష లౌం సతయుగ్ బీతే ధర్మకీ వేలిచఢే ॥"*

**భావం:–** "19వ శతాబ్ది చివరలో వేలాది సంవత్సరాల కొరకు ధర్మం ద్వారా సుఖశాంతుల రాజ్యం స్థాపించబడుతుంది" అని దాని భావం.

*"తతస్తుమూలే సంభూతే వర్తమానే యుగ్ క్షయే ।*
*యదాచంద్రస్య సూర్యస్య తథా తస్య బృహస్పతిః ॥*
*ఎకరాశౌ సమ్రేష్యన్తి ప్రయత్స్యతి సదాకృతమ్ ।*
*కాలవర్షీ చ పర్జన్యో నక్షత్రాణి శుభానిచ ॥*
*క్షేమ సుభిక్షమారోగ్యం భవిష్యతి నిరామయమ్ ॥*

**భావం :–** "ఒక యుగం సమాప్తమై మరొక్క యుగం అవతరించే సమయంలో అనేక దుర్ఘటనలు, తీవ్రమైన అలజడులు పుట్టుకొస్తాయి. చంద్రుడు, సూర్యుడు, బృహస్పతి, పుష్యమి నక్షత్రం ఒకే రాశికి చేరుకున్నప్పుడు సత్యయుగం ప్రారంభం అవుతుంది. తరువాత శుభ నక్షత్రాలు తమ ప్రభావాన్ని వర్షిస్తాయి. సకల సమృద్ధులు కలిగి ప్రజలు సుఖసంతోషాలతో తుల తూగుతూ ఉంటారు." అని మహాభారతంలోని అరణ్య పర్వంలో వ్రాయబడింది.

పైన తెలిపిన విధంగా గ్రహయోగం మరికొంత ముందుగానే వచ్చింది. ఇంకా ఇతరులు తెలిపిన లెక్కల ప్రకారం పరివర్తనకు సమయం వచ్చేసింది.

విశిష్ట సమయంలో విశిష్ట అవసరాలను ఆపద్ధర్మంగా నిర్వహించాల్సి ఉంటుంది. అగ్ని ప్రమాదాలు, దుర్ఘటనలు, దుర్భిక్షం, వరదలు, భూకంపాలు, యుద్ధం, అంటువ్యాధులు మొదలైనవి సంభవించినప్పుడు సాధారణ పన్నులన్నింటిని వదులుకుని సహాయం చేయడానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇంటికి కప్పు వేసేటప్పుడు, నాట్లు వేసేటప్పుడు, వివాహాది శుభకార్యాలు జరుగుతునప్పుడు కూడా సొంత పనులను విడిచిపెట్టి సహాయం చేయాల్సి ఉంటుంది. యుగసంధి సమయంలో కూడ వ్యక్తిగత లాభాలను, మానసిక లాభాలను విడిచిపెట్టి ప్రపంచానికి సంభవించిన కష్టాలను గట్టెక్కించే ప్రయత్నం చేయాలి. సంకట సమయంలో అన్ని వేళలా మనవంతు కర్తవ్యాన్ని మనం నెరవేర్చి తీరాలి. అప్పుడే దివ్య ప్రేరణలను అందుకుని లోకకళ్యాణంలో భాగస్వాములం కాగలుగుతాం.

అనువాదం – శ్రీ మారెళ్ల కామరాజు

**అవకాశాన్ని జారవిడుచుకుంటే అపజయం తప్పదు.**

తత్వ చింతన

# పరమాత్మ సచ్చిదానంద స్వరూపుడు

ఏ కళాకృతి అయినా తనను తయారు చేసిన వాని యొక్క ఉనికిని, వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది. అదే విధంగా ఈ సృష్టి కూడా తనను సృష్టించినవాడు, రచయిత శిల్పి అయిన పరమాత్మను వ్యక్తపరుస్తుంది. ఏదైనా నిర్మింపబడాలంటే దానిని నిర్మించే వారుండాలి. అందులో ఏ విధమైన సందేహం లేదు.

ఈ సృష్టి అంతా ఒక సునిశ్చితమైన రచన, ఇందులోని ప్రతి అణువు ఒక నిర్ణయింపబడిన నియమానికి కట్టుబడి నడుస్తుంది. వేలకొలది చెట్లు, చేమలు, లక్షలాది ప్రాణులు, తమ తమ నియమాన్ని బట్టి పుడతాయి. చస్తాయి. ఐతే దానివలన సృష్టికి ఎలాంటి నష్టమూ ఉండదు.

సూర్యుడు నిర్ధారిత సమయానికి ఉదయిస్తాడు. నిర్ధారిత సమయానికి అస్తమిస్తాడు. గులాబి మొక్కకు గులాబీ పూవులు, బంతి చెట్టుకు బంతి పువ్వులే పూస్తాయి. మామిడి చెట్టుకు మామిడి కాయలు, జామ చెట్టుకు జామకాయలే కాస్తాయి. ఒకే రంగు, ఒకే ఆకారము, ఒకే రుచి కలిగి ఉంటాయి. చేదు చెట్టుకు చేదు పండ్లు, తీపి చెట్టుకు తియ్యటి పండ్లు కాస్తాయి. అవి కూడా నిశ్చితమైన భూమిలో, నిశ్చితమైన జలవాయు వాతావరణంలో నిర్ణయింపబడిన ఋతువులలోనే కాసి, నిర్ణయింపబడిన సమయంలోనే రాలతాయి.

ఒకే అడవిలో లక్షలాది చెట్లు ఉంటాయి. వేల రకాల చెట్లు ఒకదాని ప్రక్కన ఒకటి ఉంటాయి. కానీ వాటి ఆకులలో కూడా ఏ విధమైన పోలికలు ఉండవు. చింతచెట్టు నుంచి అరటి చెట్టు ఆకుల వరకు వేటి ప్రత్యేకత వాటికుంటుంది. ఒక చెట్టు ఆకు ప్రపంచంలో మరే చెట్టు ఆకుతోను సమానమై యుండదు. వాటిలో ఏదో విధమైన తేడా తప్పకుండా ఉంటుంది. ఇంత వైవిధ్యం, ఇంత తేడాలు తెలిసిన ఆ కళాకారుడు, ఆ శిల్పి ఆ నిర్మాత ఎంత జ్ఞానము కలవాడో, ఎంత చైతన్యవంతుడో, ఎంత సమర్థుడో తెలుసుకోవడం కూడా అంత తేలికైన పనికాదు. ఈ విశ్వాన్ని సృష్టించిన ఆ గొప్ప నేర్పును గమనిస్తే ఆయన ఎంత గొప్ప నేర్పు కలవాడో, ఎంత సమర్థుడో, అన్నది మన ఊహకు కూడా అందదు. ఈ గొప్పదైన విశ్వరచనను గమనించిన మీదట ఆయన ఉనికిని గురించి అనుమానించే అభాగ్యుడెవడుంటాడు.

ఏ చెట్టుకు చెందిన విత్తనాన్నయినా చూడండి. దానిని విడతీసి ముక్కలు చేయండి. దానిని పొరలు పొరలుగా చీల్చండి. వాటిలో ఏ ఒక్కదానిలోనూ ఆ చెట్టుయొక్క ఆకారంగానీ, దాని యొక్క ఉనికి గానీ కనిపించదు. కానీ ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఆ విత్తనాన్ని భూమిలో నాటితే అందులోంచి దానికి సంబంధించిన మొలక పుడుతుంది.

ఎప్పుడైతే చెట్టు మొలుస్తుందో అప్పుడు ఆ విత్తనం యొక్క ఉనికియే కనబడకుండా పోతుంది. కానీ మరల ఆ చెట్టుకు కాసిన పండులోని గింజగా తన ఉనికిని, తన స్వరూపాన్ని ప్రకటించుకుంటుంది. ప్రకృతి యొక్క ఈ విధానం ఎంత విలక్షణమైనది! ఎంత అద్భుతము. ఆశ్చర్యకరమైనది! సునిశితంగా దీనిని పరిశీలిస్తే దానిని గురించి తీవ్రంగా ఆలోచించి చూడండి. ఆ ప్రకృతిని నియమించినవాడు నిర్మించినవాడు, పాలించి పోషించేవాడు ఎవరు? అన్న ప్రశ్న పుట్టక తప్పదు. ఒకే మట్టి నుంచి చేదు, తీపి, కారము, వగరు వంటి అనేక రుచులు గల మొక్కలు పుడతాయి, ఐతే మట్టిలో ఇటువంటి వేరువేరు రుచులు గాని, వాసనలు గాని కనబడవుగదా! ఇన్ని రకాల రుచులు, ఇన్ని వాసనలు, ఇన్ని గుణాలు ఒకే మట్టిలోకి ఎక్కడ నుంచి వచ్చాయి? ఇవన్నీ వాటిని సృష్టించిన ఆ పరమాత్మ యొక్క ఉనికికి గుర్తులేగానీ మరేమీ కావు. ఆయనే భూమి, ఆయనే మట్టి, ఆయనే విత్తనము, చెట్టు, పండు, అన్నీ ఆయనే ఆయనే స్వయంగా రసము, రుచి, గుణము.

ప్రపంచములో లక్షలాది పశు, పక్షులు, జీవజంతువులు ఉన్నాయి. వాటిలో ప్రతి దానికి స్వరూపాలు స్వభావాలు వేరు వేరుగానే ఉంటాయి. పక్షులలో ఏ రకం పక్షి రంగు ఆ పక్షిదే, కూతలో, గుణంలో, స్వభావంలో ఎంతో తేడాలుంటాయి. వాటిలో గల అనంత రూపాలు, అనంత గుణాలు, మొదలైనవి ఆ విరాట్ పురుషుడైన పరమాత్మను గుర్తు చేస్తాయి.

**నిన్ను నీవు నమ్మిన నాడే భగవంతునిపైన నమ్మకం ఏర్పడుతుంది.**

రాత్రింపగళ్లు, చీకటి వెలుతురులు, వేడి, చలవలు, జల, స్థలాలు మొదలైనవన్నీ ఆపరమాత్మ ఉనికికి సాక్షులు. నిప్పు కాలుస్తుంది, నీరు తడుపుతుంది, గాలి కుదుపుతుంది, జీవనం బ్రతికిస్తుంది, మరణము చంపుతుంది. ఇవన్నీ వాటివాటి పనులను ఎవరి ఆజ్ఞతో చేస్తున్నాయి? ఎవరి సంకేతంతో చేస్తున్నాయి? ఆ సత్తా యొక్క సంకేతముతోనే ఈ కార్యకలాపాలన్నీ సాగుతున్నాయి. ఆయన సంకేతం లేకుంటే ఒక్క ఆకు కూడా రాలదు, శ్వాసరావడం, పోవడం జరగదు.

ఇంత గొప్ప రచన ఇంత గొప్ప ఏర్పాటు ఆయన ఏ ఉద్దేశ్యంతో, ఏ కారణంతో, ఎవరికోసమని చేశాడు? ఇది చాలా లోతైన ప్రశ్న. ఒక నిగూఢ రహస్యం. ఈవిషయంలో బుద్ధిశాలుర నిర్ణయం ప్రకారం ఇదంతా పరమాత్మ తనచేత, తనలోనే, తనకోసమే పుట్టించాడు. సృష్టిలో అంతటా నిండియున్న పరమాత్మను, ఆయనలోనే నిండియున్న ఈ సృష్టిని మనిషి అర్థం చేసుకోవడానికి ఈ నిర్మాణము జరిగింది. ఈ విషయాన్ని గ్రహించి దానిని నిర్మించిన ఆ పరమాత్మ జ్ఞానాన్ని పొంది ఆనందాన్ని పొందడానికే ఈ సృష్టి చేయడం జరిగింది.

సృష్టిలో కనబడే ప్రతి పదార్థంలోను కళ్లకు కనబడిన, ఆకారం లేని విస్మయం కలిగించే విలక్షణత కలతో అది పరమాత్మ యొక్క ఒక వెలుగు. దాని సహాయంతో మనిషి చిదానందరూపుడైన పరమాత్మ దగ్గరకు చేరుకుంటాడు. అప్పుడు తన హృదయాన్ని విశాలమొనరించుకుని తన దృష్టిని నిర్మలం చేసుకొని సృష్టిలోని ప్రతి బిందువులోను పరమాత్మ యొక్క వెలుగులను చూడగలుగుతాడు.

పరమాత్మ సత్+చిత్+ఆనంద. అనగా సచ్చిదానంద స్వరూపుడు. ఆయన ఉద్దేశ్యం సమాప్త ప్రాణులకు ఆనందాన్ని కలిగించడం. మనిషి మినహా అన్ని ప్రాణులు ఒక నైసర్గికమైన ఆనందాన్ని పొందుతాడు. మనిషి ఒక్కడే సహజంగా ఆనందాన్ని పొందినవాడుగా కనిపించడు. ఇందుకు అసలైన కారణం అతను పరమాత్మ సంపూర్ణ స్వరూప జ్ఞానాన్ని పొందక పోవడమే. కేవలం ఆనందమే కాదు. సచ్చిదానందుడైన పరమాత్మ యొక్క పూర్ణానుభూతిని మనిషి పొందితేనే నిజమైన ఆనందం కలవాడుగా అతను మారతాడు. సత్, చిత్ – అంటే పరమాత్మ ఉనికి కోసం బంధించిన జ్ఞానాన్ని పొంది ఆనందానుభూతిని సంపాదించాలి.

పరమాత్మ జ్ఞానాన్ని సంపాదించకుండా మనిషి ఇతర పశుపక్ష్యాదులవలె ఆనందాన్ని పొందలేడు. అతను పరమాత్మ జ్ఞానం కలవాడైతేనే నిజమైన ఆనందాన్ని పొందుతాడు.

తన కోరికకు తగినట్లుగానే మనిషికి కావలసిన సాధనాలను ఇవ్వడం జరిగింది. పరమాత్మ మనిషికి అద్భుతమైన శరీరం, విలక్షణమైన వివేకం ప్రసాదించాడు. వాటిని ఉపయోగించి మనిషి అతిసహజంగా పరమాత్మకు సంబంధించిన జ్ఞానాన్ని పొందగలుగుతాడు. తన వివేకశక్తిని వికృతులనుంచి విడిపించి, ప్రపంచాన్ని లోతయిన అనుభూతితో పరిశీలించి, దానిని గురించి లోతుగా ఆలోచిస్తే సహజంగానే అతను పరమాత్మయొక్క ఉనికికి చెందిన జ్ఞానాన్ని పొందగలుగుతాడు.

ఆనందం కోసము వెతుక్కోవలసిన అవసరం మనిషికి ఏ మాత్రమూ లేదు. అది సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మనుంచి పుట్టిన ఈ సమస్త సృష్టిలోను నిండి ఉంది. మనిషి చేయవలసినదల్లా తన అనుభవశక్తిని పెంచుకోవడం. అనుభవశక్తి ప్రబోధానికి అతను ప్రత్యేకంగా తపస్సుగాని, సాధనగాని చేయవలసిన అవసరంలేదు. అతను పరిశీలనాత్మక దృష్టికోణంతో ఈ సృష్టిని పరికించి దాని విశేషాన్ని గమనించి, దాని కర్త యొక్క గొప్పతనాన్ని అర్థం చేసుకుని అతనిని గౌరవించగలిగితే అనుభవ శక్తి పెరుగుతుంది. అది ఒక్క సారి పెరిగితే చాలు, ఇక ఎప్పటికీ తగ్గిపోదు.

స్త్రీ, పురుషులు, పశుపక్ష్యాదులు, చెట్లు, పుట్టలు, ఫల, పుష్పాదులు మొదలగువాటిలో దేనినైనా పరిశీలనాత్మకంగానూ, కుతూహలంతోనూ చూచేసరికి అతనికి దానిని తయారు చేసిన పరమాత్మను చూడవలెనన్న భావం కలిగి తీరుతుంది. ఒక్కసారి ఆ ఆలోచన వస్తే ఆ వ్యక్తి ఏ విధమైన ప్రత్యేక సాధనా లేకుండానే పరమానందాన్ని పొందుతాడు. తనతో సహా ఈ యావత్తు సృష్టికి అతీతంగా సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మ కలడని భావించే వ్యక్తి జన్మ జన్మాంతరాలలో కూడా ఆ అనుభూతిని పొందలేడు. పరమాత్మ ఈ సృష్టిలోనే ఉన్నాడు. సృష్టిలోనివన్నీ పరమాత్మ స్వరూపాలే, ఆయన ఉనికికి నిదర్శనాలే.

*అనువాదం – కె.బి. సోమయాజులు*

*(అఖండజ్యోతి – జులై, 1998)*

**నీ బాధకు కారణం ఏదైనా కావచ్చు - ఆ కారణంతో మాత్రం ఇతరులకు హాని చేయకు.**

ధారావాహిక: పరమేశ్వరుని చిరునామా-9

# ప్రేమమయి - ప్రకృతిమాత

ప్రకృతి చెడ్డ తల్లి కాజాలదు. దాని అపరిమిత స్నేహం అందరిమీదా వర్షిస్తుంది. అనేక ప్రాణులు ఆ ప్రేమను సద్వినియోగం చేసుకుని బలహీనంగాను, అసమర్థులుగాను కనిపిస్తూనే తమ ఉనికిని రక్షించుకుంటాయి.

దక్షిణ అమెరికాలో ఒక పక్షి ఉంది. 'స్లోథ్. ఇది ప్రపంచంలో అన్నింటికంటే అత్యంత సోమరి జీవిగా ప్రసిద్ధి చెందింది. తన జీవితంలో అధిక భాగాన్ని చెట్లమీద తలక్రిందులుగా వేళ్ళాడుతూనే జీవిస్తుంది. తన చుట్టు ప్రక్కల ఉన్న కొమ్మలు, ఆకులే దాని ఆహారం. వర్ష ఋతువు వచ్చి వర్షం కురిసినా తన శీర్షాసన ముద్రను విడువదు. ఎంత వర్షం కురిసినా నీరు జారిపోయే విధంగా దాని రెక్కలు నేరుగా కాక ఆపసవ్యంగా ఉంటాయి. లేకుంటే దాని పేరు అంతరించి పోయిన జీవాల పంక్తిలోకి ఏనాడో చేరిపోయేది.

వేల్ చేప సృష్టిలో అన్నింటి కంటే పెద్ద జంతువు. బైబిల్లో ఇది 'మహామత్స్యంగా వ్రాయబడింది. నిజంగానే అత్యంత పొడవుండే రాక్షసాకార శరీరం ఈ సంబోధనకు అనుగుణంగానే ఉంటుంది. అది శ్వాస వదిలితే సముద్రం అడుగున నీళ్ళు ఎగజిమ్ముతున్నాయేమో అనిపిస్తుంది. ఒకసారి అట్లాంటిక్ మహా సముద్రంలో వేల్ వేట జరిగింది. ఈటె దెబ్బతిన్న మత్స్యరాజు పొట్ట చీరుకుపోయింది. దాని పొట్టలోపల నుండి 6 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పుగల ఒక చేపముక్క బయటపడింది. అప్పటివరకు జీర్ణం కాని 18 అడుగుల షార్క్ చేప అస్థి పంజరం దాని పొట్టనుండి వెలువడింది.

ప్రకృతి గనుక దాని నోటిని చిన్నదిగా చేసి ఉండకపోతే 50 ఏనుగులతో సమానమైన ఇంతపెద్ద చేప సముద్రంలోని జీవులన్నింటినీ అంతం చేసి ఉండేది. దాని దవడలు ఎంత చిన్నవిగా ఉంటాయంటే హేటింగ్ పేరుగల సముద్ర చేప గొంతులో ఇరుక్కొని శ్వాసగతిలో బాధను ఉత్పన్నం చేయగలదు. ఈ విధంగా ప్రకృతి ఇతర సముద్ర జీవులను రక్షిస్తుంది.

ఎగరడం మొదలుకొని వాతావరణంలోని అన్ని హెచ్చు తగ్గులను సహించగలిగేంత శక్తి పక్షుల రెక్కలలో ఉంటుంది. ఈ ప్రకృతి రచనకు సమాంతరంగా ఇప్పటివరకు మనిషి ఏమీ ఆవిష్కరించలేదని వైజ్ఞానికులు గుర్తిస్తారు.

దక్షిణ అమెరికాలో ఉత్తర కార్డిలరా నిస్సారవంతమైన పర్వత ప్రాంతం. పంటలు ఏవీ పండవు. పాలిచ్చే పశువులు కూడా ఉండవు. చెట్లన్నీ ఎండిన ఆకులతో నిండి ఉంటాయి. ఆ ప్రదేశంలో జీవన రక్షణకు తగిన ఏర్పాట్లు చేసి ఉండకపోతే ప్రకృతిని 'దయలేని తల్లి' అని అనుకోవలసిందే. ప్రకృతి తన దయను ప్రదర్శిస్తూ ఒక మొక్కను ఉత్పత్తి చేసింది. అదే 'గో వృక్షము' (కౌ ట్రీ). చూడటానికి ఎండి చనిపోయిన చెట్టులా అనిపిస్తుంది. కాని దాని బోదెనుకోస్తే ఒకరకమైన పాలు వస్తాయి. అవి తియ్యగా, పుష్టికరంగా ఉండడమేకాక అన్నము, కూరలలో ఉండే తత్వాలన్నీ ఆ పాలలో ఉంటాయి. ఆ చెట్టు ఎన్ని పాలు ఇస్తుందంటే ఉదయాన్నే అక్కడి నీగ్రోలు అవి తాగి రోజంతా పనిచేసుకోగలుగుతారు. శాస్త్రజ్ఞులు ఈ పాలను పరిశోధించి పశువుల ద్వారా లభించే పాలతో సమానంగా ఉండడం చూసి ఆశ్చర్యచకితులయ్యారు.

సహారాలాంటి ఎడారి ప్రాంతాలలో ఒంటెనే ఏకైక వాహనంగా తయారుచేయాలని ప్రకృతికి తెలుసు. అక్కడ మనిషికి నీళ్ళు లభించవు. ఒంటెకు నీళ్ళు ఎవరు తాగిస్తారు? ఇదంతా ఆలోచించి ప్రకృతి దానికి ఒక శక్తిని ప్రసాదించింది. అది ఒక్కసారిగా 90 లీటర్ల నీటిని త్రాగి వారాల తరబడి మండుటెండలో తిరుగగలదు.

సింహం ఎలాంటి జంతువునైనా వేటాడుతుంది. కాని 5 మైళ్ళ దూరంలో ఒక జిరాఫీ కనబడిందంటే, దానికంటే దగ్గరలో ఉన్న ఇతర జంతువులు ఉన్నా చమటోడ్చి అయినా జిరాఫీనే చంపడానికి ప్రయత్నిస్తుంది. జిరాఫీ సింహానికి ఒక రకమైన గులాబ్‌జామ్ లాంటిది. అయినా ఇప్పటి వరకు జిరాఫీ జాతి ఇంకా ఎలా బతికి ఉంది? దానికి ప్రకృతి దయ, మమతయే కారణం. ఇది జిరాఫీ చర్మాన్ని ఎలా తయారు చేసిందంటే చెట్ల మధ్య నిలబడితే చాలా దగ్గరగా వెళ్ళినా కూడా గుర్తు పట్టడం కష్టం.

పాముని భూమిలోపల దాగి ఉండే జీవిగా సృష్టించడం చాల మంచిదయింది. లేకపోతే దాని విషం వేలాదిమందిని చంపేసేది.

**విజ్ఞునికి ఇంద్రియాలు స్వాధీనంలో ఉంటాయి.**

జావా మరియు మలేషియాల్లో ఒక రకమైన పాము ఉంది. దానికి రెక్కలుంటాయి. ఎగరను కూడా ఎగురుతుంది. అది ఒక చెట్టునుండి మరో చెట్టుమీదికి ఎగురుకుంటూనే వెళ్తుంది. ఎగిరే సమయంలో ముడుచుకుపోతుంది. దిగేటపుడు ఎగురుతూనే దిగుతుంది. ఈ విధంగా దానికి ఆహార ప్రాప్తి, ఆత్మరక్షణ మరియు క్రీడాకలాపాలకు వివిధ సౌకర్యాలు లభించాయి.

పహిల్వాన్ ముందు తన ఇంటి ఆట స్థలంలోనే కుస్తీ అభ్యసిస్తాడు. అపుడే బయటి వ్యాయామశాలలో పోటీలకు సాహసిస్తాడు. విదేశీ సైనికులతో యుద్ధం చేసేముందు సైనికులు రెండు విభాగాలుగా విడిపోయి నిజంగా శత్రువులవలె యుద్ధం చేస్తారు. అలా చేయకపోతే నిజమైన యుద్ధంలో పోరాడడం కష్టమవుతుంది. ఇలాంటి సూక్ష్మ జ్ఞానాన్ని కూడా ప్రకృతి తన ప్రియమైన మనుష్యేతర జీవులకు ఇచ్చింది.

ఇళ్లలో కనిపించే పిచ్చుకలు ఎంత సరళంగా ఉంటాయో అంతే పోరాటపటిమను కలిగిఉంటాయి. అయితే శత్రువుతో పోరాడే సాహసాన్ని అభ్యాసం ద్వారానే పొందుతాయి. కుడి ఎడమల నుండి దాడి చేస్తూ రక్షించుకుంటుంటే వియత్నాం గెరిల్లా యుద్ధం జరుగుతుందా అనిపిస్తుంది.

వానరానికి (కోతి) దాడి చేయడంలో ఎటువంటి చాతుర్యమూ లేదు. శత్రువును ఓడించను కూడా ఓడించలేదు. అయినా తనను తాను ఎలా రక్షించుకుంటుంది? దానికి ప్రకృతి శత్రువుని బెదిరించి భయపెట్టి తరిమికొట్టే విద్యను నేర్పింది. శత్రువు వస్తే తన దవడలను వెడల్పు చేసి మింగివేసేట్టు చూస్తుంది. శత్రువు భయపడి పారిపోతుంది. అది ఆనందంతో మరోవైపు వెళ్ళిపోతుంది. ఇది ప్రకృతి ఇచ్చిన శిక్షణ కాక మరేమని అనగలం?

కార్బాలిక్ యాసిడ్ ఒక విషపూరితమైన రసాయనం. అది తిన్నవాడెవడూ బ్రతకడు. దాని స్వభావం ప్రకారం అది పెరుగుతూ పోతే ప్రపంచమంతా విషమయం అవుతుంది. మరి పృధ్వి ఇప్పటి వరకు అమరతత్వంతో ఎలా నిండి ఉంటుంది? ప్రొఫెసర్ పి.జి.గ్రే అనే ఆంగ్ల శాస్త్రవేత్త దీనిని పరిశోధించి మట్టిలో ధరతీ మాతను విషం నుండి రక్షించే కీటకాలున్నట్లు కనుగొన్నాడు. ఇప్పటి వరకు అలాంటి 200 కీటకాలు కనుగొనబడ్డాయి.

అతి సామన్యమైన ఒక చిన్న కీటకం శివునిలా అసామాన్యమైన పని చేస్తుంది. కానీ మనిషి మానవత్వం మీద ఆవరించి ఉన్న విషపూరితమైన వాతావరణాన్ని తొలగించడానికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయడు. భగవంతుడు ప్రసాదించిన అసామాన్య శక్తులను కళంకితం చేసుకుంటున్నాడు. ప్రకృతి ప్రసాదించిన ప్రత్యేకతలను మనిషి సద్వినియోగం చేసుకుంటే ఈ భూమి ఎక్కడో ఉందని చెప్పబడే స్వర్గానికేమీ తీసిపోదు. కావలసినన్ని సౌకర్యాలతో, సుఖశాంతులతో నిండిపోయేది.

## కదిలించే కళ్లు

19.సీ॥ స్థూల దేహము తోడ సురజన భూమియౌ
మంచు కొండకు చేరి మసలవలయు
ఎండవానల కోర్చి కొండపైనీవింక
సంయమంబు నెరపి సాగవలయు
క్రూరమృగములందు కూరిమి సూపుచు
మిత్ర భావంబుతో మెసలవలయు
ధైర్యంబు తోడుతన్ తపమాచరించుచు
జనహిత కార్యాలు జరుపవలయు

తే॥ అనెడి గురుదేవు పల్కుల నాదరించి
ఆచరించిన విధమంత తూచినటుల
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

20.సీ॥ సూక్ష్మ దేహమయిన సుడిగాలి వోలెను
క్షణములో పనులన్ని గడపవచ్చు
శీతోష్ణబాధల చింతయే లేకుండ
మనసు వచ్చిన రీతి మనగవచ్చు
ఆకలిదప్పుల ఆరాటమే లేక
వేలాది యోజనాల్ వెడలవచ్చు
చూచుచున్నంతలో సూక్ష్మమౌ వాణితో
కోట్లాది మనములు కూర్చ వచ్చు

తే॥ అనెడి గురుదేవు పల్కుల నాదరించి
ఆచరించిన విధమంత తూచినటుల
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

రచన–మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**ఏం చేయాలో చెప్పేది విజ్ఞానం.**

మనం - మన ఆరోగ్యం

# ఆరోగ్య నియమాలు - దినచర్య

సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండడానికి ఆయుర్వేదంలో దినచర్యకు ప్రాముఖ్యం ఇవ్వబడింది. దినచర్య ఎంత సక్రమంగా ఉంటే అంత ఆరోగ్యవంతులుగా ఉంటారని ఆయుర్వేదంలో వైజ్ఞానికంగా వివరణ ఉంది. గతంలో ప్రాతఃకాలము నిద్రలేచింది మొదలు ఉదయమే నీళ్ళు త్రాగడం పళ్ళు తోముకోవడం, ఆత్మబోధ సాధన మొదలైనవి వివరించబడ్డాయి. ఇప్పుడు నూనెతో అభ్యంగన స్నానం, శరీరాన్ని మాలిష్ చేసుకోవడం, క్షౌరము, వ్యాయామము, మార్నింగ్ వాక్, స్నానము, వస్త్రధారణ మొదలైన వాటిమీద వైజ్ఞానిక చర్చను పరిశీలిద్దాం.

**అభ్యంగం, నూనెమాలిష్**

*అథ జాతాన్న పానేచ్ఛా మారుతఘ్నైః సుగంధి భిః ।*
*యథర్తు సంస్పర్శ సుఖై స్తైలై రభ్యంగ మాచరేత్ ॥*

అజీర్తి లేకుండా బాగా ఆహారం తీసుకోవాలనుకొనేవారు ఆయా ఋతువులను అనుసరించి సుఖాన్ని కలుగచేసే ఉష్ణ శీత వాయువులను పోగొట్టేటటువంటి సుగంధ తైలాలతో శరీర మర్దన చేసుకోవాలి.

*అభ్యంగ మాచరేన్నిత్యం స జరాశ్రమవాతహా ।*
*దృష్టి ప్రసాద మాయు స్వప్న సుత్వచ దార్ఢ్యకృత్ ॥*
*శిరః శ్రవణపాదేషుతం విశేషణ మర్దయేత్*

ప్రతిరోజు నూనెతో శరీరమర్దన చేసుకుంటే వాయు సంబంధమైన వికారాలూ, ముసలితనమూ, అలసటా ఉండవు. స్వచ్ఛమైన కంటిచూపు, ఆయువృద్ధి, మంచి నిద్ర, చర్మ సౌందర్యమూ కలుగుతాయి. శరీరం కూడా దృఢంగా ఉంటుంది. శిరస్సుకూ, చెవులకూ కూడా విశేషంగా మర్దన చేయాలి. ఆవనూనె, నువ్వుల నూనె, సుగంధ నూనె, పుష్పములూ ఇతర ద్రవ్యాలతో కూడిన నూనె మంచిది. ఆవనూనె, నువ్వులనూనె అన్నిటికన్నా శ్రేష్ఠమైనవి.

*స్నేహాభ్యంగాద్యథా కుంభశ్చర్మ స్నేహ మర్దనాత్*
*భవత్యపాంగో దక్షశ్చ దృఢః క్లేశసహోయథా*
*తథా శరీర మభ్యంగా ద్దృఢః సుత్వక్ ప్రజాయతే*
*ప్రశాంత మారుతాబాధం క్లేశ వ్యాయామ సంగ్రహమ్*
*స్పర్శనే చాధికో వాయుః స్పర్శనంచ త్వగాశ్రితమ్*
*త్వచ్యశ్చ పరమోభ్యంగ స్తస్మాత్తం శీలమేన్నరః*
*న చాభిఘాతా భిహతం గాత్ర మభ్యంగ సేవినః*
*వికారం భజతేత్యర్థం బలకర్మణి చక్వచిత్*
*సుస్పర్శోపచితాంగశ్చ బలవాన్ ప్రియదర్శనః*
*భవత్యభ్యంగ నిత్య త్వాన్నరో ల్పోజర ఏవచ*

నూనెతో మాలిష్ చేసిన బండి చక్రాలూ, తోలు మెరుస్తూ బలిష్ఠంగా ఉంటాయి. అలాగే అభ్యంగన స్నానం వల్ల శరీరం అందంగానూ, బలిష్ఠంగానూ ఉంటుంది. వాత సంబంధమైన వికారాలు ఉండవు. శ్రమను ఓర్చుకొనే శక్తి వస్తుంది. వార్ధక్య లక్షణాలు తగ్గుతాయి. **నూనెతో మాలిష్ చేసుకోవడం వల్ల ఆయువు పెరుగుతుంది.** శరీరం కాంతివంతంగా ఉంటుంది.

ఘృతాదష్ట *గుణం తైలం మర్దనేన తుభక్షణే*

నేతికంటే నూనెలో 8 రెట్లు శక్తి ఎక్కువగా ఉంది. కాకపోతే నెయ్యి తినడానికి పనికి వస్తుంది నూనె మర్దన చేసుకోవడానికి ఉపయోగిస్తుంది. మాలిష్ చేసే పద్ధతిని కూడా ఆయుర్వేదంలో ఇలా చెప్పారు. మొదలు నూనెను బొడ్డులో వేయాలి. తర్వాత చేతులూ, కాళ్ళూ, గోళ్ళూ, తొడలు మాలిష్ చేశాక భుజాలూ, మెడ, వీపూ, కడుపూ, చివరకు రొమ్మూ చేయాలి. కాళ్ళూ, భుజాలూ, వీపూ మాలిష్ చేసేటపుడు క్రింద నుండి పైకి కడుపూ, ఛాతీ చేసేటపుడు పైన నుంచి క్రిందకి చేయాలి. మెడను మాలిష్ చేసేటప్పుడు పై నుండి క్రిందికి చేయడం లాభకరం. ఎండా కాలంలో నీడ ఉన్న ప్రదేశంలోనూ, చలికాలంలో ఎండతగిలేచోట చేయాలి. మరీ ఎక్కువ చలిగా ఉంటే గదిలో చేయాలి. చెవులలో నూనె వేసుకోవడం వల్ల వాత సంబంధమైన రోగాలుండవు. అరికాళ్ళ మర్దన వల్ల కంటి కాంతి పెరుగుతుంది. రోజూ చేయలేక పోయినా అవకాశం ఉన్నపుడల్లా మాలిష్ చేసుకోవడం ఆరోగ్యప్రదం. మాలిష్ చేసుకోవడానికి ఎక్కువ సమయం అవసరం లేదు. స్నానానికి కొంచెం ముందుగా మాలిష్ చేయాలి. జ్వరమూ, దగ్గూ, ఉన్నపుడూ భోజనం తర్వాత కనీసం మూడు

**ఎలా చేయాలో చెప్పేది బుద్ధి కుశలత.**

గంటలు వరకు మాలిష్ చేసుకోకూడదు.

## క్షుర కర్మ

వ్యాయామంతో సమానంగా క్షుర కర్మను కూడా నియమంగా చేసుకోవడం శారీరక, మానసిక ఆరోగ్య దృష్ట్యా చాలా మంచిది. దిన చర్యలో ఇది కూడా ముఖ్యమైంది.

*పౌష్టికం వృష్యమాయుష్యం శుచి రూపవిరాజనమ్ ।*
*కేశ శ్మశ్రున ఖాదీశాం కల్పనం సంప్రసాధనమ్ ॥*
*పాపోపశమనం కేశనఖరోమాప మార్జనమ్ ।*
*హర్షలాఘువ సౌభాగ్యకర ముత్సా హవర్ధనమ్ ॥*

చరకుడు దీనిని పుష్టికరమూ, ఆయుష్యవర్ధనమూ, సౌందర్య వర్ధకకర్మ అని పేర్కొన్నారు. సుశ్రుత సంహితలో పాపాన్ని శమింప చేసేదని, సంతోషాన్నీ, సౌభాగ్యాన్నీ, ఉత్సాహాన్నీ కలుగచేసేదని తెలిపారు. నియమంగా క్షౌరం చేసుకోవాలి. ప్రతిరోజూ గడ్డం చేసుకోవడం, గడ్డం పెంచుకోవాలనుకునేవారు దాని శుభ్రతపై శ్రద్ధ వహించాలి. నెలకొకసారో, మూడు వారాల కొకసారో క్షౌరం చేసుకోవాలి. వారానికొకసారి గోళ్ళు కత్తిరించుకోవాలి. గడ్డం చేసుకోవడం, గోళ్ళు కత్తిరించుకోవడం స్వయంగా చేసుకోవాలి. మంగలితో చేయించుకుంటే వాళ్ళ బ్రెష్‌లు ద్వారా అంటురోగాలు రావచ్చు. క్షౌరం తర్వాత స్నానం చేయడం తప్పని సరి అని ఋషులు తెలిపారు.

## వ్యాయామం

దినచర్యలో వ్యాయామం తప్పనిసరి.

*శరీర చేష్టా యా చేష్టా స్థైర్యార్థా బలవర్ధినీ ।*
*దేహవ్యాయామ సంఖ్యాతా మాత్రమా తాం సమాచరేత్ ॥*

శరీర వ్యాపారాలను, దేహాన్నీ స్థిరంగా ఉంచి శరీరాన్ని బలిష్ఠంగా ఉంచగలిగే ప్రక్రియే వ్యాయామం.

ప్రాణరక్షణకు ఆహారం ఎలా అవసరమో, అలాగే వ్యాయామాన్ని ఆరోగ్యానికి సంజీవనిగా పేర్కొన్నారు. కీ ఇవ్వకపోతే గడియారం పని చేయనట్టే వ్యాయామం చెయ్యకపోతే శరీరం నడవదు. వ్యాయామం కామధేనువూ, కల్పవృక్షం లాంటిది. చరక మహర్షి అభిప్రాయం ప్రకారం

*లాఘవం కర్మ సామర్థ్యం స్థైరం దుఃఖ సహిష్ణుతా ।*
*దోషక్షమో అగ్నివృద్ధిశ్చ వ్యాయామా దుపజాయతే ॥*

వ్యాయామం వల్ల శరీరం తేలికపడుతుంది. పని చేసే శక్తీ, కష్టాన్ని సహించే శక్తీ పెరుగుతుంది. శరీరంలోని దోషాన్ని హరించి జఠరాగ్ని పెంపొందించుతుంది. భావప్రకాశం ప్రకారం–

*వ్యాయామ దృఢగాత్రస్య వ్యాధిర్నాస్తి కదాచన ।*
*విరుద్ధం వానిదగ్ధం వా భుక్తం శ్రీఘ్రం విపచ్యతే ॥*

వ్యాయామం వల్ల శరీరం దృఢంగా ఉంటుంది. రోగాలు రావు. రోగ క్రిములను నశింపచేస్తుంది. జీర్ణం కాని ఆహారాన్ని జీర్ణింపచేస్తుంది. లావు తగ్గడానికి వ్యాయామం ఒక్కటే మార్గం. వ్యాయామం చేసేవారిని ముసలితనం బాధించదు. నరాలకు నూతన శక్తి లభిస్తుంది. కండరాలూ, ఊపిరితిత్తులూ బలంగా ఉంటాయి. రక్తం శుభ్రపడుతుంది. మనిషి దీర్ఘాయుష్మంతుడౌతాడు. మంచి గాలి లభించే ప్రదేశంలో వ్యాయామం చేయాలి. విద్యార్థులు ప్రాతఃకాలంలో పరిగెత్తాలి. వీరికి ప్రజ్ఞా యోగ వ్యాయామం అధిక లాభకరం. ప్రతి ఋతువు లోనూ మన శక్తిలో సగం శక్తిని ఉపయోగించి వ్యాయామం చేయాలి. అంతకంటే ఎక్కువగా వ్యాయామం చేయడం హానికరం. నేడు ఏరోబిక్ వ్యాయామమని హెల్త్ క్లబ్బుల్లో చేయిస్తున్నారు. అతి వ్యాయామం అనర్థదాయకమని ఆయుర్వేదం పేర్కొంది.

*హృదిస్థానం స్థితో వాయుర్యదా వక్రం ప్రపద్యతే ।*
*వ్యాయామం కుర్వతో జంతోః స్తద్బలార్ధస్య లక్షణమ్ ॥*
*కక్షా లలాట నాసాసు హస్తపాదాది సంధిషు ।*
*ప్రస్వేదానముఖ శోషాచ్చ బలార్థతద్ధి నిర్దిశేత్ ॥*

వ్యాయామం చేస్తున్నప్పుడు హృదయంలోని గాలి నోట్లోకి వస్తే (రొప్పు) ఇది అర్ధబల లక్షణం, నొసలూ, చేతులూ, కాళ్ళూ వీటిలో చెమట ఎక్కువగా వచ్చి నోరు ఎండిపోతే దీనిని బలార్ధ (బలకరం) అంటారు. ఋషి ఇలా అన్నారు.

*క్షయస్తృణా రుచిచ్ఛ ర్దిరక్త పిత్త భ్రమక్లమాః ।*
*కాసశోషజ్వరశ్వాసా అతి వ్యాయామ సంభవాః ॥*

అధిక వ్యాయామం వల్ల నీరసం, అధిక దాహం అరుచి, వాంతి, రక్త పిత్తమువల్ల తలతిరగడమూ, దగ్గూ, జ్వరమూ మొదలైన శ్వాస సంబంధమైన రోగాలు వస్తాయి.

వ్యాయామం ఎవరు చేయాలి, ఎవరు చేయకూడదని కూడా ఆయుర్వేదంలో చెప్పారు.

**చేయవలసిన విధంగా చేయగలగడం నైపుణ్యం.**

రక్తపిత్తి కృశః శోషి శ్వాస కాస క్షతాతురః ।
భుక్త వాన్ స్త్రీ పుచ క్షీణో భ్రమార్తశ్చ వివర్జయేత్ ॥

రక్తపిత్త రోగి, బలహీనుడూ, శ్వాససంబంధమైన రోగం ఉన్నవారూ, అప్పుడే భోజనం చేసినవారూ, తలతిరగడం మొదలైనవి ఉన్నవారూ వ్యాయామం చేయరాదు.

యోగాభ్యాస శబ్దానికి అర్థం – ఆధ్యాత్మిక ఉన్నతిని ప్రశస్తం చేసే ప్రక్రియ. గురుదేవులు నిర్దేశించిన ప్రజ్ఞాయోగంలో యౌగిక వ్యాయామం వల్ల రెండు విధాలైన లాభాలున్నాయి. ఒకటి ఆసనాల ద్వారా శరీరం బలిష్ఠంగా, రోగరహితంగా ఉండడం, రెండవది ఆత్మిక ఉన్నతివల్ల ప్రజ్ఞ జాగృతమౌతుంది. కొంత సమయం యౌగిక అభ్యాసం చేసినందువల్ల జ్ఞాపకశక్తి వృద్ధి పొందుతుంది. అతి మూత్రవ్యాధి మొదలైనవి ఉండవు. శరీరం రోగ రహితమై యవ్వనం, కాంతీ, తేజస్సూ వృద్ధి పొందుతాయి. దీర్ఘాయుష్మంతులవుతారు.

## ప్రాతః కాల భ్రమణము

దినచర్యలో ప్రాతఃకాలంలో నడవడం చాలా ప్రశస్తమైంది. శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుంది. బుద్ధిపరంగా శక్తివంతులౌతారు. ప్రాతఃకాలంలో వాతావరణం ఉల్లాసంగా ఉంటుంది. ఈ సమయంలో మెల్లమెల్లగా వీచే సుగంధభరితమైన గాలులు చాలా ఆరోగ్యప్రదము. అమృతమయమైన ఈ చల్లని గాలులు శరీరంలో బలమూ, తేజస్సూ, స్ఫూర్తిని నింపుతాయి. రోజంతా ఉల్లాసంగా ఉంటుంది.

ఉదయం నడిచేటపుడు మెడ, వెన్నెముకా నిటారుగా ఉండాలి. రొమ్ము బిగుతుగా ఉంచి రెండు చేతులనూ పూర్తిగా ఊపుతూ నడవాలి. గ్రీష్మ, వర్ష ఋతువులలో శరీరంమీద కొద్దిగా వస్త్రాలుండాలి. నోరు మూసుకుని ముక్కు ద్వారానే శ్వాస పీల్చాలి. నడిచేటప్పుడు శ్వాసను పెద్దగా తీసుకోవాలి. త్వరత్వరగా నడవడం కానీ లేదా నెమ్మదిగా పరిగెత్తడం కానీ చేయాలి. నడుస్తున్నపుడు నాలో శక్తీ ఓజస్సూ, తేజస్సూ వస్తున్నాయి, శరీరంలోని మలినాలు బయటకు పోతున్నాయని భావించాలి. చిన్న పిల్లలయితే పరుగెత్తాలి. వృద్ధులు నడవాలి. మహాత్మాగాంధీకి ప్రతిరోజూ ప్రార్థన తర్వాత నడక అలవాటుగా ఉండేది. మహర్షి దయానంద్ రోజూ పరిగెత్తేవారు.

ఈ విధంగా నడవడం వల్ల మలబద్ధకం ఉండదు. బాగా ఆకలివేస్తుంది. ఎక్కువ కోరికలుండేవారు పరిగెత్తే అలవాటు చేసుకుంటే మనోవికారాలు తగ్గిపోతాయి. ప్రాతఃకాలంలో మనము నడిచే ప్రదేశం శుభ్రంగా ఉండాలి శుభ్రమైన గాలివీస్తూ ఉండాలి. ఇందుకోసం తోటలనుగాని, పార్కులనుగానీ ఎంచుకోవాలి.

పరిగెత్తడానికి స్థలం లేనపుడు ఇంట్లోనే తలుపులు తీసిపెట్టి లయబద్ధంగా పరిగెత్తడం అలవాటు చేసుకోవాలి. ఈ విధంగా 15 నిమిషాలు మొదలు అరగంట వరకు చేయవచ్చు.

## స్నానం

ప్రతిదినము స్నానం చేయడం ఒక వైదికకర్మ. స్నానం చేయడంవల్ల శరీరం శుభ్రపడుతుంది. చర్మం మీది రంధ్రాలు తెరుచుకుంటాయి. నిద్ర, సోమరితనం ఉండవు. మనస్సు శాంతించి పవిత్రంగా ఉండడం వల్ల ఉపాసనా, ధ్యానమూ, చదువూ మొదలైన వాటిలో మనస్సు లగ్నమవుతుంది. బాగా ఆకలివేస్తుంది. వేదాలలో నీటిని అమృతమనీ, జీవనమనీ చెప్పారు.

ఆప్ ఇద్ వా ఉ భేషదీరాపో అమీవచననీః ।
ఆపో విశ్వస్య భేషచేస్తాస్వా ముంచన్తు క్షేత్రియాత్ ॥

నీరు ఒక ఔషధము. రోగాలకు శత్రువు. నీటిలో ఆరోగ్యాన్ని ప్రసాదించే గుణముంది. వేదాల్లో ఇలా ఉంది.

"భిషగ్భో భిషక్తరా ఆపః ।"

జలము ఔషధాలన్నింటిలో పరమ ఔషధము. నీటి మొక్క మహత్యాన్ని తెలుసుకొని జల చికిత్స ద్వారా రోగులకు చికిత్స చేస్తున్నారు. పాశ్చాత్య విద్వాంసులు కూడా నీటి మహత్యాన్ని గుర్తించారు. జర్మనీలోని ప్రసిద్ధ డాక్టర్ లూయీ కూవే కేవలం స్నానంతోనే అనేక రోగాలకు చికిత్స చేసేవారు.

ప్రతిదినం స్నానం చేయడం వల్ల శరీరం పవిత్రమౌతుంది. ఆయుష్షు పెరుగుతుంది. బలవంతులుగా, తేజోవంతులుగా తయారవుతారు. సుశ్రతుడు స్నానం వల్ల ఈ క్రింది లాభాలున్నాయని తెలిపారు.

స్నానం దాహశ్రమ హారం స్వేదకణ్డూ తృషాపహమ్ ।
హృద్యం మలహారం శ్రేష్ఠం సర్వేంద్రియవిశోధనమ్ ।
తంద్రా పాపోపశమనం తుష్టిదం పుం స్త్వవర్ధనమ్ ।
రక్త ప్రసాదనం చాపి స్నానం మగ్నేశ్చ దీపనమ్ ॥

**పిరికివాడు క్షణక్షణం మరణిస్తాడు-ధైర్యవంతుడు ఒక్కసారే మరణిస్తాడు.**

స్నానం దాహాన్ని శమింపచేస్తుంది. ఆలసటా, చెమటా, దురదలూ మొదలైన వాటిని పోగొట్టుతుంది. హృదయాన్ని ప్రసన్నంగా ఉంచుతుంది. మలినాన్ని పోగొట్టి ఇంద్రియాలను శుభ్రపరుస్తుంది. సోమరితనాన్నీ, పాపాల్నీ పోగొట్టడమేకాక పౌరుషాన్ని వృద్ధిపరచి రక్తాన్ని శుభ్రపరుస్తుంది. ఎక్కువ వేడిగా ఉన్న నీటితో స్నానం చేస్తే కళ్ళలోని కాంతి తగ్గుతుంది. చన్నీటి స్నానం వల్ల రక్త పిత్త రోగాలు ఉండవు. ఆరోగ్యమూ, బలమూ చేకూరుతాయి.

శిరస్సువంచి మొదట రెండు మూడు చెంబులు నీళ్ళు పోసుకోవాలి. ఇలా చేసినందువల్ల తలలోని వేడి కాళ్ళద్వారా బయటకుపోతుంది. తలను తడుపుకున్న తర్వాత మిగిలిన అవయవాల్ని తడపాలి. తడిగా ఉన్న ఖద్దరూ మొదలైన వస్త్రములతో శరీరాన్ని బాగా రుద్దాలి, దీనితో చర్మ రంధ్రాలు చాగా తెరచుకుంటాయి. సబ్బుకు బదులు సెనగపిండీ, పసుపు, ఆవనూనె కలిపి వారానికొకటి, రెండుసార్లు శరీరాన్ని తోముకుంటే శరీరం బాగా శుభ్రపడుతుంది. స్నానం తర్వాత శరీరాన్ని బాగా ఆరనివ్వాలి.

జ్వరమూ, విరోచనాలు, చెవి, కంటి జబ్బులున్నపుడూ, జలుబూ, అజీర్తి ఉన్నపుడూ, భోజనం తర్వాత స్నానం చేయరాదు. తడిగుడ్డతో చర్మాన్ని తుడుచుకోవాలి. సాధారణ స్థితికి వచ్చాక స్నానం చేస్తే ఔషధంలా పనిచేస్తుంది.

### వస్త్రధారణ

*కామ్యం యశస్యమాయుష్యమలక్ష్మీఘ్నం ప్రహర్షణమ్ ।*
*శ్రీమత్పరిషదం శస్తం నిర్మలాంబరధారణమ్ ॥*

అనగా శుభ్రమైన వస్త్రములను ధరించినందువల్ల ప్రసన్నత కలుగుతుంది. ఆరోగ్యం, ఆయుష్షూ వృద్ధి పొందుతాయి. దరిద్రముండదు. మంచివాళ్ళ మధ్య కూర్చునే అర్హత కలుగుతుంది. పడుకునే వస్త్రాలు, బయటకు వెళ్ళే వస్త్రాలు వేటికవి వేరుగా ఉండాలి. పూజ చేసుకునే వస్త్రాలు కూడా విడిగా ఉండాలి. ఆరోగ్యంగా ఉండటానికి ఋతువులను అనుసరించి కూడా వస్త్రధారణ ఉండాలి. చలికాలంలో ఉన్ని బట్టలు, ఎండాకాలంలో కాషాయ రంగూ, వర్షఋతువులో తెల్లటి వస్త్రాలు ధరించటం శ్రేయస్కరం.

శీతాకాలంలో వాతమూ, కఫమూ, మొదలైనవి హరించే విధంగా ఉన్ని, పట్టు, ఎరుపూ లేదా ఇతర రంగుల వస్త్రాలను ధరించాలి. కాషాయరంగు మేధస్సును పెంపొందించి, పైత్యాన్నీ హరిస్తుంది. కనుక వీటిని ఎండాకాలంలో ధరించడం శ్రేయస్కరం.

తెల్లటి వస్త్రాలు సుఖాన్ని కలిగిస్తాయి. చలినీ, ఎండనూ కూడా నిరోధిస్తాయి. ఎక్కువ ఉష్ణాన్ని కానీ, ఎక్కువ చలినీ కానీ కలిగించవు. కనుక వర్షాకాలంలో ఈ విధమైన వస్త్రధారణ అవసరం. ఇతరులు కట్టిన వస్త్రాలను కానీ, మురికి వస్త్రాలను కానీ, ఎక్కువ ముదురు రంగు వస్త్రాలను కానీ ధరించరాదు.

తెల్లటి వస్త్రాల వల్ల వ్యక్తిత్వం వికసిస్తుంది. ఆడంబరమైన వస్త్రాలవల్ల వ్యక్తిత్వం క్షీణిస్తుంది. బట్టలు స్వయంగా ఉతుక్కోవడం అలవాటు చేసుకోవాలి. ఇందువల్ల శరీరానికి వ్యాయామం లభించడమే కాక శుభ్రత దృష్టితో కూడా సరైన వస్త్రాలు ధరించిన తృప్తి కలుగుతుంది.

*అనువాదం - కె. అరవిందమ్మ*
*(అఖండజ్యోతి, మే 1999)*

## అభినందన చందనం



**శ్రీ పేరిశాస్త్రి కామేపల్లి, గుంటూరు జిల్లా, కన్వీనర్**
**దృఢ సంకల్పమునకు నిలువెత్తు ఉదాహరణ**

*యుగశక్తి గాయత్రి మాసపత్రిక 698 మందితో చందాదారులను చేర్పించుటలో సరికొత్త రికార్డు స్థాపించిన గాయత్రి పరివార్ నర్సారావు పేట రివెన్యూ డివిజన్ వారిని గాయత్రి చేతనా కేంద్రము అభినందించుచున్నది.*

*పరివార్‌కు మార్గదర్శకులై నడిపించిన గుంటూరు జిల్లా కన్వినర్ శ్రీ పేరిశాస్త్రి గారికి ప్రత్యేక అభినందనలు. శ్రీవేదమాత గాయత్రి మరియు పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ మరియు వందనీయ మాతా భగవతీదేవి శర్మగార్ల దైవాశీస్సులు మీ అనుచరపరివారమునకు సర్వదాలంభించాలని కోరుచూ...*

**గాయత్రీ చేతనా కేంద్రము**
**హైదరాబాద్**

**జడప్రాయంగా ఉన్న అపరిమిత జ్ఞానంకన్నా, చైతన్యరూపంలో ఉన్న పరిమిత జ్ఞానం మిన్న.**



ధారావాహిక: హనుమత్ కథామృతం-22

# ధ్యాన మగ్నుడైన బాల సూర్య హనుమాన్

అమావాస్య రోజున సూర్యగ్రహణంనాడు రాహువు సూర్యుని అడ్డుకోవడం మనందరికీ తెలిసిన విషయమే. పుట్టుకతోనే బ్రహ్మదేవుడు రాహువుకు విషశక్తిని సంపూర్ణంగా ఇచ్చివేశాడు. అంతేకాకుండా అంధకారానికి అధిపతిని చేశాడు. ఒకానొక సందర్భంలో బాలహనుమాన్ రాహువును పిడికిలి బిగించి ఒక్క దెబ్బవేశాడు. అంతే మహా బలవంతుడిని అని చెప్పుకుంటూ, గర్వంగా తిరుగుతున్న రాహువు మూర్ఛపోయాడు. మూర్ఛనుండి తేరుకుని చూచేసరికి ఆరోజు అమావాస్య. సూర్యగ్రహణం జరగాల్సి ఉంది. హడావుడిగా వెళ్ళాడు. కాని ఏం లాభం? అప్పటికే సూర్యభగవానుడు కళావిహీనుడయ్యాడు. కారణం తెలియక రాహువు కంగారుపడ్డాడు. జాగ్రత్తగా పరికించి చూస్తే అర్థం అయింది. బాలహనుమాన్ సూర్యుని యొక్క తేజాన్ని సర్వస్వం తనలో నింపుకుని కుర్చున్నాడు. ఏం చేయాలో తోచక దేవరాజైన ఇంద్రుని దగ్గరకు పరుగులు తీశాడు. రొప్పుకుంటూ విషయమంతా ఇంద్రునికి వివరించాడు.

దేవరాజు ఇంద్రుని ఆశ్యర్యానికి అవధులు లేకుండా పోయాయి. ఎప్పుడూ ఎవరో ఒకరిని తన మాయాజాలంతో భ్రాంతిలో పడవేసే రాహువు ఇప్పుడు స్వయంగా భ్రాంతిలో పడిపోయాడు. రాహువు గురించి ఇంద్రునికి బాగాతెలుసు. రాహువు అమృతం త్రాగక మునుపే మాయావి. అతని మాయాజాలం గురించిన కథలు అనేకం ప్రచారంలో ఉన్నాయి. విష్ణుమూర్తి తన ముగ్ధమోహన రూపంలో అందరినీ భ్రమలో పడవేసినా రాహువు మాత్రం తప్పించుకుని అమృతం త్రాగనే త్రాగాడు. వెంటనే విష్ణుమూర్తి అతని శిరస్సును ఖండించాడు. అయినా ఏం లాభం అతడు చిరంజీవి అయ్యాడు. విష్ణుమూర్తి దండన అతనికి వరదానం అయింది. ఒక్కడుగా ఉన్న రాహువు ఇప్పుడు ఇద్దరయ్యారు. రాహువు-కేతువులకు గ్రహాలలో స్థానం లభించిన తర్వాత రాహువుకు శక్తి సామర్థ్యాలు రెట్టింపు అయ్యాయి. ఆనాటి నుండి రాహువు మీద బ్రహ్మ దేవునికి అభిమానం పెరిగిపోయింది. ఎవరికైనా జాతక చక్రంలో లగ్న కుండి వేసేటప్పుడు రాహువు మహర్దశలో ఉన్నా, అంతర్దశలో ఉన్నా, ప్రత్యంతర దశలో ఉన్నా ఆ జాతకుని జీవితంలో కష్టాలే కష్టాలు ముంచుకువస్తాయి. మానసికవేతలు అతనికి మిత్రస్థానంలో ఉంటాయి. జ్యోతిషశాస్త్రం ప్రకారం రాహువు శుభస్థానంలో ఉంటే మంచి ఫలితాలను పొందే అరుదైన జాతకులుకూడా ఉంటారు. "అటువంటి మహా మాయావి, వికట స్వభావి అయిన రాహువును కూడా ఇబ్బంది పెట్టిన వారు ఎవరై ఉంటారు?" అన్న మీమాంసలో పడిపోయాడు ఇంద్రుడు.

ఇంద్రుడు ఒకసారి తన ఎదురుగా నిలబడ్డ రాహువువైపు చూస్తున్నాడు. ఒకసారి అతని స్థితిని గూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఈ విధంగా కొంతసమయం గడిచిపోయింది. రాహువు ఆలస్యాన్ని సహించలేకపోతున్నాడు. బాలహనుమాన్ కొట్టిన దెబ్బ అతనిని ఇంకా బాధిస్తూనే ఉంది. ఆ బాధనుండి పూర్తిగా కోలుకోనే లేదు. ఉన్నట్లుండి కళ్లు తిరిగిపోతున్నాయి. అయినా బలవంతుడు గనుక తన్నుతాను నిలదొక్కుకుంటూ ఉన్నాడు. అసహనంగా ఇంద్రుడితో అన్నాడు. "దేవేంద్రా! ఏం ఆలోచిస్తున్నావు? నాలాగా నీవు కూడా భ్రాంతిలో పడిపోయావా ఏమిటి? ఇంద్రుడు ఒక్కసారిగా తన ఆలోచనల నుండి తేరుకున్నాడు. "గ్రహరాజా! ఎందుకు తొందరపడుతున్నావు? నేను ఇప్పుడే నీవెంటరాగలను. కాని నీ వంటి మహా పరాక్రమవంతుడినే మట్టి కరిపించిన బాల వానరుడు సామాన్యుడు అయి ఉండడు. అతనిని ఎదిరించాలంటే నేను నా వజ్రాయుధాన్ని సిద్ధం చేసుకోవాలికదా! అని ఆలోచిస్తున్నాను" అన్నాడు సావకాశంగా.

దేవేంద్రుడు కన్నులు మూసుకొని ఐరావతాన్ని స్మరించుకున్నాడు. క్షణంలో ఐరవాతం ప్రత్యక్షం అయింది. ఒక్కసారి తన అస్త్రశస్త్రాలను సరిచూచుకున్నాడు. వజ్రాయుధాన్ని కన్నులకద్దుకుని సర్దిపెట్టుకున్నాడు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఐరావతం మీదకు ఎక్కి కూర్చున్నాడు. రాహువును వెన్నంటి ఐరావతాన్ని నడిపిస్తున్నాడు. పోనుపోను మార్గమంతా అంధకారమయం అయిపోయింది. రాహువును "ఇప్పుడు నన్ను ఎక్కడకు తీసుకునిపోతున్నావు?" అని ప్రశ్నించాడు. ఇప్పుడు

**పురుషుడికి ప్రపంచమే ఇల్లు - కాని స్త్రీకి ఇల్లే ప్రపంచం.**

మనం సూర్యదేవుని వద్దకు పోతున్నాం అన్నాడు రాహువు. ఇంద్రుడు మళ్లీ ఆశ్చర్యంలో పడిపోయాడు, సూర్యమండలం చేరుకునే త్రోవంతా వెలుతురుతోనూ, వేడితోను నిండి ఉండాలి కదా! కన్నుపొడుచుకున్నా కానరాని ఈ అంధకారం ఏమిటి? అనుకుంటూ పోతున్నాడు.

తీరా వెళ్ళి చూస్తే సూర్యుడు నిస్తేజంగా ఒకవైపున కనిపించాడు. దేవేంద్రుడు సూర్యుని చూస్తూనే ఉలిక్కిపడ్డాడు. ఆశ్చర్యపోతూ పరికించిచూశాడు. ఒకమూలన బంగారు వన్నెగల బాలవానరం ధ్యానంలో నిమగ్నమై కనిపించింది. ఇంద్రుడు ఇంతకు పూర్వం అనేకమంది వానరులను చూచాడు. మహా బలవంతులైన వాలి, సుగ్రీవులను చూచాడు. చంచల స్వభావంగల వానర బాలుడు ధ్యానంలో కుదురుగా కూర్చోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అయినా ఈరోజులే అంత. ఇంకెన్ని వింతలు చూడాలో! అనుకున్నాడు.

ఇంద్రుడు హనుమాన్‌వైపే చూస్తున్నాడు. బంగారు వన్నెగల అతని శరీరం చూస్తూ ఉండగానే ఎర్రగా మారిపోతుంది. శరీరంలోని రోమాలన్నీ సూర్యకిరణాల్లాగా ప్రకాశిస్తున్నాయి. చూడగా చూడగా వానరరూపం ధరించిన బాలసూర్యుడు ధ్యానంలో ఉన్నాడా! అనిపించసాగింది. ఒకవేళ బ్రహ్మదేవుడే సూర్యుని యొక్క బాధ్యతను ఈ బాలునికి అప్పచెప్పాడా! అనుకున్నాడు. ఇకముందు ఇతడే లోకాలకు వెలుగును అందిస్తాడేమో! అనుకుంటూ ఉండగానే హఠాత్తుగా తాను వచ్చిన పని గుర్తుకు వచ్చింది.

*(అఖండజ్యోతి – ఏప్రియల్, 2009)*

## నిజమైన దార్శనికుడు

*ఒకరోజున దేవలోకము నుంచి ఒక విశేషమైన విజ్ఞప్తి వినిపించింది. అది ఆకాశాన్ని, పాతాళాన్ని, భూమండలాన్ని కుదిపివేసింది. ఆ విజ్ఞప్తి ఏమనగా – నేటి నుండి ఏడవ రోజున చిత్రగుప్తుని ప్రయోగశాల సింహద్వారం ముందుకు ఎవ్వరైనా, ఏ ప్రాణి ఐనా అంద వికారమైన వస్తువు ఏది తెచ్చినా దానిని ఎంతో అందమైన వస్తువుగా మార్చుకోవచ్చును" అన్నది. ఐతే "ఆ తెచ్చిన వ్యక్తి విధాత యొక్క సత్తా యందు నమ్మకం కలిగి ఉండాలి" అన్న ఒక షరతు కూడా విధింపబడింది. దానిని అక్కడే పరీక్షించడం జరుగుతుందని కూడా తెలుపబడింది.*

*అంతే! ఇంకేముంది? అందరూ తమ దగ్గర ఉన్న అందవికారమైన వస్తువుల పట్టికలను తయారు చేయడంలో మునిగిపోయారు. అందరూ తమ దగ్గర గల అందవికారమైనవి, అసహ్యకరములైనవి ఐన వస్తువులను గుర్తు తెచ్చుకుని వాటిని గురించి ఆ పట్టికలో వ్రాశారు.*

*నిర్ణయింపబడిన ఆ రోజున దేవలోకం నుండి విమానం పంపబడింది. ఆ విమానం అందరినీ సునాయాసంగా దేవలోకానికి జేరవేసింది. అందరూ దేవలోకానికి చేరిన తరువాత విధాత యోగదృష్టితో మూడు లోకాలను పరికించి, రావలసిన వారెవరూ మిగలలేదని నిర్ణయించాడు. స్వర్గ, పాతాళ లోకాలలో ఎవరూ మిగలలేదని, భూలోకంలో మాత్రం ఒక మనిషి ఆనందంలో ఒళ్లు మరిచిపడియున్నాడని గమనించి స్వయంగా అతని దగ్గరకు వెళ్లి, "నాయనా! నువ్వు మా ఆదేశాన్ని విన్నావు గదా! నువ్వు కూడా చిత్రగుప్తుని ఆ స్థానానికి ఎందుకు వెళ్లవు? నీ దగ్గరగల అందవికారమైన, అసహ్యకరమైన వస్తువులను తీసుకువచ్చి వాటిని చక్కని వస్తువులుగా ఎందుకు మార్చుకోవు? అందం పెరిగితే గౌరవము పెరుగుతుందని నీకు తెలీదా?" అని ప్రశ్నించారు.*

*అందుకు అతను ఎంతో వినయంతోను, గాంభీర్యంతోను ఈవిధంగా జవాబిచ్చాడు. "భగవాన్! నేను తమ ఆదేశాన్ని చెవులారా విన్నాను. కానీ తమ చేత చేయబడిన ఈ సృష్టిలో ఏదీ అందవిహీనంగా కనబడదు. అన్నీ మీ చేత చేయబడినవైనపుడు, అన్నింటిలో తమ సత్తా వ్యాపించి ఉన్నప్పుడు అంద వికారానికి చోటెక్కడుంటుంది? నాకీ సృష్టిలో ప్రతి అణువులోను సౌందర్యమే కనబడుతుంది. కావున ప్రభూ! నేను దేన్నినైనా, ఎవరినైనా అందవికారి అని చెప్పే దుస్సాహసం చేయలేను" అన్నాడు.*

*ఆ తరువాత ఆ పరీక్షలో అతనొక్కడేనెగ్గినాడని తెలిసింది. మిగిలిన వారందరికీ నిరాశతో వెనుదిరగవలసి వచ్చింది.*

*ఇది ఒక దార్శనికుని యొక్క విశ్వ విజయము. జగతిలోని అతి అందవికారవస్తువులో కూడా సౌందర్యాన్ని దర్శించగలవాడే నిజమైన దార్శనికుడు.*

**శాంతి అనేది ఆకాశం నుండి ఊడిపడే వస్తువు కాదు.**

కుటుంబ నిర్మాణం

# కుటుంబంలో ధార్మిక వాతావరణాన్ని నెలకొల్పాలి

ధర్మ పరంపరను పునర్జీవింపచేయటానికై కుటుంబంలో ధార్మిక వాతావరణాన్ని పునర్ స్థాపించవలసిన అవసరం ఉంది. సామాన్య జనంలో దార్శనికత, తత్వజ్ఞానం, వివేచనా సామర్థ్యం, ప్రవృత్తి లభించదు. వారు ఆకర్షణ, మానసిక సంతోషాన్ని కల్గించే పనులపట్ల ఆకర్షితులౌతారు. ఇందువల్ల సామాన్యజనుల అంతః కరణలో ఆదర్శాలను, నమ్మకాలను ఏర్పరచటానికై పరోక్ష పద్ధతుల ద్వారా మాత్రమే సాధ్యమౌతుంది. ధార్మిక వాతావరణం ఈ పరోక్ష శిక్షణకు మంచి మార్గమౌతుంది. లోకవ్యాప్తమైన ప్రగతి, సంతోషం పొందే అవకాశాలు ఈ ఉపాయం ద్వారా పొందవచ్చు.

మానవుల బుద్ధి, అంతఃకరణ అనేక రకాలుగా ఉంటుంది. మానవ మస్తిష్కంపై ప్రత్యక్ష శిక్షణ కంటే పరోక్ష శిక్షణ ఎక్కువగా ప్రభావం కలిగిస్తుందని మానసిక శాస్త్రజ్ఞులు స్పష్టం చేశారు. సామాజిక ప్రవృత్తులపై దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా మనస్సుపై కలిగే ప్రభావం ఉన్నంత ఎక్కువగా సామాన్య శిక్షణ ద్వారా కలగదు. ఇందువల్ల ధార్మిక వాతావరణ ప్రాముఖ్యత కొత్త మార్గాల ద్వారా ముందుకు వచ్చింది. ప్రతివ్యక్తీ జీవనోపాధికై పరుగులు తీస్తూ మిగిలిన సమయాన్ని ఉల్లాసంగా, సంతోషంగా గడపాలని కోరుకుంటారు. ఇందువల్ల లోకకల్యాణం కోరుకునే వారు ధర్మ మార్గాల ద్వారా శ్రేష్ఠమైన, మంచి అభిరుచులతో కూడిన వాతావరణాన్ని ఏర్పరచవలసిన అవసరాన్ని గుర్తిస్తారు. లేకుంటే మానసిక సంతోషానికి, ఉల్లాసానికై ఏర్పరచిన వికృతమైన మాధ్యమాల ద్వారా పెరిగే శక్తి కుటుంబ ఆత్మీయతను, సద్భావాన్ని, సామరస్యాన్ని పాడుచేస్తుంది. అప్పుడు మానవుల మనస్సులు ఆందోళనతో, అశాంతితో నిండిపోతుంది. సమాజంలో తృప్తి, ఉల్లాసం, శాంతిని పొందటం దుర్లభమౌతుంది.

కుటుంబంలోనూ, సమాజంలోనూ శుభప్రదమైన పరిణామాలను పొందాలంటే శక్తివంతమైన ధార్మిక వాతావరణం తప్పనిసరి. వికృత వాతావరణం వల్ల, వికృత సాహిత్యం వల్ల చెడు సంస్కారాలు ఎక్కువ ఔతాయి. ఇందువల్ల ధార్మికతను కొత్త మార్గాలలో ప్రతిష్ఠ చేయవలసిన అవసరం ఉంది. ధర్మ స్వరూపాన్ని అర్థం చేసుకునేందుకై స్వాధ్యాయ పరంపర, ధార్మిక క్రియలను సమన్వయం చేయాలి. ఆత్మ చైతన్యాన్ని కల్గించి, వికృత మార్గాలను నిరాకరించి, మంచి పరంపరను వృద్ధిచేసే విధంగా విద్యను రూపొందించాలి. మంచి ధార్మిక పరంపరను ప్రతిఇంట్లోనూ ప్రాచుర్యంలోకి తేవాలి. దీనిలో రెండు ముఖ్య భాగాలుంటాయి. మొదటిది మన ఇళ్ళల్లో జ్ఞాన మందిర మార్గాల ద్వారా స్వాధ్యాయాన్ని అలవర్చుకోవాలి. రెండవది పండుగలలో ఉత్సవాల్లోనూ, సభలద్వారా సామూహిక వాతావరణాన్ని ఏర్పాటు చేయాలి.

ప్రతి కుటుంబంలోనూ ఒక గ్రంథాలయం ఉండాలి. దానిలో మంచి జీవన నిర్మాణానికి సంబంధించిన విద్యను ప్రసాదించే మంచి గ్రంథాలను ఉంచాలి. వీటితోపాటు పత్రికలను, మంచి ప్రేరణను మంచి భావాలను కల్గించే సాహిత్యం ఎక్కడ లభిస్తుందో తెలుసుకుని వాటిని సంపాదించాలి. ప్రతి కుటుంబం నియమిత వేళల్లో అధ్యయనం చేయటం అలవాటు చేసుకోవాలి. చదవటమేకాక అందరూ కలిసి వాటిలో ముఖ్యమైన రహస్యమైన విషయాలను గురించి చర్చించి, ఆలోచనలు, విమర్శలు చేసి ఒక అవగాహనకు రావాలి.

ప్రతి ఇంట్లోనూ ఉపాసనకై నియమిత స్థానం ఉండటం అవసరం. అక్కడ భగవంతుని ప్రతిరూపంగా పటాలను ఉంచాలి. ఇంట్లోని సభ్యులంతా పనులు ప్రారంభించే ముందు అక్కడ చేరి కనీసం 5 నిముషాలైనా కూర్చుని లేక నించుని ధ్యానం చేయాలి. తరువాత ఈశ్వరునికి నమస్కరించి ప్రసన్నమైన మనస్సుతో పనులలో నిమగ్నమవ్వాలి. స్నానం చేయనివారు ముఖం, కాళ్ళు, చేతులు, కడుక్కుని అక్కడ చేరటం వల్ల ఆస్తిక భావన బలపడి ప్రసన్నత, స్ఫూర్తి లభిస్తాయి.

ప్రాతఃకాలంలోనూ, సాయం సమయంలోనూ హారతినివ్వాలి. రెండు సమయాలలోనూ చేయలేనివారు ఒక్కసారైనా తప్పకుండా చేయాలి. బ్రహ్మ ముహూర్తవేళ, గోధూళి వేళలలో పిల్లల కోమలమైన మనస్సులు ప్రశాంతంగా ఉంటాయి. ఘంట, శంఖ, వాద్యనాదాలు, భగవంతుని ప్రతీకలైన ప్రతిమల సౌందర్యం, హారతిలోని దీపశిఖా కాంతులు, సామూహిక భక్తి భావనతో చేసే

**ప్రమాద కారణాలు తొలగిపోతే శాంతి ప్రవేశిస్తుంది.**

వందనాలు పిల్లల మనస్సులపై మంచి ప్రభావాన్ని కల్గిస్తాయి.

దైవ ప్రార్థనతో పాటుగా ఉదయ, సాయంకాల వేళలలో గురువందన కూడా చేయాలి. తల్లిదండ్రులకు, గురువులకు నమస్కరించాలి. చిన్నవారు పెద్దవారికి నమస్కరించి పెద్దవారి నుంచి ఆశీర్వాదాన్ని పొందాలి. సమవయస్కులు పరస్పరం నమస్కరించుకోవాలి. చిన్నవారు నమస్కరించటం మర్చిపోయినట్లయితే పెద్దవారు వారికి గుర్తుచేయాలి.

భోజనం చేసేముందు ఉప్పులేకుండా ఆహార పదార్థాలను 3 ముద్దలు గాయత్రీమంత్రంతో పాటుగా నియమంగా అగ్నికి సమర్పించాలి. దీనికై చిన్న హవన కుండం లేక హవన పాత్రను ఏర్పాటుచేసుకోవాలి. ఈ హవన విభూదిని జాగ్రత్తగా ఉంచి నదిలోకానీ, చెరువులోకానీ కలపాలి. లేకుంటే పొలాలలో చల్లాలి. ఈ విధమైన బలివైశ్య దేవ సమయంలో ఆహారంతో పాటుగా కొంత నేతిని, తీపి పదార్థాన్ని కూడా అగ్నికి సమర్పించినట్లయితే చాలా మంచిది. ఈ బాధ్యతను ఇంట్లోని సభ్యులెవరైనా స్వీకరిస్తే మంచిది. స్త్రీలు నిర్వహించకల్గితే మరీ మంచిది.

పనులన్నీ పూర్తయిన తరువాత రాత్రిపూట కథలు చెప్పుకునే పూర్వకాలపు పద్ధతిని మళ్ళీ ప్రాచుర్యంలోకి తేవాలి. ఆదర్శ పూర్వకమైన మంచి కథల కోసం కథల పుస్తకాలను ఇంటి లైబ్రరీలో ఉంచుకోవాలి. ఈ కథలు పురాణాలలోనివి అయినా అంధ విశ్వాసాలను ప్రోత్సహించే వాటిని వదిలి ప్రగతిశీలమైన వాటినే చెప్పాలి. భూతప్రేతాల కథలు, భయం కల్గించే కథలను ఎప్పుడూ వినిపించకూడదు.

ఈ దైనందిన కార్యక్రమాలతో పాటుగా నామకరణం, అన్నప్రాసన, పుట్టు వెంట్రుకలు తీయించడం, అక్షరాభ్యాసం, మొదలైనవాటిని జరిపించాలి. పుట్టినరోజులు, పెళ్ళిరోజులు కూడా ఈ విధంగానే జరుపుకోవాలి. ఈ సంస్కారాలన్నింటినీ సరియైన పద్ధతిలో చేసినట్లయితే వాటిలో అంతర్లీనంగా ఉన్న సంకల్పాలు, ప్రేరణలను అర్థం చేసుకుని ఆచరించినట్లయితే దీనివలన కుటుంబంలోని వారికి భావనాత్మక ఉత్కంఠ, కల్గుతుంది. హవనం, కర్మకాండ మొదలైన వానిని సరళ మార్గాల ద్వారాను, మంత్రాలలోను, హృదయంతో జిజ్ఞాసతో పెంపొందించుకోవాలి. అది ప్రత్యక్ష జీవితంలో మార్గదర్శక ప్రేరణలతో లాభాన్ని కల్గిస్తాయి. వీటితోపాటుగా విశేషమైన ఉత్సవాలలో, పండుగలలో సార్వజనిక ప్రణాళికలను ఏర్పరచి, ధార్మిక కార్యాలతోపాటూ వ్యాఖ్యానాల ద్వారా, గోష్ఠుల ద్వారా ధర్మానికి గల ప్రాముఖ్యతను వివరించాలి. ఈ విధమైన శ్రేష్ఠమైన ధార్మిక వాతావరణం ద్వారా మాత్రమే కుటుంబాలు మంచి శిక్షణా పరంపరను ముందుకు తీసుకెళ్ళగలవు.

అనువాదం - ఎ.ఆర్.నిర్మల

## అయోగ్యః పురుషోనాస్తి

*యోగ్యులైన శిష్యులు దొరకకపోతే గురువులు నిరాశపడేవారు కాదు. దొరికిన వారినే యోగ్యులుగా తయారు చేసుకునేవారు.*

*యూనాన్ దేశానికి చెందిన ఒక వేదాంతి తన మిత్రునితో - "ప్రజలకు నిజాయితీ గురించి, సదాచరణ గురించి శిక్షణ ఇవ్వడానికి ఒక మంచి ప్రణాళికను తయారు చేశాను. అలాగే విద్యాలయా నిర్మాణానికి కావలసిన ఏర్పాట్లను కూడా చేసి ఉంచాను. కాని మంచి మంచి విద్యార్థులే లభించడం లేదు." అని బాధపడ్డాడు. "అయితే కొన్ని తోడేళ్లను కొని బడిలో పాఠాలు చెప్పు" అని మిత్రుడు హేళన చేశాడు. ఆ మాట వేదాంతికి ఒక సవాలుగా అనిపించింది. పట్టుదల పెరిగింది. ప్రస్తుతం పాఠశాలలో ఇద్దరే ఇద్దరు మూర్ఖ విద్యార్థులున్నారు. మరుసటి రోజునుండి వారికి మిక్కిలి శ్రద్ధగా పాఠాలు చెప్పడం మొదలుపెట్టాడు. రాపాడగా, రాపాడగా బండరాయి కూడా అరిగిపోతుంది. అదే విధంగా ఆ విద్యార్థుల్లో మార్పు రాసాగింది. ఏడాది తిరగేలోగా ఇద్దరూ విద్యల్లో ఆరితేరారు.*

*"కృషితో నాస్తి దుర్భిక్షం" అని గురువు ఆనందపడ్డాడు. గ్రామంలో వెనుకబడిన విదార్థులనే తన పాఠశాలలో చేర్చుకునేవాడు. శ్రద్ధతో, ప్రేమతో, పట్టుదలగా వారికి శిక్షణ ఇచ్చేవాడు. ఇంతకాలం మంచి విద్యార్థులకోసం ఎదురు చూచినందుకు సిగ్గుపడ్డాడు. చూస్తుండగానే ఆయన విద్యార్థులంతా మేధావులుగా మారిపోయారు. క్రమంగా అదే పాఠశాల విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుంది. మొట్టమొదటగా చదవుకున్న ఆ ఇద్దరు విద్యార్థులే విశ్వవిద్యాలయాన్ని నడపడంలో ప్రధానపాత్ర వహించారు. వారిద్దరినీ మొదటినుండీ చూచినవారు "అయోగ్యః పురుషోనాస్తి" అంటూ అభినందించేవాళ్లు.*

**కనిపించేదానికన్నా ఎక్కువ కలిగి ఉండు - తెలిసిన దానికన్నా తక్కువ మాట్లాడు.**



ధారావాహిక : భక్తిగాథ-27

# సమస్త సాధనల ఫలస్వరూపమే భక్తి

వశిష్ఠ మహర్షి యొక్క అమృతవాక్కులు అందరి అంతరంగాల్లో అమృతవర్షం కురిపించాయి. ఒక దివ్యమైన అనుభూతి అందరికీ కలిగింది. ఎన్నడూ అనుభవించని తృప్తి అందరికీ ఈ రోజు కలిగింది.

దేవతలు, ఋషులూ, సిద్ధులూ, దివ్య ఆత్మలందరూ తమను తాము మరచిన స్థితిలో ఉన్నారు. అలాంటి సమయంలో ఆకాశంలో ఒక గొప్ప తేజోపుంజము అందరికీ కనిపించింది. ఆ తేజోపుంజం తమవైపే వస్తుండడం చూచి అందరూ ఆశ్చర్యపోయారు. కానీ బ్రహ్మర్షి విశ్వామిత్రుని ముఖంలో మాత్రం ఆనందం కనిపించింది.

అప్పుడప్పుడే ఉదయిస్తున్న సూర్యునిలో ఇంత ప్రకాశం ఎలా వచ్చింది? ప్రభాత సమయం. పక్షుల మధుర ధ్వనులు ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి. ఏమిటీ ఆశ్చర్యం అని అందరూ తలపోస్తున్నారు. బ్రహ్మర్షి విశ్వామిత్రుల వారు అందరితో ఇలా అన్నారు. "మీరు వ్యాకులపడాల్సినదేమీలేదు. ఆ వస్తున్నవారు అగస్త్యమహర్షి" ఆ దివ్య విభూతి కొరకు వేచి నిలబడి ప్రార్థించండి.

ఆ వస్తున్నది అగస్త్య మహర్షి అని తెలియగానే అందరూ ఆనందంతో పులకించిపోయారు. ఆ మహర్షి దర్శనం ఋషులకూ, దేవతలకూ కూడ దుర్లభమైంది. పాంచ భౌతిక దేహాన్ని వదిలాక అగస్త్య మహర్షి దివ్యదేహాన్ని ధారణ చేసి తనకోసం ఒక దివ్యలోకాన్ని నిర్మించుకున్నారు. ఇది చాలా అపూర్వమైంది. దేవతలుకానీ, సిద్ధులుకానీ, గొప్ప ఋషులుకానీ తమ ఇష్టానుసారం ఆ లోకానికి వెళ్ళలేరు. చివరికి బ్రహ్మ విష్ణువులు కూడా అగస్త్య మహర్షి ఆహ్వానం లేనిదే ఆ లోకానికి వెళ్ళలేరు. కేవలం దేవాధిదేవుడైన మహాదేవుడు మాత్రమే తన ఇష్ట ప్రకారం అక్కడికి వెళ్ళగలరు. తను నిర్మించిన ఆ దివ్యలోకంలో మహర్షి విశ్వ కల్యాణానికి సంబంధించిన ప్రయోగాలు చేస్తుంటారు. అప్పుడప్పుడూ శ్రీరామకథ సభనేర్పాటు చేసేవారు. మహాదేవుడు వచ్చేవారు. ఒక్కొక్కసారి లీలామయుడైన ప్రభువు శ్రోతగా ఉండేవారు, ఒక్కొక్కసారి వక్తగా.

సముద్రాన్ని పానం చేసిన అగస్త్య మహర్షి స్వయంగా తమ వద్దకు రావడం చేత అందరూ ప్రసన్నులైనారు. లేచి నిలబడి సూర్య సమానమైన తేజస్సుగల ఆ మహర్షిని ఆహ్వానించారు. వచ్చీరాగానే ఆ మహర్షి వశిష్ఠ, విశ్వామిత్రులకు నమస్కరించారు. అందరూ ఆ మహర్షికి ప్రణమిల్లారు. దేవర్షిని ప్రేమతో ఆలింగనం చేసుకొని మహర్షి ఇలా అన్నారు. "దేవర్షీ! మీ భక్తి చర్చలు అన్ని లోకాల్లో వ్యాపించాయి. మీ భక్తి ప్రవాహంతో అన్ని లోకాలలో నూతన చైతన్యాన్ని ప్రవహింపచేసిన మీరు అభినందనీయులు.

తర్వాత బ్రహ్మర్షులతో వారిలా అన్నారు. "మీ అందరికీ నా ప్రాణాలు శ్రీరామునితో నివసిస్తుంటాయని తెలుసు. రామనామం నా జీవనతత్వం. దేవాధిదేవుడైన భోలేనాథుడు కూడ రామతత్వాన్నే చెప్తారు. అందుకే మేమిద్దరం ఎల్లప్పుడూ రామలీలలను గురించి చర్చించుకుంటాము. అచ్చట శబరి కథను వింటున్నపుడు శివ, పార్వతుల కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. వారు నారదుని ప్రశంసిస్తూ రామ భక్తురాలైన ఉదుత కథను వినిపించారు. భోలేనాథుడు చెప్పిన ఈ కథ నాకు చాలా బాగా నచ్చింది. మీరు ఆదేశిస్తే నేను మీకు ఆ కథను చెప్తాను.

"కథ వినిపించి మమ్మల్ని ధన్యుల్ని చేయండి" అని అందరూ ముక్తకంఠంతో కోరారు. ఈ అదృష్టాన్ని వదులుకోవడానికి ఎవ్వరూ సిద్ధంగా లేరు. ఇక అగస్త్య మహర్షి రామకథను వినిపించడం పరమ ఆనందదాయకం. వారు కథను ప్రారంభించారు. "సేతు నిర్మాణం జరుగుతున్నప్పటి సంఘటన. మర్యాదా పురుషోత్తముడైన శ్రీరాముడు వానర, భల్లూకములతో సేతు నిర్మాణ కార్యక్రమంలో ఉన్నారు, అందరూ ఈ కార్యంలో తత్పరులై ఉన్నారు. పరమభక్తుడూ, మహావీరుడూ అయిన హనుమంతుడు పర్వతశిలలను త్వరత్వరగా తీసుకొని వచ్చి నలునికీ, నీలునికీ అందిస్తున్నాడు.

"ఇది ఎంతో అపూర్వమైన దృశ్యం" అంటూ కొద్ది క్షణాలు వారు ఆనాటి సంఘటనను గుర్తుచేసికొని మరల చెప్పడం ప్రారంభించారు.

**ఇతరులను ద్వేషించడం అంటే ఎలుకల కోసం ఇంటికి నిప్పు పెట్టుకోవడమే.**

మహావీరుడైన హనుమంతుడు ఉడుత అటూ ఇటూ పరిగెత్తడం చూచాడు. దాన్ని చేతిలోకి తీసుకొని "నీవు ఎక్కడికిలా పరిగెత్తుతున్నావు. నీకు ఏదైన దెబ్బ తగులవచ్చు కదా!" అన్నాడు, దానికి ఆ ప్రాణి "దెబ్బ తగులుతుందని భయపడదమా! రామకార్యంలో ప్రాణం పోవాలన్నదే నా కోరిక" అంది. నీవు రామకార్యాన్ని ఎలా చేస్తున్నావు ఉడుతను అడిగాడు హనుమంతుడు. ఆ "నేను కూడ సేతు బంధనకార్యంలో పనిచేస్తున్నాను. మీ లాగ పెద్ద పెద్ద శిలలను మోయలేను. అందుకని ఇసుకలో పొర్లుతూ ఆ ఇసుకను సేతువు కడుతున్న చోట విదిలిస్తున్నాను ఎక్కువగా చేయలేక పోయినా ఏదో కొద్దిగా సహాయం చేస్తున్నాను". అంది ఉడుత.

ఉడుత మాటలకు హనుమంతుని కంఠం గద్గదికమైంది. దాన్ని రాముని వద్దకు తీసుకెళ్ళాలనుకున్నాడు. ఉడుత అందుకంగీకరించలేదు. ఇలా అంది. "నీకు ప్రభువు స్వభావం బాగా తెలుసు. ఆయన తన భక్తుల్ని వదలడు. తనే స్వయంగా పిలిపించుకుంటాడు. నన్ను నా పని చేసుకోనీ". హనుమంతుని చేతిలో నుండి క్రిందికి దుమికి తన పని చేసుకోసాగింది. హనుమంతుడు ఆశ్చర్యంగా దాని భక్తిని తిలకిస్తున్నాడు. భగవంతుడు సంకట హరుడు. భక్తుడు కష్టంలో ఉంటే తప్పక తన వద్దకు పిలిపించుకుంటాడు. ఇలా అనుకొని ఉడుత తోకను హనుమంతుడు తన కాలి గోళ్ళతో అదిమిపట్టాడు. ఆ బాధకు ఉడుత రామా! రామా! అంటూ గిలగిలలాడింది.

తన భక్తురాలైన ఉడుత ఆర్తనాదానికి శ్రీరాముడు త్వరత్వరగా ఉడుత వద్దకు వచ్చాడు. తన చేతిలోకి తీసికొని ప్రేమతో నిమురుతూ హనుమంతుని వైపు కోపంగా చూచాడు. ఇతనికి ఏమి శిక్ష వేయాలో చెప్పుమని ఉడుతనడిగాడు. దానికి ఉడుత నవ్వుతూ ఇలా సమాధానమిచ్చింది. "సంకట మోచకుడైన హనుమంతుడు ఏ భక్తునికైనా కష్టాన్ని కలిగిస్తాడా? నన్ను నీ వద్దకు చేర్చడానికే అతనిలా చేశాడు. అందుకతనికి బహుమతినివ్వాలి". హనుమంతుని కళ్ళు చెమ్మగిల్లాయి. ప్రభువు చేతితో నిమిరినందుకు ఉడుత శరీరం మీద ఏర్పడ్డ చారలు ఇప్పటికీ కనిపిస్తాయి.

ఈ కథను వినిపించి ఆగస్త్య మహర్షి ఇలా అన్నారు. సమస్త సాధనల ఫల స్వరూపమే భక్తి" మహర్షి మాటలకు పులకించిన నారదమహర్షి నా అంతఃకరణములోని మాటలే మీరు చెప్పారు. నా తదుపరి భక్తి సూత్రం కూడా ఈ మాటనే చెప్తుంది.

'ఫల రూపత్వాత్' (26) ఈ భక్తి నిజంగా ఫల స్వరూపమే.

*అనువాదం - కె. అరవిందమ్మ*

*(అఖండజ్యోతి, ఏప్రియల్ 2008)*

## సంస్కారాలతో చదువు

*చదువు వల్ల సంస్కారం వస్తుంది అన్న మాట అనాదికాలం నుండి ఉన్నదే. కానీ "సంస్కారం వల్ల చదువు వస్తుంది" అని ఒక తండ్రి నిరూపించి చూపాడు.*

*ఒకానొక తండ్రి చదువు సంధ్యలు లేకుండా అల్లరి చిల్లరిగా తిరుగుతూ ఉన్న తన పిల్లల్ని చూచి దిగులు పడేవాడు. చదువుకోమని నయానా, భయానా చెప్పి చూశాడు. కాని వాళ్లు వినే స్థితిలో లేరు. ఇదే విషయం మిత్రులతో చర్చించాడు. వాళ్లు తలా ఒక సలహా ఇచ్చారు. ఎంత ఆలోచించినా ఏం చేయాలో తండ్రికి పాలు పోవడం లేదు. చిట్ట చివరకు గ్రామంలో ఉన్న ఒక వృద్ధుడు చెప్పిన సలహా నచ్చింది. చేసి చూడాలి అనుకున్నాడు. పిల్లల ఎదుట బడి మాటే ఎత్తడం మానివేశాడు. వారు కోరుకున్న ప్రకారం తిని తిరగనిచ్చాడు. కాకపోతే దానిలోనే ఒక క్రమపద్ధతిని అలవాటు చేశాడు. ఆ క్రమపద్ధతిలోనే లోకమర్యాదలు నేర్పించాడు. మంచి అలవాట్లు నేర్పాడు. పెద్దలకు, చిన్నలకు సహాయం చెయ్యండి అనేవాడు. లోకజ్ఞానం తెలియాలి కాబట్టి పుస్తకాలు చదవండి అనేవాడు.*

*క్రమంగా జీవితానికి కావలసిన సంస్కారాలన్నీ ఒకొక్కటీ నేర్పించాడు. మెల్లగా వారికి చదువు పైన ఆసక్తి పెరిగింది. ఇంట్లో ఉంటూనే తండ్రి చెప్పినట్లు వింటూ అన్నీ నేర్చుకున్నారు.*

**హింసకు తల్లి అసత్యం.**



ప్రత్యేక వ్యాసం: శ్రీరామకృష్ణ పరమహంస జయంతి సందర్భంగా (16-02-2010)

# పరమహంస పావన కథాసుధలు

దాదా గురుదేవులు పరమపూజ్యగురుదేవులు శ్రీరామశర్మ ఆచార్యకు గతజన్మలను చూపించారన్న విషయం మనందరికీ తెలిసిందే. శ్రీరామశర్మ కన్నా ముందు జన్మ "శ్రీరామకృష్ణ పరమహంస అని మనం చదువుకున్నాం. ఈ నెల 16వ తేదీ వారి జయంతి సందర్భంగా వారు అందించిన పావన కథాసుధలను చవిచూద్దాం. అందరికీ అందిద్దాం.

**బాల్యం**

బెంగాలు ప్రాంతంలోని హుగ్లీజిల్లాలో 'కామారపుకుర' అనే గ్రామం. ఆ గ్రామంలోని ఖుదీరాం 'ఛటోపాధ్యాయ-చంద్రమణీ దేవి' దంపతులకు నాల్గవ పుత్రరత్నంగా గదాధరుడు జన్మించాడు. గదాధరుడు గ్రామ ప్రజల ఆత్మీయతలో, అనురాగంలో పెరుగుతూ అనేకమైన పురాణాల కథలు నేర్చుకున్నాడు. చదువు మీద శ్రద్ధ చూపలేకపోయాడు. మామిడి తోటలో ఆటలాడుకుంటూ, మట్టితో దేవుళ్ళ బొమ్మలు తయారుచేస్తూ ఆనందంగా కాలక్షేపం చేసేవాడు. నటించడం అంటే అతనికి చాల ఇష్టం. ధైర్య, సాహసాలు ఎక్కువ. ప్రతి చిన్న విషయానికి తన్మయత్వంలో తనను తాను మరచిపోయేవాడు.

ఆ రోజు మహా శివరాత్రి. జాగరణ నిమిత్తం శివాలయంలో నాటకం వెయ్యాలని సిద్ధపడ్డారు. ఏదో కారణంగా శివుని పాత్రధరించే పిల్లవాడు రాలేకపోయాడు. దిక్కుతోచని పరిస్థితిలో గదాధరుని గండం గట్టెక్కించుమని అడిగారు. గదాధరుడు ఆనందంగా ఒప్పుకున్నాడు. శివునిలా భస్మం పూసుకుని, జటాధారి అయి, త్రిశూలం పట్టుకుని వేదికపైకి వచ్చాడు. నటిస్తూ నటిస్తూ తాను నటుడిని అన్న మాటే మరచిపోయాడు. కన్నుల నుండి ఆనంద బాష్పాలు కారిపోతూ ఉంటే స్పృహను కోల్పోయాడు. ఆట మధ్యలోనే ఆగిపోయింది. మరునాటికి గాని అతనికి మెలకువరాలేదు. ఈ విధమైన అనుభవాలు ఆయన జీవితంలో కో కొల్లలు.

**సాధువుల సాంగత్యంలో**

గదాధరునికి ఏడు సంవత్సరాల వయస్సులోనే పితృ వియోగం సంభవించింది. దానితో చావు పుట్టుకల గురించిన మీమాంస అంతరంగంలో నడుస్తూ ఉండేది. గదాధరుని ఇంటి సమీపంలోనే సాధు సంతులు బస చేసే ధర్మశాల ఉంది. అక్కడకు వచ్చే సాధువులతో మాట్లాడుతూ ఉండేవాడు. వారు చెప్పే విషయాలను శ్రద్ధగా ఆలకించేవాడు. చిన్నచిన్న పనుల్లో వారికి సహాయం చేస్తూ ఉండేవాడు. ఆ చిన్నారి బాలుని మనస్సును సన్యాసం ఆకర్షించింది. ఒకనాడు సన్యాసి వేషం వేసుకుని తల్లి వద్దకు వెళ్ళాడు. కట్టుకున్న పంచె చింపి గోచీ పెట్టుకున్నాడు. చంద్రమణీదేవి చాలా దుఃఖించింది. అమ్మను ఓదారుస్తూ బైరాగి వేషాన్ని తీసి వేశాడు. తల్లి తన పెద్ద కుమారుడైన రామకుమారుని పిలిపించింది. గదాధరుని అప్పగించింది.

రామకుమారుడు దక్షిణేశ్వరంలోని కాళికామాత దేవాలయంలో అర్చకుడుగా పనిచేసేవాడు. గదాధరుని తీసుకుని వెళ్ళి తన చేతికింద సహాయంగా ఉంచుకున్నాడు. తమ్ముణ్ణి చదివించాలన్న ప్రయత్నం విఫలమైంది. రామకుమారుని ఆరోగ్యం క్షీణించి అనతికాలంలోనే మరణించాడు. అప్పటినుండి గదాధరుడే ఆలయానికి పూజారి అయ్యాడు. జగజ్జననికి పూజలు చేస్తూ చేస్తూ గదాధరుడు ఆధ్యాత్మిక చింతనలోమునిగిపోయాడు. ఆయన అందరిలా గురువును వెదుక్కుంటూ వెళ్ళలేదు. గురువులే ఆయనను వెదుక్కుంటూ వచ్చారు. తూర్పు బంగాళము నుండి భైరవీ బ్రాహ్మణి అనే ఒక మహిళా సాధకురాలు దక్షిణేశ్వరం నుండి వచ్చింది. ఆమె ఆగమనం గదాధరుని సాధనకు పునాదులను దృఢతరం చేసింది.

1864లో తోతాపురి అనే మహనీయుడు దక్షిణేశ్వర ప్రాంతానికి వచ్చాడు. ఆయన చిన్నతనం నుండే తీవ్రమైన ఆధ్యాత్మిక సాధనలు చేసేవాడు. గదాధరుడు తోతాపురి మహాశయుని నుండి సన్యాసం స్వీకరించాడు. ఆనాటి నుండి శ్రీరామకృష్ణులుగా ప్రసిద్ధి చెందారు. శ్రీరామకృష్ణులు క్రమంగా సాధనలో పరిపక్వత చెందారు. లోకానికి పరమహంసగా దర్శనమిచ్చారు. తీవ్రమైన సాధన ద్వారా జగన్మాతను దర్శించగలిగారు. అనేక మంది శిష్యులను ఆకర్షించి, తీర్చిదిద్దారు. వారిలో అగ్రగణ్యులు స్వామి వివేకానందులు. కట్టుకున్న భార్యలో కూడ జగన్మాతను దర్శించారు. శారదామాత వారి అభిప్రాయానికి అనుగుణ్యంగా భర్తతోపాటు ఆ జన్మ బ్రహ్మచర్యం పాటించింది. ప్రపంచంలో ఎక్కడా కనీవినీ ఎరుగని ఆదర్శజంటగా ఖ్యాతిగాంచారు.

**పావన కథాసుధలు**

శ్రీరామకృష్ణులు ఏ విషయం చెప్పాలన్నా ఉదాహరణలు, ఉపమానాలు, ఉపమేయాలతో కలగలిపి కథలరూపంలో సందేశం అందించేవారు.

**1) గద్ద-చేప-కథ**

ఒక చెరువులో బెస్తవాళ్ళు చేపలు పడుతున్నారు. ఒక గద్ద చూచింది. మహావేగంతో వచ్చి ఒక చేపను ముక్కున కరచుకుని అంతవేగంతోనూ ఎగరసాగింది. అక్కడే ఉన్న కాకుల గుంపు ఒకటి గద్దను చూసింది. చేపకోసమని గద్దను తరుముతూ ఎగరసాగాయి. కాకుల సంఖ్యా బలాన్ని చూచి గద్ద భయంతో

ఎవరు చెప్పినా విను - కొద్దిమందికే సమాధానం చెప్పు.

నాలుగు దిక్కులకు ఎగరసాగింది. కాని కాకులు దానిని వెంబడిస్తూనే ఉన్నాయి. ఎగిరి ఎగిరి గద్ద అలసిపోయింది. కాకుల వలయం నుండి తప్పించుకోలేకపోయింది. ప్రాణాలను రక్షించుకోవాలని చేపను నేలపై పడవేసింది. కాకులు చేపవైపుకు పరుగెత్తాయి. గద్ద చెట్టుకొమ్మపై నిలబడి హాయిగా ఊపిరి పీల్చుకుంది. క్రిందపడిన చేపవైపు చూస్తూ "ఈ పాడు చేపేకదా! నన్నింత హైరానా పెట్టింది? దాన్ని వదిలేస్తే ఎంత హాయిగా ఉన్నాను!" అని ఆలోచించసాగింది.

శ్రీరామకృష్ణులు ఈ కథను చెప్పి "అధికారం కావాలి, డబ్బు కావాలి" అన్న ఆశ మానవుణ్ణి ఎంత గిరికీలు పెట్టిస్తుందో అనుభవంతోనే అర్థం అవుతుంది. ఆశను వదిలేసిన వారే ప్రశాంతంగా జీవించగలుగుతారు అని సందేశం ఇచ్చారు.

### 2) దేవుడున్నాడు-కథ

శ్రీరామకృష్ణుని శిష్యులలో చాలమందికి వివేకానందునితో సహా "దేవుడు ఉన్నాడా?" అన్న జిజ్ఞాస ఎక్కువగా ఉండేది. దానికి శ్రీరామకృష్ణుల సందేశం–

"దేవుడున్నాడు. రాత్రివేళలో ఆకాశంలో నక్షత్రాలు కనిపిస్తాయి. పగలు కనిపించవు. అంతమాత్రాన నక్షత్రాలు లేనట్లేనా? మన మధ్యలో ఒక తెరను ఎవరైనా ఉంచితే ఒకరికి ఒకరం కనిపించం కదా! అంతమాత్రాన మనం లేనట్లేనా? మన అహంకారమే ఆ తెర. దానిని తొలగిస్తే తప్ప దేవుని చూడలేము".

ఒకనికి రాత్రివేళ చుట్ట కాల్చుకోవాలి అనిపించింది. ఇంట్లో నిప్పు లేదు. లాంతరు పట్టుకుని ప్రక్క ఇంటికి వెళ్ళాడు. "కాస్త నిప్పురవ్వ ఇవ్వరా? చుట్ట కాల్చుకుంటాను" అని అడిగాడు. చంకలో బిడ్డను ఎత్తుకుని ఊరంతా వెతికినట్లు ఉందని హేళన చేశారు. భగవంతుని వెదకడానికి బయలుదేరడం కూడా ఇలాంటిదే. భగవంతుడు మన దగ్గరే ఉన్నాడు. శరీరాన్ని, ధనాన్ని మనస్ఫూర్తిగా సమర్పించిన వారికి తప్పక కనిపిస్తాడు. పాలలో వెన్న ఉందని అందరికీ తెలుసు. పాలల్లో చేతులు పెట్టిదేవితే వెన్నరాదు. పాలను పెరుగు చెయ్యాలి. పెరుగును కవ్వంతో తిప్పాలి. అప్పుడుగాని వెన్నరాదు. అదే విధంగా దేవుని దర్శించడానికి కేవలం కోరిక సరిపోదు. సాధన కావాలి. ఇదీ వారి సందేశం.

### 3) ఉప్పుకల్లు - కథ

ఒకసారి ఉప్పుకల్లు సముద్రపులోతును కొలవాలి అనుకుంది. ఉత్సాహంగా సముద్రంలోనికి ప్రవేశించింది. సముద్రంలోని విశేషాలను అందరికీ చెప్పాలి అని ఉబలాటపడింది. కాని ఏం జరిగింది? నీటిని తాకగానే ఉప్పుకల్లు కరిగి పోయింది. నీటిలో కలిసిపోయింది. ఇంకా ఏంచూస్తుంది? ఏం చెబుతుంది? దేవుని సాక్షాత్కారం పొందినవారు కూడా తమ అనుభవాలను ఇతరులకు చెప్పాలనుకున్నా చెప్పలేరు. దేవుని సాక్షాత్కారం పొందాక సాధకుడు మైమరచిపోతాడు. ఆ అనుభూతిని ఇతరులకు అందించడం అనేది అసాధ్యం.

### 4) గురువు-శిష్యుడు-కథ

ఒకసారి నిండుగర్భిణి అయిన ఆడపులి గొర్రెల మందపై దాడిచేసింది. దూరం నుండి చూసిన వేటగాడు బాణం వేసి దాన్ని చంపాడు. దానికి మరణవేదనలోనే ప్రసవ వేదన కలిగింది. పిల్లలను ప్రసవించి చనిపోయింది. ఒక్క పులిపిల్ల మాత్రం మందలోనే మిగిలిపోయింది. దానిని చూసిన గొర్రెలు జాలిపడ్డాయి. తమ బిడ్డలతో పాటే పాలను కుడిపించి పెద్ద చేశాయి. అదికూడ గొర్రెలాగే అరిచేది. గొర్రెలాగానే గడ్డిని మేసేది. గొర్రెలతో పాటే పెరిగి పెద్దపులి అయింది. కొన్నాళ్ళకు మరొక పెద్దపులి గొర్రెలమందపై దాడి చేసింది. గొర్రెలు భయంతో అటు ఇటు పరిగెత్తసాగాయి. వాటిమధ్యలో పెరిగిన పెద్ద పులికూడ భయంతో 'బ్యా బ్యా' అంటూ పరుగులు తీస్తోంది. అడవి పులి దానిని గమనించి గొర్రెలను వదిలి పులిని పట్టుకుంది. నేరుగా చెరువు ఒడ్డుకు తీసుకుని పోయింది. నీటిలో తనరూపాన్ని, మంద పులిరూపాన్ని చూపించింది. ఇద్దరం ఒకటే అని నచ్చచెప్పింది. ఒక మాంసం ముక్కను దాని నోటికి అందించింది. మంద పులికి మాంసం రుచి తెలిసింది. అడవి పులి పెద్దగా గాండ్రించింది. మందపులి కూడ అనుకోకుండా ఒక్కసారిగా గాండ్రించింది. తన రూపాన్ని, స్వభావాన్ని తెలుసుకోగలిగింది. నిజమైన గురువు కూడా తన శిష్యుని స్వరూప స్వభావాలను తన బోధ ద్వారా తెలియచేస్తాడు.

### 5) విరిగిన విగ్రహం - కథ

ఒకసారి రాధాకృష్ణ మందిరంలో పూజారి అజాగ్రత్త వల్ల శ్రీకృష్ణ విగ్రహం కాలు విరిగింది. శాస్త్రప్రకారం విరిగిన విగ్రహాన్ని పూజించకూడదు అని పండితులు చెపుతారు. ఇంతకాలం పూజలందుకున్న విగ్రహాన్ని తొలగించడానికి యజమాని మనస్సు ఒప్పుకోవడం లేదు. దిగులుతో మంచంపట్టాడు. ఒక మహాత్ముడు వచ్చాడు. విషయం తెలుసుకున్నాడు. బుజ్జగించి, లేవదీసి కూర్చోబెట్టాడు. "చూడు నాయనా! నీకుమారునికో, కుమార్తెకో కాలు విరిగిందనుకో. ఏంచేస్తావు"? అని అడిగాడు. "హాస్పిటలుకు తీసుకునిపోయి కట్టుకట్టిస్తాను" అని జవాబు చెప్పాడు". ఇంకేం? ఇప్పుడూ అలాగే చెయ్యి విగ్రహాన్ని రిపేరు చేయించి యథా ప్రకారం పూజలు జరిపించు" అని చెప్పి వెళ్ళిపోయాడు. యజమానికి నిజమే అనిపించింది. అలాగే చేయించాడు. తొందరలోనే కోలుకున్నాడు.

"శాస్త్రాలు సూచించలేని పరిష్కారాన్ని వివేకంతో మనమే చూపించాలి" అంటూ కొన్ని విషమ సమస్యలకు పరిష్కారం చూపేవారు. అమృతాన్ని చిందించే ఇలాంటి కథలు వేలకు వేలుగా నిలిచి ఉన్నాయి.

★★★

**ఎవరేమన్నా స్వీకరించు - నీ అభిప్రాయాన్ని గౌరవించు.**



### చతుర్ముఖీ సాధన : గురుదేవుల అమృతవాణి-3

# సమర్పణకు సరిఅయిన సమయం ఇదే

రాజస్థాన్‌లో ఒక వ్యక్తి కొన్ని మంచం పట్టెలు తీసుకుని సంతకు పోయాడు. ఒక ఎడారి ప్రదేశంలో సంత జరుగుతోంది. అతను ఒక మూలకు నిలబడి మంచం కావాలా? మంచం కావాలా? అని కేకలు పెడుతున్నాడు. 'వెల రెండు రూపాయలే' అని అరుస్తున్నాడు. ఆ మాటవిని చాలా మంది ఆశతో పరుగులుదీస్తూ వచ్చారు. రెండేసి రూపాయలు ఇచ్చి మంచాలు ఇమ్మన్నారు. ఆవ్యక్తి అందర్నీ కూచోమన్నాడు. "రెండు రూపాయలకు మంచం రాదు. నా మంచాలకు మూడు కోళ్లు లేవు. రెండు పట్టెలు లేవు. మీరిచ్చిన రెండురూపాయలకు ఒకపట్టె, ఒక కోడు వస్తుంది. తీసుకుని వెళ్లండి." అన్నాడు. ఒక పట్టెను తీసుకుంటే మాకేం ఉపయోగపడుతుందీ అని ఆలోచించడం మొదలు పెట్టారు.

మిత్రులారా! సరిగ్గా మీ పరిస్థితి కూడా అలాగే ఉంది. భగవంతుడి మీద నమ్మకం లేదు. అవగాహన లేదు. సేవను గురించిన ఆలోచన లేదు. చవకగా వచ్చింది కదా అని ఒక పట్టె పట్టుకుని వేళ్ళాడినట్లు మీరు ఒక మాలను మాత్రమే పట్టుకుని వ్రేలాడుతున్నారు. మాలను తిప్పి తిప్పి వేళ్లు అరిగిపోతున్నాయి. వృద్ధాప్యంలో, నిద్రలో కూడా మాలను తిప్పుతూనే ఉంటారు. మాల గొప్పదే, జపం అవసరమే, కాని అది ఒక్కటే సరిపోదు. దానితో పాటు మీ జీవితంలో సేవకు కూడా స్థానం ఇవ్వాలి. మీ సమయంలో కొంతభాగం భగవంతునికి ఖర్చు పెట్టాలి. కొంత భాగం మీ కోసం, మీ కుటుంబసభ్యుల కోసం ఖర్చుపెట్టాలి. అంటే ఏడు గంటలు నిద్ర కోసం, ఎనిమిది గంటలు ధన సంపాదన కోసం, స్నానం, భోజనం మొదలైన వాటికి 5 గంటలు, మొత్తం 20 గంటలు ఖర్చయ్యాయి. మిగిలిన నాలుగు గంటలను భగవంతునికి సమర్పించాలి.

ఇప్పుడు భగవంతుడు లోక కల్యాణకరమైన పనులలో నిమగ్నం అయ్యాడు. దానికి సహాయంగా మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాడు. భగవంతుని పని చేయడానికి ఇప్పుడు మనకు అవకాశం వచ్చింది. ఒకానొకప్పుడు శ్రీరామచంద్రునికి కోతులు, ఎలుగుబంట్లు, నలుడు, నీలుడు, జటాయువు మొదలైన వారంతా సహాయం చేశారు. ఆంజనేయుడి సంగతి చెప్పేపనే లేదు. ఆయన ఎప్పుడూ ప్రక్కనే ఉండి రాముడికి సహాయం అందించాడు. తరువాత ద్వాపర యుగంలో శ్రీకృష్ణునికి గోపబాలురు అందరూ సహాయం అందించారు.

ఈ విధంగా రాముడికి, శ్రీకృష్ణునికి సహాయం చేసిన వారంతా దేవతలు అయ్యారు.

మిత్రులారా! ఇది కలియుగం. భగవంతుడు అవతరించబోతున్నాడు. ప్రపంచంలో ధర్మం దారి తప్పినప్పుడు సరిఅయిన త్రోవలో పెట్టడానికి భగవంతుడు అవతరించాలి, అవతరించి తనవంతు కార్యం నిర్వహించాలి. దానికి గాను మనం అందరం మనవంతు సహకారం అందించాలి. మానవుడు వినాశనం దారిలో పరుగులు తీస్తున్నాడు. ప్రపంచాన్ని ఒక్క కుదుపు కుదిపే సమయం దగ్గరపడుతోంది. కాని మానవ జాతి మొత్తం నశించదు. మానవ అభ్యున్నతికి పాటు పడాలి. ప్రమాదం ముంచుకవచ్చినప్పుడు రక్షించుకోవడానికి అదొక్కటే మార్గం. ఈ నాడు మానవత యొక్క రథం "స్థాపయమేచ్యుత" అన్నట్లుగా రెండు మార్గాల మధ్య నిలబడి ఉంది.

భగవంతునితో కలసి పని చేయడానికి ఇదే సరైన సమయం భగవంతునికి సహకరించేవారి జాబితాలో నీ పేరు వ్రాయబడి ఉండాలి. నవయుగ నిర్మాణంలో పాల్గొనే జాగృతాత్మలనే పార్షదులు అంటారు. మొట్టమొదట సూర్యోదయం పర్వత శిఖరాల మీద జరుగుతుంది. తరువాత క్రమంగా క్రిందికి వస్తుంది. అదే విధంగా యుగం యొక్క పిలుపు అందరికన్నా ముందు జాగృతి చెందిన ఆత్మలు గల మనుజులకు వినిపిస్తుంది. ఈ ఆపద సమయాన్ని గట్టెక్కించాలి అనుకుంటే మీ స్వార్థాన్ని, లోభాన్ని వదలుకోవాలి. కాదనుకుంటే ఎవరి కర్మవారిది. ఇప్పుడు అందరికీ రెండే రెండు కార్యక్రమాలు ముఖ్యంగా కనబడుతున్నాయి. పొట్టనింపుకోవడం మొదటిది. పిల్లల్ని కనడం రెండవది. ఈగలు, దోమలు, క్రిమికీటకాలు పొట్టకోసమే మరణిస్తాయి. అదే కోవలో మానవులు కూడా ఉన్నారు. ఈ సమయంలో కావలసింది అదికాదు. భగవంతుని కోసం భక్తుని జీవితంలో ఒక కల్లోలం కనిపించాలి. అతని ఆలోచనలో మార్పు రావాలి. ప్రజ్ఞావతారం వచ్చినప్పుడు అలాగే అనిపిస్తుంది.

**స్వర్గాన్ని నరకంగా చేసేది, నరకాన్ని స్వర్గంగా చేసేది మనస్సే.**

గాయత్రిని నేను ఋతంభరా ప్రజ్ఞ అంటాను. వేదమాత, దేవమాత, విశ్వమాత అంటాను. గాయత్రీ మంత్రం చాలా శక్తివంతమైంది. నీతి శాస్త్రం, సమాజ శాస్త్రం, ధర్మశాస్త్రం మొదలైన వాటికి అన్నింటికీ ఆధారభూతమైంది. ఒకే భాష, ఒకే మతం, ఒకే సంస్కృతి, ఒకే రాష్ట్రం అంటూ, ప్రపంచం మొత్తాన్ని ఐక్యత అనే సూత్రంతో బంధించి ఉంచే సంభావనలు అన్నీ ఈ మంత్రంలో ఇమిడి ఉన్నాయి. వికృతమైన వాతావరణంలో, ప్రకృతి వైపరీత్యాలతో సర్వనాశనం అనే సమస్యకు కూడా గాయత్రీ మంత్రమే పరిష్కారమార్గం అవుతుంది.

మీరు చూస్తూనే ఉన్నారు. చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని సంఘటనలు జరిగిపోతున్నాయి. వరదలు వస్తున్నాయి. పల్లెలను, పట్టణాలను ముంచివేస్తున్నాయి. తుఫాన్లు వస్తున్నాయి. సునామీలు వస్తున్నాయి. భూకంపాలు వస్తున్నాయి. వేలాదిమంది, లక్షలాది మంది అల్లకల్లోలం అయిపోతున్నారు. లెక్కలేనంతమంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అయినా ప్రకృతి మాతకు ఆగ్రహం చల్లారడం లేదు. మానవునిలోని ఆలోచనలు వికృతరూపం దాలుస్తున్నాయి. ఒక దేశంవారు శత్రుదేశాలపైన విషవాయువును ప్రయోగిస్తున్నారు. అక్కడి ప్రజల ఆరోగ్యం చెడిపోతోంది. కొందరు పిచ్చివారయిపోతున్నారు. ఎక్కడ చూచినా ప్రకృతి విషవాయువులతో నిండిపోతోంది. దూరాలోచనలు తగ్గిపోతున్నాయి. దురాలోచనలు పెరిగిపోతున్నాయి. నైతిక విలువలను పూర్తిగా మరచిపోతున్నారు. ఈనాడు మానవుడు శారీరకంగా రోగగ్రస్తుడు. మానసికంగా రోగగ్రస్తుడు. ప్రవర్తనా దృష్టిలో రోగగ్రస్తుడు. ఆచరణ దృష్టితో రోగగ్రస్తుడు. ఆలోచనలు అన్నీ రోగకారకాలే. ఇదే ఈనాడు మెదడుకు పడుతున్న జబ్బు. వీటన్నింటికీ దూరం కావాలంటే గాయత్రీమంత్రమే శరణ్యం.

ఇలాంటి స్థితిలో మనమంతా ఏం చేయాలి? పరిస్థితిని ఒక దారికి తేవాలంటే ఒక్క భగవంతుని చేతిలోనే ఉంది. అది ఏవిధంగా జరుగుతుంది? వ్యక్తిగా అవతరిస్తాడా? లేదు. భగవంతుడు ఎప్పుడూ వ్యక్తి రూపంలోరాడు. వాయువు రూపంలో వస్తాడు. ప్రవాహం రూపంలో వస్తాడు. ఉద్యమరూపంలో వస్తాడు. రామచంద్రమూర్తి వచ్చినప్పుడు ఒంటరిగా రాలేదు. ఆయన వెంట అనేకమంది వచ్చారు. రామచంద్రునికి లక్ష్మణుడు, హనుమంతుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు, విభీషణుడు మొదలైనవారంతా సహాయం చేశారు. రావణాసురుని రాముడు ఒక్కడే వధించలేదు. అందరూ కలసి యుద్ధం చేశారు.

అందువల్ల బాగా అర్థం చేసుకోండి. మహాపరివర్తన అనేది ఏ ఒక్కరివల్ల జరగదు. సమాజం అంతా కలిసి చేసినప్పుడే అది సఫలం అవుతుంది. ఒక తుఫాను లాగా రావాలి. ఒక ఉద్యమం నడవాలి. గాంధీజీ ఆంగ్లేయులను ఒక్కడే వెళ్లగొట్టాడా? ఆయనవెంట పెద్ద సమూహం ఉంది. మనం నిష్కళంకుడు అనుకుంటున్న రాముడు నిష్కళంకుడు కాదు. చాకలివానిచేత నిందపడ్డాడు. శ్రీకృష్ణుడు నిష్కళంకుడు కాదు. శమంతకమణిని కాజేశాడన్న కళంకాన్ని భరించాల్సి వచ్చింది. నిష్కళంకమైన ప్రజ్ఞావతారం రాబోతూ ఉంది. మీరు ఆ అవతారానికి చేయూత ఇవ్వాలి. భుజానికి భుజంకలిపి నడవాలి. అంతేకాని మిమ్మల్ని సోమరులుగా కూర్చోబెట్టి అన్ని పనులు పూర్తిచేయడం భగవంతుని డ్యూటీ కాదు. ఏ పనిని అయినా భగవంతుడు సమర్థులు అయిన మానవుల చేతనే చేయిస్తాడు.

ఒకసారి నారదుడు విష్ణుమూర్తి దగ్గరకు వెళ్లి 'నాకోరిక తీర్చు' అన్నాడు. భక్తునికి కోరికలు ఉండడమా! ఆశ్చర్యపోయాడు శ్రీహరి. "నేను ఒక స్వయంవరానికి పోతున్నాను. అమ్మాయికి నేను అందంగా కనిపించేట్లు చెయ్యాలి." అని కోరుకున్నాడు. శ్రీహరి మౌనం వహించాడు. దాన్ని అంగీకారంగా తీసుకున్నాడు నారదుడు. ఆ పిల్లమరొకరిని పెండ్లి చేసుకుంది. నారదునికి కోపం వచ్చింది. నారాయణ మూర్తిని నానా మాటలూ అన్నాడు. "నేను ఇంత వరకు ఏ భక్తుని కోరికలు తీర్చలేదు. ప్రహ్లాదునికి తీర్చలేదు. భగీరథునికి తీర్చలేదు. హరిశ్చంద్రునికి తీర్చలేదు. పైగా అందరినీ ఇంకా ఇంకా కష్టాలు పెట్టాను. భగవంతుని దగ్గర కోరికలు తీర్చుకునే అవకాశం లేదని తెలిసిందికదా! కోరికలను వదిలిపెడితేనే భగవంతుని ప్రేమను పొందుతారు" అని ఉపదేశించాడు.

ఇతరులకోసం జీవించేవారికి తమకు అంటూ ఏమీ మిగలదు. తిండి, బట్టతప్ప ఇంకేమీ అవసరం లేదు. తీర్చుకోవడం మొదలు పెడితే కోరికలకు అంతే ఉండదు. ఇతరులకు పంచి ఇవ్వడంలోనే ఆనందాన్ని అనుభవించాలి. మిమ్మల్ని సేవాభావానికి సమర్పించుకోండి. సేవవల్లనే సాధన ఫలిస్తుంది. ఇతరులకు సేవ చేస్తూ జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకోండి. "సాధన, స్వాధ్యాయం, సంయమం, సేవ" నాల్గింటి ద్వారా మీలోపాలను సరిచేసుకోండి.

*(27.09.1979న శాంతికుంజ్‌లో ఇచ్చిన ప్రవచనం)*

**మనకంటూ స్థిరమైన నిర్ణయం లేకపోతే - ఇతరుల అభిప్రాయాలు మనపై రుద్దబడతాయి.**

ఆధ్యాత్మిక విజ్ఞానం

# వైజ్ఞానిక ఆధ్యాత్మిక యొక్క మూల మంత్రం గాయత్రీ మహా మంత్రం

వైజ్ఞానిక ఆధ్యాత్మికత యొక్క మూల మంత్రం గాయత్రీ మహా మంత్రం. దీనిలో వైజ్ఞానిక ఆధ్యాత్మికతా సిద్ధాంత సంరచన, దీని ప్రయోగ విధి విధానం రెండూ ఉన్నాయి. ఇలా అంటూ యుగఋషి ఆచార్యుల వారు అక్కడ ఉపస్థితులై ఉన్నవారి వైపు చూచారు. ఆయన చూపులో ప్రతిభ, ఆత్మీయతా భావము రెండూ కనిపించాయి.రాయపూర్ కార్యకర్త రవిశంకర్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఉన్నతాదర్శాలు గల కార్యకర్తలు సుమారు 150 మంది ఉన్నారు. ఈ రోజున ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని రాయపూర్. ఆ రోజులలో అది మధ్యప్రదేశ్‌లోని భాగం. పరమపూజ్య గురుదేవులకు మానవులందరు సమానమైనప్పటికీ, ఈ ఛత్తీస్‌గఢ్ క్షేత్రం మాత్రం ప్రత్యేకమైనది. ఈ దండకారణ్య వాసులపై మర్యాదా పురోషత్తముడైన రామునికి ఎక్కువ ప్రేమ, అభిమానం ఉండేవి. తిరిగి ఈ యుగంలో శ్రీరాంకు ఈ క్షేత్రంలోని జనులు చాలా దగ్గరివారిగా అనిపిస్తుండేది. వారు ఎప్పుడు పిలిచినా ఛత్తీస్‌గఢ్ తప్పనిసరిగా వచ్చేవారు.

సమావేశానికి రామకృష్ణమిషన్, రాయపూర్‌లోని స్వామి వివేకానంద ఆశ్రమ అధ్యక్షుడు స్వామి ఆత్మానందుల వారిని పిలిచారు. స్వామి ఆత్మానందుల వారికి యుగ ఋషి గురుదేవుల మీద అత్యంత అభిమానం. గురుదేవులు ఎప్పుడు రాయపూర్ వచ్చినా తప్పనిసరిగా కలిసేవారు. ఆయన ఆహ్వానంపై ఆత్మానందుల వారు ఒకటి రెండుసార్లు మథురలోని గాయత్రీ తపోభూమికి వేంచేశారు. ఆత్మానందుల వారు ఛత్తీస్‌గఢ్‌లోని మారథర్ నుంచి ఒక మైలు దూరంలో ఉన్న బరబందా గ్రామంలో జన్మించారు. రాయపూర్ జిల్లాలోని కపసదా గ్రామంలో ఎక్కువగా ఉండేవారు. నాగపూర్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేశారు. వీరు M.Sc, I.A.S. పరీక్షలు ఒకే సమయంలో వ్రాసి రెండింటిలోను మొదటి రాంక్ సంపాదించారు. కాని వీరు ఉద్యోగం విడిచిపెట్టి, లోకసేవా మార్గం ఎన్నుకుని శ్రీరామకృష్ణ మిషన్‌లో సన్యాసం స్వీకరించారు. బాగా చదువుకున్న ఇద్దరు సోదరులు కూడా ఈయనతో కలిశారు.

స్వామి ఆత్మానందుల వారికి త్యాగబుద్ధి, సేవాభావం వల్ల యుగఋషి అత్యంత ప్రీతి పాత్రుడయ్యారు. ఇంతేగాక అతని వైజ్ఞానిక ఆధ్యాత్మికతపై అభిరుచి ఇంకా దగ్గర చేసింది. ఈ సమావేశంలో ఆత్మానందులవారు యుగఋషితోపాటు వేదికపై కూర్చుని వారి మాటలు జాగ్రత్తగా వింటున్నారు. యుగఋషి ఇలా అంటున్నారు– "గాయత్రీ మహా మంత్రంలో ఓంకారంతో పాటు మూడు వ్యాహృతులు, మూడు చరణములలో తొమ్మిది శబ్దములు, 24 అక్షరములు ఉన్నాయి. ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్. ఈ అద్భుత మహామంత్రంలో పరమేశ్వరుని సత్య ప్రకృతి యొక్క తత్వములు, వాటి సంయోగంతో జరిగే సృష్టి రచన యొక్క సంపూర్ణ విజ్ఞానం సూత్ర రూపంలో ఉన్నాయి. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణిత శాస్త్రముల కంటే అత్యంత మహత్వపూర్ణమైనది. దీనిలో సృష్టి విజ్ఞానం, బ్రహ్మాండ విజ్ఞానమే గాక ఆత్మ విజ్ఞానం, సాధనా విజ్ఞానాలు కూడా ఉన్నాయి."

యుగఋషి మాటలు అందరూ జాగ్రత్తగా వింటున్నారు. ఆయన వాణిలో చాలాకాలంగా చేస్తున్న గాయత్రీ సాధనానుభవం, తపస్సు యొక్క తేజం ప్రతిబింబిస్తున్నాయి. ఓంకారమే పరమేశ్వరుడు. దీని సంయోగంతో, భూర్భువః స్వః – ఈ మూడు 'సత్వము, రజస్సు, తమస్సు' గుణముల మూల ప్రకృతి తన ఇరవైమూడు తత్వములను అభివ్యక్తీకరిస్తుంది. గాయత్రీ మంత్రంలోని 24 అక్షరములు మూల ప్రకృతిలోని ఇరవైమూడు తత్వములు–మహా తత్వములు, అహంకారం, పంచ తన్మాత్రలు, మనస్సు, పంచ మహాభూతములు, పది ఇంద్రియముల వీటి విజ్ఞానం చెప్పుతున్నాయి. ఈ సూత్రములు సాంఖ్య దర్శనములో చెప్పబడ్డాయి. దీనిలో సృష్టి విజ్ఞానం యొక్క సమస్త రహస్యములు సూత్రరూపంలో చెప్పబడ్డాయి.

ఆచార్యుల వారు వివరిస్తున్న గూఢమైన విషయములలో సృష్టి విజ్ఞానం వినబడుతున్నది. తరువాత గాయత్రీ మంత్రంతో కూడి ఉన్న ఆత్మ విజ్ఞానం గురించి చెప్పడం మొదలు పెట్టారు. "ఓంకారం పరమేశ్వరుడు. ఇది పరమసత్యం. భూర్భువః స్వః అంటే దేహం, ప్రాణం, మనస్సులలో వ్యాపించి ఉన్నది. దీనిని అర్థం చేసుకునేందుకు సాధకుడు గాయత్రి యొక్క మూడు చరణములు అంటే ఆలోచనలు, భావములు, క్రియలను పవిత్రం చేసుకోవాలి. పరిశుద్ధి చేసుకోవాలి. ఇంకా గాయత్రి మంత్రంలోని తొమ్మిది శబ్దముల రూపంలో గుణములను అలవరచుకోవాలి.

**సిద్ధాంతాల కోసం పోరాడటం సులభం - ఆచరించడమే కష్టం.**

అవి 1) తత్-జీవన విజ్ఞానం 2) సవితుః-శక్తి సంచయం 3) వరేణ్యం-శ్రేష్ఠత్వం 4) భర్గో-నిర్మలత్వం 5) దేవస్య-దివ్య దృష్టి 6) ధీమహి- సద్గుణములు 7) ధియో-వివేకం 8) యోనః -సంయమం 9) ప్రచోదయాత్-సేవ. ఇలా చేయటం వల్ల శరీరంలోని ఇరవై నాలుగు గ్రంథుల జాగరణ జరుగుతుంది. భగవంతుని శక్తులు సాధకునిలో జాగృతమవుతాయి. అవి 1) సఫలత 2) పరాక్రమం 3) పాలన 4) కళ్యాణం 5) యోగ 6) ప్రేమ 7) ధనం 8) తేజం 9) రక్ష 10) బుద్ధి 11) దమనం 12) నిష్ఠ 13) ధారణ 14) ప్రాణం 15) సంయమం 16) తపస్సు 17) దూరదర్శిత 18) జాగృతి 19) ఉత్పాదనం 20) సరసత 21) ఆదర్శం 22) సాహసం 23) వివేకం 24) సేవ.

గాయత్రి మహామంత్రంలో ఉన్నటువంటి వైజ్ఞానిక ఆధ్యాత్మికత, ఆత్మ విజ్ఞానం వివరిస్తూ ఆయన ఇలా అన్నారు- "గాయత్రి మంత్రంలోని మూడు చరణములలో ఉన్నటువంటి వైజ్ఞానిక క్రియాకలాపాలలోని మూడు తత్వములను 1) సంయక్ జిజ్ఞాస 2) తృటిహీన ప్రయోగవిధి 3) నిష్కర్ష యొక్క ఆకలనం 'ఫలితం యొక్క అవగాహన) యొక్క అనుపాలన చేస్తే ముందు చెప్పిన ఫలితాలు వస్తాయి."

ఆచార్యుల వారు తమ ఉపన్యాసం పూర్తిచేసి వేదికపై తన ఆసనంలో కూర్చున్నారు. ఆ సమయంలో ప్రేక్షకులలోని ఒక వ్యక్తి ఆత్మానందుల వారిని మాట్లాడుమని కోరాడు. ఆయన మర్యాదగా లేచి ఆచార్యుల వారి వైపు చూచి, చేతులు జోడించి ప్రణామం చేస్తూ ఇలా అన్నారు.- "ముందుగా నేను దండకారణ్య భూమిని, ఛత్తీస్‌ఘడ్ వాసులను గుర్తుంచుకొని వచ్చిన శ్రీరామునికి ప్రమాణం చేస్తున్నాను. ఈ భావనా పూర్వ పలుకులకు కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి." ఆయన ఇంకా ఇలా అన్నారు- "నేను ఆచార్యుల వారు రచించిన గాయత్రీ మహా విజ్ఞానమును చదివాను. కాని ఈ రోజు గాయత్రీ మంత్ర వైజ్ఞానిక ఆధ్యాత్మికత అర్థమయింది." రెండు క్షణాలు ఆగి కొనసాగించారు. "నేను అఖండజ్యోతి మాస పత్రిక పాఠకుడను. నేను ఈ సంవత్సరం (1968) జులై, ఆగస్టు, సెప్టెంబర్ సంచికలలో వచ్చిన అపనోంసే అపనీ బాత్ (నా వారితో నా మాట)లో ఇలా అన్నారు. 1. నేను ఆధ్యాత్మికతను వైజ్ఞానికముగా ప్రతిపాదిస్తాను. 2. వైజ్ఞానిక ఆధ్యాత్మికత కొరకు సవ్యమైన దిశలో అడుగులు వేస్తాను. 3. వైజ్ఞానిక ఆధ్యాత్మికత సీనియర్ పరిజనుల రచనలను లోతుగా చదివాను.

ముఖ్యంగా ఆగస్టు నెలలో ఇలా వ్రాశారు- "గత ఇరవై సంవత్సరాలలో విజ్ఞానం అతి వేగంగా ప్రగతి సాధించింది. అది ఆధ్యాత్మిక దిశలో అడుగులు వేస్తున్నది. ఇలాగే ప్రగతి క్రమం జరుగుతే 50 సంవత్సరాలలో ఇవి రెండు (ఆధ్యాత్మికత, విజ్ఞానం) అతి దగ్గరగా వస్తే, వీటి సమన్వయం, ఏకీకరణ సంభవమే." ఆచార్యుల వారి వచనముల గూర్చి నేను కొన్ని మాటలు చెప్పాను. ఆచార్యుల వారు ఒక మహాఋషి. ఋషుల వాక్కు పొల్లు పోదు. వారు 50 సంవత్సరములు అన్నారు. అంటే 2012 సంవత్సరంలో అది జరిగితీరుతుంది. నేను అప్పటివరకు బ్రతికిఉంటానో లేదో కాని భవిష్య దృష్టి, యుగసృష్టిని విశ్వ మానవులందరు చూడగలుగుతారు. అప్పుడు వైజ్ఞానిక ఆధ్యాత్మికత యొక్క సత్యము వైజ్ఞానికుల పరిశోధనా శాలలలోను సూక్ష్మ ఋషుల ప్రయోగశాలలలోనూ ఒకేసారి పరీక్షింపబడి అందరికి అందుబాటులోకి వస్తుంది.

*(అఖండజ్యోతి జులై 2009)*

## గౌరవం వ్యక్తికి కాదు-వ్యక్తిత్వానికి

*వ్యక్తి వేషభూషలు, భాషను బట్టి గౌరవించడం అనేది కొంతవరకే నిజం*

*వివేకానందుడు అమెరికాలో ఉన్నప్పుడు రోడ్డు వెంటపోతూ ఉన్నాడు. అతని దుస్తులు చూచి అందరు నవ్వుకోవడం మొదలుపెట్టారు. కొంతమంది ఆకతాయి పిల్లలు హేళన చేస్తూ వెంటపడ్డారు. వివేకానందుడు ఒకసారి వెనక్కి తిరిగి చూశాడు. వారిని చూచి చిరునవ్వు నవ్వి ముందుకు సాగాడు. ఆ చిరునవ్వులోనే కొందరు మంత్రముగ్ధుల్లా ముదుచుకుపోయారు. మరునాడు సభలో ఆయన ఉపన్యాసం విన్నారు. సభలో ఆయనకు లభించిన గౌరవానికి ఆశ్చర్యపోయారు. ఇటువంటివారిని హేళన చేసి అవమానించినందుకు సిగ్గుపడ్డారు.*

*ఒకనాడు అపహాస్యం చేసిన ఆ దుస్తులే ఎంతో అందంగా కనిపించాయి. అందమైన స్వామి ఇంకా అందంగా కనిపించసాగాడు. పశ్చాత్తాపంతో పోయి పాదాల మీద పడి క్షమాపణ కోరుకున్నారు.*

**ఒంటరిగా జీవనం సాగించేవారికి భగవంతుని తోడు లభిస్తుంది.**

జీవించేకళ

# ధర్మాన్ని తెలుసుకోండి-రక్షించండి

ధర్మం అంటే ఏమిటి? జీవితంలో ధర్మం అవలంబించాలంటే ఉపాయమేమిటి? ధార్మికతకి గుర్తింపు ఏ మతంలోనో దీక్ష పుచ్చుకోవడమా? ఈ రోజుల్లో ఇలా ప్రశ్నలు వినవస్తూనే ఉంటాయి. దీనిని గురించి సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఆత్మకి సంబంధించినది బాహ్యవస్తువుకాదు. దీనిని మనిషి తన అంతరాళంలోనే వెతుక్కోవాలి కాని సమాజంలోకాదు. స్పష్టమైన దారి ఉంది. దానిని అనుసరించి గమ్యం చేరుకోవాలి. ఇప్పుడు గమ్యానికంటే, మార్గానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారు అది పగటి కల అయిపోయింది. మార్గంలోని సభ్యతలో మనం లీనమయిపోతే, వాస్తవిక లక్ష్యానికి దూరం అయిపోతాము.

ధర్మం వ్యక్తికి, సమాజానికి మధ్య ఉండే తల్లీనతకు ఫలశ్రుతిఅని చెప్పవచ్చు. వ్యక్తికి, సమాజానికి మధ్య ఉండే సంబంధం సంప్రదాయం అనబడుతుంది. ధర్మము-సంప్రదాయాల మధ్య ఉన్న తేడా జీవించే ప్రాణి – మృతప్రాణి మధ్య ఉన్న తేడా. ధర్మం పరిమళిస్తుంది. సంప్రదాయవాదం ఉన్న చోట దుర్గంధం ఉంటుంది. మృత శరీరంలో ఇంతకంటే ఏంప్రాప్తిస్తుంది? అక్కడ మనస్సును కలుషితం చేసే అరుచి, విసుగు, అసహ్యం పెరుగుతాయి. ప్రఫుల్లత, ప్రసన్నత, కరుణ, ఉదారత, సేవా-సహకారం జీవించటానికి సహచరులు. చైతన్యాన్నందించే లక్షణాలు. పరమ చైతన్యవంతులు కావడం, ధార్మికులవడం రెండూ ఒకటే. పరమాత్మ ప్రకాశం మానవునిపై ప్రసరించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఇంతకు తక్కువ స్థితిలో ధర్మం వికసించడం అసంభవం. ఇది ఉపదేశం కాదు, శాస్త్రజ్ఞానం కాదు. దీనిని స్వయంగా జీవితంలో వ్యవహారంలో అనుసరించడమే కావాలి. ఉపదేశాలు, శాస్త్రజ్ఞానము కేవలం మానవుణ్ణి ఉద్ధరించడానికి ఉపాయాలు. ఉపదేశకుడు శాస్త్రజ్ఞుడు అయినంత మాత్రాన ధార్మికుడని చెప్పలేము. విద్వాంసుడు అనగలము. జ్ఞాని, తాత్వాన్వేషి అనగలము కాని తత్వదర్శి అనలేము. ఎందుకంటే తత్వజ్ఞుడు కాదు కనుక. ఇలాంటివారు ధర్మజ్ఞులు ఎలా అవుతారు?

ఈ రోజుల్లో కళేబరాన్ని ఆత్మలంటున్నారు. అది పెద్ద చిక్కు. శరీరం ఆత్మ స్థానాన్ని తీసుకుంటే ధర్మక్షేత్రంలో ఎన్నో కలుపుమొక్కలు తయారవుతాయి. ఇది కనిపిస్తూనే ఉంది. అప్పుడు సంప్రదాయం-ధర్మం అంటారు. వాటిని ఆచరించే వాళ్ళని ధార్మికులంటారు. ఎక్కడ ప్రవాహం తిరోగమనం చేస్తుందో అక్కడ శాంతి లోపిస్తుంది, అస్థిరత రాజ్యమేలుతుంది. కరుణ స్థానంలో కాఠిన్యం తిష్ఠవేస్తుంది. పుణ్యం యొక్క స్థానం పాపం గ్రహిస్తుంది. దయ బదులు హింస పెరుగుతుంది. ప్రేమ ఈర్ష్యగా మారుతుంది. సహయోగ వృత్తి, అసహయోగంగా మారుతుంది. ఉదారతపోయి సంకుచిత్వము ప్రబలుతుంది. పరోపకారం తోకముడుస్తుంది. ఇతరులకి సేవ చేయకుండా స్వయం సేవలోనే కాలం గడిపేస్తారు. ఇచ్ఛ-ఆకాంక్ష, విశ్వాసం, గౌరవం, భావాలు, సంవేదనలు-శ్రద్ధ-నిష్ఠ అన్ని వికారరూపం దాలుస్తాయి. మంచి ఆలోచన, మంచిపని చేయలేకపోతారు. వాతావరణం బాగుచేయడంపోయి పాడుచేస్తారు. ధర్మ సంచారానికి కేంద్ర బిందువు కావలసిన సమాజం, కఠినత్వానికి, కలహాలకి ఆలయమవుతుంది. ధర్మధారణ వెనక్కి వెళ్ళిపోతుంది. సంప్రదాయాలు బలం పుంజుకుంటాయి. ఇదీ ఈనాటి పరిస్థితి.

ధర్మము-సంప్రదాయముల మధ్య దూరం ఆకాశానికి పాతాళానికి ఉన్నంత. ధర్మం మనల్ని ఉన్నత ధర్మం వైపు శ్రద్ధ చూపించమంటుంది. ప్రేరణ కల్పిస్తుంది. మన అంతరాత్మ అహంకారితం కాకుండా చూచుకోవాలి. అహాన్ని అగౌరవిస్తే వివాదాలు మొలకెత్తుతాయి. సరళత ఉన్నచోటే సాత్వికత పెరుగుతుంది. సరళత, సాత్వికత దైవీసంపదలు వీటిని ఎంత విరివిగా ఉపయోగిస్తే ధర్మం మనల్ని దైవత్వం వైపుకు తీసుకువెళుతుంది. కాఠిన్యం, ఉగ్రవాదాలు అన్ని సంప్రదాయ కానుకలే! సంప్రదాయకులు కేవలం కూపస్థ మండూకాలు, తనవారికే మంచి చేయాలని ఆలోచిస్తారు. ధర్మం మనల్ని ఉదారులను చేసి ఆత్మవిస్తారానికి ఉపదేశం ఇస్తుంది. "ఆత్మవత్ సర్వభూతేషు" "వసుధైక కుటుంబకమ్" అనే బోధిస్తుంది. ప్రపంచంలోని ధార్మిక పురుషులు ఒక వర్గానికి, ఒక గుంపుకి గిరిగీసుకొని బతకరు. వేరే మతానుయాయులను కూడా ఉద్ధరించారు. సంత్ కబీరు స్వతహాగా ముస్లిమ్. అయిన ఆయన అనుయాయులు హిందువులెంతోమంది ఉన్నారు. ఆయన

**నమ్మకం లేనివారికి శాంతి లభించదు.**

గురువుగారు హిందువు. కబీరు మరణిస్తే రెండు మతాలవారు తమ తమ పద్ధతులలో అంత్యక్రియలు చేశారు. బుద్ధుడు భారతీయుడు. ఆయన ప్రారంభించిన మతాన్ని ఆ రోజులలో ప్రపంచంలోని అనేక దేశాలవారు అనుసరించారు. ఎన్నో జాతుల వారు అవలంభించారు. బుద్ధ భగవానుని శిష్యులయ్యారు. బుద్ధుడు అన్ని జాతుల వారిని తన వారిగా భావించి జాతిబేధాలు రూపుమాపాడు. బుద్ధుడు, కబీరు వారిద్దరే కాదు. ధార్మికులందరూ ఇలానే సంస్కరించారు. ఈ గొప్పతనం అంతా ధర్మానిది.

సంప్రదాయం ఓర్పులేనిది. ఉన్మాదాన్ని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుంది. జాతి, భాష, లింగ, క్షేత్రాలను ఆధారం చేసుకొని విభేదాలు కల్పించడమే దానిపని. ధర్మం ఈశ్వరునివలె సమదృష్టి కలది. పరమాత్ముడే మనందరికీ రక్షకుడని చెపుతుంది. సంప్రదాయం ప్రకారం శివమందిరంలోని లింగాన్ని ఎక్కడా శూద్రులు పూజించకూడదు. వ్యతిరేకి ఎవరూ మసీదులోకి చొరబడకూడదు. ఇలాంటి ఊసులతోనే మనుష్యులు సంపూర్ణ జీవితాన్ని నాశనం చేసుకుంటారు. మన అంతఃకరణలో చెడు భావాలు చొరబడకూడదు. ఏ నాస్తిక భావమూ భగవంతుని పట్ల శ్రద్ధను తగ్గించకూడదు. అప్పుడు మనం ఆత్మను రక్షించుకోగలం. అలా జరిగితే అంతఃకరణలో దివ్యజ్యోతి తప్పక వెలుగుతుంది. ఆత్మ ధర్మాత్మఅయి, చివరికి పరమాత్మ అవుతుంది. నిజానికి గుడులు, మసీదులు ఎందుకు నిర్మిస్తారు? అత్యంత గణనీయ సంఖ్యలో శ్రద్ధాభావాన్ని ప్రకటించి, నమస్కరించి, ఒక ప్రేరణని అందుకొంటారు. ధర్మతత్వ వికాసానికి ఇది బాహ్య ఉపచారం కాగలదు. కాని రోజురోజుకి ఉపాసకుల సంఖ్య పెరిగినా నిజమైన ధర్మావలంబులు ఒకరో ఇద్దరో తప్ప కనిపించడం లేదు. చాలా మంది జంజాటాలలోపడి కొట్టుకుంటూ ఉంటారు. దేవాలయాల, మసీదుల నిర్మాణాల ఆశయం వెనక్కుపోతున్నది. దీని నుంచి బయటపడాలంటే దేవాలయాలు భూమిపై ఇసుక-సున్నంతో కట్టడం కాదు, హృదయ భూమిపై శ్రద్ధ అనే ఇటుకలతో కట్టి, విశ్వాసం, శ్రద్ధా దేవతలను ప్రతిష్ఠాపన చేయగలగాలి. నిజమైన ధర్మం అప్పుడే వికసిస్తుంది.

**ఉత్తమో బ్రహ్మసద్భావో ధ్యాన భావస్తు మధ్యమః ।**
**స్తువిర్జపో ధర్మో భావో బహిః పూజా ధర్మదయాః ॥**

ముందుకు వెళ్ళాలని ఉత్తమ స్థితి పొందాలని ప్రయత్నించే సమయంలో చేసే మానసిక ప్రార్థన సాధనకి రెండవ స్థితి. అన్నిటికంటే గొప్ప స్థితి పరమేశ్వరుని సాక్షాత్కారం చేసుకోవడమే.

మందిరము, మసీదు, చర్చి, గురుద్వారా ఇవన్నీ ధర్మతత్వ ప్రాప్తికి సోపానాలు. పిల్లవాడు నడిచేందుకు మూడు చక్రాల బండి సహాయ పడుతుంది. దేవాలయాలు కూడా అలాంటి ఉపాసనా సాధనలే. ఇంకా ముందుకు వెళ్ళాలంటే దృఢమైన ఇచ్ఛాశక్తి అలవరుచుకోవాలి, పురుషార్థం ఆచరించాలి. ధర్మం పేరుతో కొందరు రక్తపుటేరులు ప్రవహింపచేశారు. ధర్మం పేరుతో చాలామంది చికిత్సాలయాలు, ధర్మశాలలు, అన్నసత్రాలు కట్టించారు. నూతులు, చెఱువులు త్రవ్వించారు. ధర్మం కోసమే ఇలాంటి సేవలకు హృదయ ప్రవృత్తి ప్రేరణ కల్పిస్తుంది. ధర్మం పేరుతో మనిషి ఎన్నో నిష్ఠురకార్యాలు చేశాడు.

వాస్తవిక ధర్మభావన మనిషిలో కోమలత్వాన్ని, సరసతను, నిర్మలతను పెంచుతుంది. సత్యాన్ని ఆచరణలో నింపుకొని ముందుకు నడిస్తే అది మనకు ధర్మ లాభం కలిగించి తీరుతుంది. ధర్మలాభం, ఈశ్వరలాభం ఒకేసత్యానికి రెండు పేర్లు. వేరు వేరు కావు. "ధర్మో హతోహన్తి, ధర్మోరక్షతి రక్షితః" వర్తమాన సామాజిక పరిస్థితిని ఈ సత్యానికి ప్రమాణంగా చూడవచ్చు. ఈ రోజులలో రాష్ట్రానికి పట్టిన దుర్గతిలో ధర్మానికే పెద్ద చెయ్యి. ధర్మానికి ఆదర్శంతో ప్రమాదం లేదు. నకిలీ ధర్మంతోనే ప్రాణసంకటం. అధర్మం కనుపిస్తూనే ఉన్నది. దానికి దాపరికం ఏదీలేదు. దీనిలో అంత హాని జరగదు. ధర్మాన్ని అడ్డుపెట్టుకొని పనులు చేసే వారితోనే ప్రమాదాలు వస్తాయి. నిజమైన తెరవెనుక నకిలీ మనిషి ఉంటాడు. ప్రాణ మిత్రుడు మోసం చేస్తే నాశనం జరుగుతుంది. సఖుడని నమ్మి కళ్ళు మూసుకుంటాడు స్నేహితుడు.

ధర్మక్షేత్రంలో అదే జరిగింది. సమాజం ఉన్నతిని అందుకునే బదులు నైతిక పతనం జరిగింది. వ్యక్తులకు దుర్గతి కలిగింది. మనసులో సంతోషం లేదు. జీవితంలో శాంతిలేదు. జీవితం నరకం అయింది. దీని నుంచి బయటపడే ఉపాయం ఏది? మన అంతరాత్మ పరమాత్ముని అంశాన్ని ధరించినప్పుడు ఆ స్థాయిలో మన క్రియా కలాపాలు జరిగినప్పుడు. ధర్మాన్ని బ్రతికించవచ్చు, ధార్మిక మార్గంలో నడుస్తూ చివరికి దానిని పొందగలము.

*(అనువాదం - టి.జ్ఞానప్రసూన)*
*అఖండజ్యోతి - జూన్, 1997*

**శాంతి లేనివారికి సుఖం దొరకదు.**



ధారావాహిక: వృద్ధాప్యం-జీవితనవనీతం-2

# రోగాలు, ఒంటరితనం, అపేక్ష - ఉపేక్ష

## జీవన చర్య ప్రభావం

జీవితంలోని రెండు దశలలో మనిషి అసమర్థంగా, బలహీనంగా, నిస్సహాయంగా ఉంటాడు. మొదటి దశ జన్మించినప్పటి నుండి శైశవం వరకు ఉంటుంది. ఈ దశలో తగిన ఆసరా అందకపోతే, శిశువు మనుగడకే ముప్పు వచ్చే ప్రమాదం ఉంది. అనేక రోగాణువులు శరీరంలో స్థిరపడే ప్రమాదం ఉంది. ఈ దశలో మనిషి బుద్ధి, వివేకం వికసించవు. స్వతంత్రంగా ఆలోచించడం సాధ్యపడదు. కార్యశూరత చూపడమూ సాధ్యపడదు. దాదాపు ఇటువంటి పరిస్థితే వార్ధక్యంలో ఏర్పడుతుంది. ఆ దశలో ఇంద్రియాలు పట్టు తప్పుతాయి. శరీరం నీరసిస్తుంది. ప్రస్తుతం 60 సంవత్సరాల వయస్సు నుండి వార్ధక్యం, దానికి సంబంధించిన సమస్యలూ ప్రారంభం అవుతున్నాయి.

బాల్య దశనుండి సముచిత సంస్కారాలు పొందే వాతావరణంలో పెరిగిన వ్యక్తి, బ్రహ్మచర్య గృహస్థ ఆశ్రమాల ఆధర్శాల కొలబద్దల ప్రకారం నడుచుకున్న వ్యక్తి, తన జీవితాన్ని దుర్గుణాలనుండి, దుర్వ్యసనాలనుండి సాధ్యమైనంతవరకు కాపాడుకున్న వ్యక్తి వృద్ధాప్యంలో ఆనందంగా ఉంటాడు. మానసికంగా అతడు మెలకువగా, క్రియాశీలంగా నిలచి ఉంటాడు. శారీరిక, ఆర్థిక సమస్యలు అతడిని అంతగా ప్రభావితం చేయవు. కానీ, వ్యక్తులలో హెచ్చుమంది జీవన విధానం ఈ విధంగా ఉండదు.

## ప్రారబ్ధాన్ని బట్టి జన్మ, ఆయుష్షు, భోగం

మానవ జీవితానికి కొన్ని మూల తత్వాలు ఉన్నాయి. కాని మనం వాటిని పట్టించుకోము. మనకు మానవజన్మ ఎలా లభించింది, ఎందుకు లభించింది అన్న విషయాలను మనం మరచిపోతాము. 'మానవ జన్మ గొప్ప అదృష్టం' – అని మనం అంటూనే ఉంటాము. కాని, మనం మన జీవితాలను దుర్గుణాల, దుర్వ్యసనాల ఊబిలోకి స్వయంగా దించి నాశనం చేసుకుంటున్నాము.

వాస్తవానికి – మన జీవితంలో ఎదురయ్యే మంచి – చెడు పరిస్థితులు మన కర్మల ఫలములే. ఆ కర్మలు ఈ జీవితంలో చేసినవి కావచ్చు. పూర్వ జన్మలలో చేసినవి కావచ్చు. ప్రారబ్ధానికి అనుగుణంగా మనకు పునర్జన్మ వస్తుంది. మన జాతి, ఆయుష్షు, భోగం నిర్ణయం అవుతాయి. శాస్త్రాలు స్పష్టంగా వ్రాసిన మాట ఇది.

**సతిమూలే తద్విపాకో జాత్యాయుర్భోగః ।**

*– పతంజలి యోగ దర్శనం (2/13)*

ఇక్కడ జాతి అంటే అర్థం జన్మ. భోగం అంటే సుఖ దుఃఖాల అనుభవం. పూర్వ జన్మలలో మనం చేసిన కర్మల ప్రకారం మన ప్రారబ్ధం ఏర్పడింది. ఆ ప్రారబ్ధం ఫలితంగా మనకు మానవ జన్మ లభించింది. దాని ప్రకారమే ప్రస్తుత జీవితంలో మనం సుఖ దుఃఖాలను అనుభవిస్తున్నాం. దాని ప్రకారమే మన ఈ మానవ శరీరం యొక్క ఆయుష్షు నిర్ణయం జరిగింది.

జీవితంలో మనకు ఎదురయ్యే మంచి చెడు పరిస్థితులు స్వయంగా చేసిన కర్మల ఫలితములు అని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటే మనం ఎన్నడూ కష్టాలకు చలించిపోము, క్రుంగిపోము. నవ్వుతూ వాటిని ఎదుర్కొంటాము.

అలాగే మరణించే క్షణం ముందుగానే నిర్ణయం జరుగుతుంది. మన ఆయుష్షు నిర్ధారణ అయ్యాక దాన్ని ఎవ్వరూ తగ్గించనూ లేరు, పెంచనూ లేరు.

## జీవితం మన చేతుల్లోనే

అయితే ఒక్క విషయం మన చేతుల్లో ఉంది. మనం తలచుకుంటే సంయమనంతో కూడిన జీవన విధానాన్ని అనుసరించగలం. సముచితమైన ఆచరణను, ఆలోచనను, ఆహార విహారాలను ఏర్పరచుకోగలం. చివరి క్షణం వరకు శారీరకంగా ఆరోగ్యంతో ఉండగలం. మన జీవితంలో సేవ, త్యాగం, పరోపకారం, కర్తవ్యపరాయణత, సహన గుణం, సజ్జనత్వం, నిజాయితీ, ఆత్మవిశ్వాసం వంటి నైతిక విలువలను వికసింపచేసుకోగలం. మన సద్గుణాల సువాసనతో సమాజాన్ని గుబాళింపజేయగలం.

**ఏకాగ్రతగా పనిచేస్తే క్షమాపణ చెప్పుకునే అవసరం ఉండదు.**

మరోప్రక్క మనం తలచుకంటే మన జీవితాన్ని లోభం, మోహం, ద్వేషం, అసూయ, కామం, క్రోధం, వాసన, తృష్ణ, లిప్స, లాలస మున్నగు గుణాలలో ముంచెత్తగలం. మనకు రోజుకో కొత్త నరక పరిస్థితిని సృష్టించుకోగలం. ప్రపంచానికి బరువుగా మారగలం. కుములుతూ, విసుక్కుంటూ, మరణ భయంతో దీనులుగా, దుఃఖితులుగా హోతాశులుగా జీవితాన్ని గడపగలం.

ఈ రెండింటిలో ఏ దారిలో వెళ్లాలో మనవే నిర్ణయించుకోవాలి.

**అంపశయ్యకు కారణం**

మహాభారత యుద్ధంలో భీష్మ పితామహుడు అంపశయ్యమీద పడుకుని, మరణంకోసం ఎదురుచూస్తున్నాడు. ఆయనను చూడడానికి కృష్ణుడు అక్కడికి వచ్చాడు. భీష్ముడు ఆయనను ఇలా అడిగాడు –

"ఈ జన్మలో నేను ఏ పాపమూ చేయలేదు. మరి, నాశరీరం బాణాలతో ఇలా ఎందుకు చిల్లులుపడింది? నాకీ కష్టం ఎందుకు వచ్చిపడింది?"

శ్రీకృష్ణుడు ఇలా జవాబు ఇచ్చాడు –

"పూర్వజన్మలో నీవు చేసిన పాపకర్మ యొక్క ఫలితం ఇది. పూర్వ జన్మలలో జరిగినది నీకు తెలియదు. సాక్ష్యం లేకుండా దాన్ని నమ్మవు. కనుక, నేను నీకు కొద్దిసేపు దివ్యదృష్టి ఇస్తున్నాను. నీ పూర్వ జన్మల పరిస్థితిని నీవు స్వయంగా చూడగలుగుతావు."

దివ్యదృష్టి పొందిన భీష్ముడు తన పూర్వజన్మల వివరాలను ఇలా చూడసాగాడు –

పెక్కు జన్మలముందు ఆయన ఒక రాజువద్ద మావటీడుగా పని చేశాడు. ఏనుగుల మంచి చెడ్డలు చూచేవాడు. ఒకసారి ఆయన తన అంకుశంతో ఒక ఊసరవెల్లిని చంపాడు. అంకుశం మొన ఆ ఊసరవెల్లి శరీరంలో దిగబడింది. ఆయన అంకుశాన్ని పైకి ఎత్తాడు. అంకుశం మొనకు చిక్కుకున్న ఊసరవెల్లి కొట్టుకుంటోంది. అంకుశాన్ని విదిలించి ఆయన ఊసరవెల్లిని దూరంగా విసిరివేశాడు. ప్రక్కనే నాగఫణి చెట్టు ఉంది. వెడల్పయిన దాని ఆకులకు లెక్కలేనన్ని ముళ్లు ఉన్నాయి. ఊసరవెల్లి ఆ ముళ్లమీద పడింది. దాని శరీరమంతా ఆ ముళ్లవల్ల చిల్లులుపడింది. అలా అది పెక్కురోజుల వరకు గిలగిలలాడింది. చివరకు చనిపోయింది.

ఆ తర్వాత శ్రీ కృష్ణుడు భీష్మునికి ఇలా వివరించాడు–

"నీవు ఆ జన్మలో అకారణంగా ఆ ఊసరవెల్లిని అంకుశంతో చీల్చావు. నాగఫణి ముళ్లమీద పారవేశావు. ఆ పాప కర్మకు ఫలితం ఇన్ని జన్మల తర్వాత ఇపుడు ఈ విధంగా నీకు లభిస్తోంది. కర్మ ఎన్నడూ నిష్ఫలం కాదు. ఆలస్యంగా అయినా దాని ఫలితాన్ని ప్రతి ఒక్కడూ అనుభవించవలసివస్తుంది.

**ఈ విధంగా – మన జీవితంలో వచ్చే కష్టాలన్నీ మనం చేసిన కర్మల ఫలితాలే**. వాటికి అనుగుణంగా పరిస్థితులు ఏర్పడతాయి. బంధు మిత్రులు లభిస్తారు. మన కర్మలకు అనుగుణంగా ఏర్పడే ప్రారబ్ధమే సమయం వచ్చినప్పుడు ఫలితం ఇస్తుంది. భీష్మునివలె మనం దివ్య దృష్టిని పొందలేము. మన గత జన్మల గురించి తెలుసుకోలేము. అయితే వీటన్నింటినీ ఊహించగలము. ప్రస్తుత జీవితంలో మనం అనుభవించే కష్ట నష్టాలూ, రోగాలూ – అన్నీ మనం చేసిన ఏదో ఒక పాప కర్మకు ప్రతిఫలాలు. ఈ విధంగా మన పాపం నశించిపోవడాన్ని మనం మన అదృష్టంగా పరిగణించాలి. మన ఖాతాలో ఉన్న పాపకర్మలు నశించిపోతే, భవిష్యత్తులో మన జీవితంలో సుఖం, ఆనందం వెల్లివిరుస్తాయి. భీష్మ పితామహునివలె పాప విముక్తులమై, మనం స్వర్గ సుఖాలను పొందుతాము.

**పురుషార్థ, ప్రాయశ్చిత్తాలకే ఈ జీవితం**

మానవ జీవితం పురుషార్థ, ప్రాయశ్చిత్తాల కోసమే లభించింది. ఇతర జన్మలలో ఇవి సాధ్యపడవు. పురుషార్థం ద్వారా మనం ఎల్లప్పుడూ సత్కర్మలు చేయాలి. సదాలోచనలనూ, సద్గుణాలనూ ప్రసారం చేయాలి. సమాజంలో సత్ ప్రవృత్తులను పెంపొందించాలి. ఏ జన్మలో అయినా ఏ జీవిపట్ల అయినా మనం పాపం చేసిఉంటే – అందుకు ప్రాయశ్చిత్తంగా ఈ జీవితంలో జీవులన్నింటిపట్ల దయ చూపాలి. వాటికి సేవ చేయాలి. మన ప్రతిభయొక్క, మన సామర్థ్యం యొక్క ప్రయోజనాన్ని అందరికీ అందించాలి.

ఈ విధంగా తన జీవితాన్ని ప్రాయశ్చిత్త, పురుషార్థముల మార్గంలో నడిపించిన వ్యక్తికి వృద్ధాప్యంలో ఎలాంటి సమస్యలూ రావు. మనకు దీర్ఘాయువు ఇవ్వడం పరమాత్మయొక్క కృపావిశేషం. సమాజంలో సత్కర్మల సువాసనను విరజిమ్మడానికి ఇలా మనకొక సదవకాశం లభించింది.

**శత్రువుల నుండి రక్షించుకోవాలంటే వారిని మిత్రులుగా చేసుకోవడమే ఏకైక మార్గం.**

వృద్ధాప్యం జీవితానికి నవనీతం. అంటే వెన్న. దానిని శాపంగా పరిగణించడం మూర్ఖత్వం. అందరూ బాల్యదశనుండే వృద్ధాప్యానికి సన్నాహాలు ప్రారంభించాలి. ఆదర్శమైన జీవనవిధానం ఇదే. మరి, ఈ విధానాన్ని అమలుచేయగలిగేవారు ఎందరున్నారు? ఇప్పటికీ తరుణం మించిపోలేదు. మనం విజ్ఞతతో వ్యవహరిస్తే, పరిస్థితిని అదుపుచేయవచ్చు. గడచినకాలం ఎలాగూ గడచిపోయింది. ఇప్పటికీ జీవితంలో ఇంకా ఎన్ని సంవత్సరాలు మిగిలి ఉన్నాయో! ఇప్పుడయినా మన కర్మకూ, ఆలోచనకూ సరైన దిశను ఇవ్వగలిగితే, మిగతా జీవితాన్ని మనం సుఖ సంతోషాలతో గడపవచ్చు. తమ సంచిత ప్రారబ్ధాన్ని నశింపజేయడం అందరికీ అత్యవసరం. ప్రాయశ్చిత్తం, పురుషార్థము ద్వారా మనం మన మిగిలిన జీవితాన్ని సద్వినియోగం చేయాలి. వృద్ధులు ఈ విషయాన్ని లోతుగా ఆలోచించాలి. వారి శ్రేయస్సు ఇందులోనే ఉంది.

ప్రస్తుతం వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి మనం ఆలోచిద్దాం. వాటి పరిష్కార మార్గాలను అన్వేషిద్దాం.

ఆ సమస్యలు ఈ విధంగా ఉన్నాయి –

### 1. శారీరిక రోగాలు

మానవ శరీరం ఒక యంత్రం వంటిది. కాలంతో పాటు దీని భాగాలు అరిగిపోతూ, విరిగిపోతూ ఉంటాయి. ఆహార పానీయాలలో క్రమశిక్షణ, ఆలోచనలలో సంయమనం లోపించడంవల్ల ఈ ప్రక్రియ మరింత తీవ్రం, మరింత జటిలం అవుతుంది. రోగాలు శరీరాన్ని నీరసింప చేస్తాయి. ప్రమాదం వల్ల, మరో కారణంవల్ల ఒక్కోసారి మనిషి వికలాంగుడు అవుతాడు. లేచి తిరగడానికీ, కూర్చొని లేవడానికీ మనిషికి ఓపిక ఉండదు. ఆ స్థితిలో పరిచర్య, మందులు, భోజనం వంటి వాటికి మరో వ్యక్తి మీద ఆధారపడవలసి ఉంటుంది. భారతీయ సంస్కృతిలో సాధారణంగా కుటుంబంలోని ఇతర సభ్యులు ఈ బాధ్యతను నిర్వహిస్తారు. తల్లి దండ్రులకూ, కుటుంబంలోని ఇతర వృద్ధులకూ సేవా శుశ్రూషలు చేయడం తమపవిత్ర కర్తవ్యంగా అందరూ భావిస్తూ వచ్చారు. ప్రగతిశీలురం అని చెప్పుకునే కొందరు ఇందుకు మినహాయింపుగా కనిపిస్తారు.

పాశ్చాత్య భోగవాద సంస్కృతివల్ల ప్రభావితములైన కుటుంబాలలో యువతరంవారు పైసాయే పరమాత్మ అని భావిస్తారు. దొంగతనం, అవినీతి, అనాచారం వంటి ఏ మార్గాన్ని అనుసరించి అయినా వీలైనంత హెచ్చుగా డబ్బు సంపాదించాలని చూస్తారు. భౌతిక వాదపు గ్రుడ్డి పరుగులో పూర్తిగా నిమగ్నమైన జనం వృద్ధులకు, రోగులకు సేవ చేయడం సమయాన్ని వృధా చేయడంగా పరిగణిస్తారు.

### 2. ఒంటరితనం

వృద్ధులకు ఒంటరితనం ఒక గడ్డు సమస్య. కుటుంబంలోని యువజనులు తమ ఉద్యోగ వ్యాపారాల పనులలో నిమగ్నులై ఉంటారు. వారికి తీరిక ఉండదు. అలసి సొలసి ఇంటికి వచ్చి, వారు తమ పిల్లలతో, టీవితో కాలక్షేపం చేస్తారు. వృద్ధులతో కొంత సమయం గడపడం మంచిదని వారికి తోచదు. అయినా, వృద్ధ మహిళలు ఏదోవిధంగా తమ కుటుంబాలలో కలసిపోతారు. వారు మొదటినుంచీ ఇంటి పనులలో మునిగితేలుతూ ఉంటారు. కనుక, ఆయా పనులలో ఎంతోకొంత సాయపడతారు. కానీ, పురుషులకు అలా కలసిపోవడం కష్టం. ఉద్యోగ విరమణ జరిగింది. వ్యాపార వ్యవసాయాల పనులు చేయలేరు. ఇంటిలోని చిన్న చిన్న పనులు చేయడానికి ప్రతిష్ఠ అడ్డువస్తుంది. కనుక, అన్ని విషయాలు ఏకరువు పెడుతూ ఉంటారు. అందువల్ల కుటుంబంలోని వ్యక్తులు వారి ఎదుటపడడానికే వెనుకాడతారు.

ఖాళీగా ఉన్న మెదడు ఒక దయ్యాల కొంప. ఒంటరిగా ఉన్న వ్యక్తి అనవసర విషయాలను గురించి ఆలోచిస్తాడు. తలా తోకా లేని పథకాలు వేస్తూ ఉంటాడు. అలా తనకు మరిన్ని సమస్యలు తెచ్చి పెట్టుకుంటాడు. అతడిలో విసుగుదల, చిరాకు పెరుగుతాయి. ద్వేషం, అసూయ బలపడుతూ ఉంటాయి, పాత జ్ఞాపకాల శిథిలాలలోనే తిరుగుతూ ఉంటాడు. వర్తమాన సదవకాశాలమీదకు అతడి దృష్టి పోదు.

### 3. ఆపేక్ష, ఉపేక్షల ద్వంద్వం

పిల్లలు పుట్టగానే తల్లి దండ్రులు కలలు కనడం ప్రారంభిస్తారు. వారు పెద్దయి తమకు వృద్ధాప్యంలో ఆసరాగా నిలుస్తారనీ, తమ ప్రతికోరికనూ తీర్చుతారనీ. కానీ, పిల్లలు పెద్దవాళ్లయిన తర్వాత ప్రస్తుత సామాజిక వాతావరణంలో మునిగిపోతారు. చేయాలనుకున్నప్పటికీ వారు తల్లి దండ్రుల ఆశలను పూర్తి చేయలేరు. తమ ఉద్యోగ వ్యాపారాల జంజాటంలో పడి తల్లి దండ్రుల కోరికలను ఎలా తీర్చాలో ఆలోచించరు.

**ఊహాలోకం భయంకరమైనది.**

పిల్లలు కావాలనే తమను నిర్లక్ష్యం చేస్తున్నారని తల్లిదండ్రులు భావిస్తారు. పిల్లల సమస్యలనూ, వారి తప్పనిసరి బాధ్యతలనూ అర్థం చేసుకోరు. ప్రస్తుత పరిస్థితులలో అసాధ్యమయే విషయాలను గురించి పట్టుపడతారు. అపేక్ష, ఉపేక్షల ఈ ద్వందం వృద్ధులకు తీవ్రమైన మానసిక క్షోభ కలిగిస్తుంది. తాము అవమానాలకు గురి అవుతున్నామని ఎప్పుడూ భావిస్తూ ఉంటారు. ఫలితంగా నిరాశా సాగరంలో మునిగి ఉంటారు.

**4. అవమానాలు**

కొందరు వృద్ధులు ఎంత దురదృష్టవంతులంటే – పిల్లలు వారిని పాలలో పడ్డ ఈగలా చూస్తారు. వారి ఆస్తినీ, పొలాన్నీ వశపరచుకుంటారు. వారిని ఇంటినుండి పంపించివేయాలని చూస్తూ ఉంటారు. వారి భోజనానికి తగు ఏర్పాటు చేయరు. వారు ఇల్లు విడిచి పెట్టి ఎప్పుడు వెళ్ళిపోతారా అని సదా కోరుకుంటూ ఉంటారు. కొడుకుమీదా, కుటుంబం మీదా వ్యామోహంలో చిక్కుకున్న వృద్ధులు అవమానాన్నీ ఉపేక్షనూ భరించవలసి వస్తుంది లేదా, ఇల్లు వదిలి పెట్టి ఎక్కడో బికారులవలె బ్రతకవలసి వస్తుంది. గ్రుడ్డిగా సంపాదించి, లేనిపోని ఆర్భాటాలకూ ఆడంబరాలకూ పోవడం అలవాటుగా మారిన కుటుంబాలలో వృద్ధులకు ఇలాంటి అవమానాలు జరగడం కద్దు. ప్రగతిశీలురమని చెప్పుకునే కుటుంబాలవారికి వృద్ధులు అవాంఛనీయులుగా కనిపిస్తారు. లేదా – దూరంగా ఏ మఠానికో, వృద్ధాశ్రమానికో వారిని పంపివేస్తారు. తీర్థాలలో, ఆలయాలలో, ధర్మసత్రాలలో ఇలాంటి వ్యక్తులు తరచు కనిపిస్తూ ఉంటారు. ఏడుస్తూ తమ గోడు వినిపిస్తూఉంటారు.

ఇలాంటి సంఘటనలను నిష్పాక్షికంగా సమీక్షిస్తే ఒక విషయం వెలికివస్తుంది. ఈ వృద్ధులు తమ పిల్లలకు బాల్యంలో అతిగా గారాబం చేసి ఉండవచ్చు. లేదా, తమ వృత్తి వ్యాపారాలలో మునిగిపోయిన ఈ వృద్ధులకు పిల్లల మానసిక వికాసం సక్రమంగా జరిగేలా చూచే తీరిక కొరవడి ఉండవచ్చు. ఫలితంగా సమాజంలోని కలుషిత వాతావరణ ప్రభావం వల్ల పిల్లలు విచ్చలవిడిగా, అడ్డూ అదుపులేని విధంగా తిరగడానికి అలవాటుపడ్డారు. అనేక దుర్గుణాలకూ, దుర్వ్యసనాలకూ లోనయినారు. అలాంటి స్థితిలో అలాంటి వాడికి సంస్కారంలేని భార్య దొరికితే – పరిస్థితి మరింతగా విషమిస్తుంది. వృద్ధుడైన మామగారిని ఉపేక్షించడంలో, అవమానించడంలో కోడలు మరో అడుగు ముందుకువేస్తుంది. భర్త ఇంటిలో లేనప్పుడు ఆమె మామగారిని బహిరంగంగా అవమానిస్తూ ఉంటుంది. భర్త ఇంటికి వచ్చినప్పుడు అతడికి మామగారిమీద లేనిపోనివి కల్పించి చెపుతుంది. కుటుంబ వ్యామోహంలో చిక్కుకున్న వృద్ధులు పలువురు ఇలాంటి దయనీయ స్థితిని ఎదుర్కొనవలసివస్తుంది. వారు తమ బాధను ఇతరులతో విప్పిచెప్పుకోలేరు. కనుక – వారు లోలోపల కుమిలిపోతూ ఉంటారు.

**సమస్యలకు పరిష్కారాలు**

వృద్ధాప్యంలో ఇలాంటి సమస్యలు ఎదురుకాకుండా ఉండడం, చివరి వరకు జీవితాన్ని సుఖంగా ఆనందంగా గడపడం – ఇందుకు మొట్టమొదటి బాధ్యత స్వయంగా వృద్ధులదే. పెక్కు సందర్భాలలో తమదురవస్థకు బాధ్యులు వారే అవుతారు. తర్వాతి బాధ్యత కుటుంబానిదీ, యువతరానిదీ తర్వాత బాధ్యత సమాజానిది.

**ఇంగ్లండు రైదాస్**

*ఇంగ్లండు "జోసఫ పెంద్రెవ్" అనే వేదాంతి ఉండేవాడు. ఇంగ్లండులో అతనికి గొప్ప పేరు ప్రఖ్యాతులు ఉండేవి. తండ్రిలాగానే చర్మంతో చెప్పులు కుట్టేవాడు. దాని మీద వచ్చే ఆదాయంతోనే తృప్తిగా జీవించేవాడు. కడుపు నిండడానికి కావలసిన ధనం లభించగానే పనిని నిలిపివేసి, చదువుకోవడానికి సమయాన్ని ఉపయోగించేవాడు. తన దుకాణం కూడా లైబ్రరీలు, పాఠశాలలు ఉన్న చోట పెట్టుకునే వాడు. తనపనిని తాను చేసుకుంటూనే బడిలో చెప్పే పాఠాలను వింటూ ఉండేవాడు. ఖాళీ దొరకగానే లైబ్రరీలో కూర్చుని చదువుకునేవాడు. ఈవిధంగా ఉదరపోషణ చేసుకుంటూనే మెదడుకు అనంతమైన జ్ఞానాన్ని అందించేవాడు.*

*అక్కడి ప్రజలు అదివరకే మన సంత్ రైదాసును గురించి విని ఉన్నారు. అందువల్ల జోసెఫ్‌పెంద్రవును ఇంగ్లండు రైదాస్ అని చెప్పుకునేవారు.*

**లక్ష్యంతో పనిచేసేవాడికి అపజయమే ఉండదు.**

గాయత్రీమాత-24 శక్తిధారలు

# ఋతంభర-8

గాయత్రీమాతను ఋతంభర అంటాము. దీనికే ప్రజ్ఞ అని కూడ అర్థం. మేధస్సును ప్రేరేపించే నిమిత్తం సవితా దేవతను ప్రార్థిస్తాం. మేధస్సును వృద్ధిచేసే దేవత ఋతంభరా ప్రజ్ఞ. ఈమె స్వరూప స్వభావాలను తెలుసుకునేందుకే బ్రహ్మ విజ్ఞానం వ్రాయబడింది. బ్రహ్మవిద్య యొక్క తత్వదర్శనం ఈ ఋతంభరా ప్రజ్ఞను వృద్ధి చేసకోవడానికే అని తెలుసుకోవాలి. దీనిని మించిన పవిత్రమైన అంశం ప్రపంచంలో మరొక్కటి లేదు. కృష్ణ పరమాత్మ మాటల్లో ఇది సర్వ శ్రేష్ఠ జ్ఞానం. జ్ఞాన నేత్రం విచ్చుకున్నప్పుడే ఇది లభిస్తుంది. ఆ దివ్యనేత్రాలతో ఆత్మను దర్శించవచ్చు. బ్రహ్మసాక్షాత్కారం కొరకు పరితపిస్తూ ఉంటారు. అవి లభించాలంటే ఋతంభరా ప్రజ్ఞ అనుగ్రహం ఉండి తీరాలి.

తెలివితేటలతో ధనం సంపాదించవచ్చు. అనేక రకాలుగా ప్రజలను ఆకర్షించుకోవచ్చు. కాని ఆత్మకు సంబంధించిన సద్భావనలు, సహృదయత, సజ్జనత్వం మొదలైన భావసంవేదనలు లభించాలంటే ఋతంభరా ప్రజ్ఞ ద్వారానే లభించాలి. అవి లభించిన పరిమాణాన్ని బట్టి సాధువు, సజ్జనుడు, ఋషి, మహర్షి, రాజర్షి, దేవర్షి అన్న పేర్లు లభిస్తాయి. ఆత్మకు సంబంధించిన ప్రయోజనాలు మాత్రం తత్వ ప్రజ్ఞ అంటారు. ఋతంభరా ప్రజ్ఞ జీవితాన్ని గౌరవప్రదం చేస్తుంది. పూర్ణత్వాన్ని ప్రసాదిస్తుంది. జీవితలక్ష్యం వరకు చేరుస్తుంది. దేనిలో విజయాన్ని సాధించాలన్నా ఋతంభరా ప్రజ్ఞ యొక్క అనుగ్రహం ఉండి తీరాలి.

ఋతంభరా ప్రజ్ఞ పరమేశ్వరుని వరదానం. ఈ వరదానం వల్ల భవబంధాలు తామంతట తామే వీడిపోతాయి. అజ్ఞానాంధకారాన్ని తొలగించడానికి అరుణోదయం లాంటిది ఋతంభరాదేవి అనుగ్రహం.

ఆ తల్లి అనుగ్రహం పొందినవారు సాధారణ వ్యక్తులకన్నా భిన్నంగా నడుచుకుంటారు. వారి ఆలోచనలు, ఆకాంక్షలు, దినచర్య అన్నీ కూడ ఒకానొక ప్రత్యేకతను కలిగి ఉంటాయి. వారి ఆదర్శాలు వేరుగా ఉంటాయి. నిరంతరం కర్తవ్యనిష్ఠతో పనులు చేస్తూ ఉంటారు.

ఏ కార్యం చేపట్టినా లోకులు ఏమనుకుంటారో అని సందేహ పడరు. లోభమోహాలతో కన్నుగానక చరించేవారిపై సానుభూతిని చూపుతారు. కేవలం జాలిపడుతూ కాలం గడపరు. వారిని రక్షించే విధానలను ఆలోచిస్తారు. ఆచరిస్తారు. ఋతంభరా ప్రజ్ఞ యొక్క ప్రేరణతోనే ఇలాంటి సాహసవైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. నీతి నిజాయితీలకు, సత్య ప్రవర్తనకు కట్టుబడి ఉంటారు. 'ప్రజ్ఞ' అనే దృఢమైన కవచాన్ని ధరిస్తారు. అందువల్ల వారికి ప్రతీ పనిలోను విజయం తప్పక లభిస్తుంది. వారే దేవమానవులు అవుతారు.

దేవమానవులు ఉన్నతమైన దృష్టితో పదార్థాల ఉపయోగాన్నీ, సాటివారి ఆశయాలను అర్థం చేసుకోగలుగుతారు. దానికి అనుకూలంగా తమ నడవడికను మార్చుకుంటారు. ఇటువంటి ఆలోచనలతో కూడిన జీవనమే స్వర్గ జీవనం అవుతుంది. లోభం, మోహం, అహంకారం, మొదలయినవన్నీ మానవుని పతనం వైపుకు తిప్పుతాయి. వాటికి దూరంగా నిష్ఠతో కూడిన జీవనం మొదలుపెడితే తుష్టి, తృప్తి, శాంతి అన్నీ లభిస్తాయి. ప్రలోభాలకు దూరంగా, ఆదర్శాలకు దగ్గరగా జీవించడమే ముక్తి అవుతుంది. ఈ స్థాయికి చేరుకోగలిగితే ఆత్మ సాక్షాత్కారం, బ్రహ్మ సాక్షాత్కారం రెండూ లభిస్తాయి.

గాయత్రీ ఉపాసన వల్ల ఋతంభరా ప్రజ్ఞ ప్రాప్తిస్తుంది. గాయత్రి అనుగ్రహం పొందిన వారిలో ఋతంభరా ప్రజ్ఞ తన తేజస్సును ప్రసరింపచేస్తుంది.

★★★

**కాలం ఎన్ని మార్పులైనా తెచ్చి పెడుతుంది.**



మహిళా జాగరణ

# భారత్ అగ్రగామిగా ఉండేది, ఉంటుంది

భారతదేశం మహిళా జాగరణ విషయంలో ఇంకా చాలా చేయవలసి ఉన్నది. ఈ దేశపు సంఘమిత్ర, ఆమ్రపాలి తమ సౌఖ్యాలను కాలదన్ని లోక కళ్యాణం కోసం బయలుదేరారు. ప్రపంచమంతటా బౌద్ధ మతాల స్థాపనలో, విస్తరణలో అసాధారణ రీతిలో సఫలురయ్యారు. అలాంటి దేశంలో నేడు స్త్రీ వెనుకబడి ఉన్నది. పల్లె ప్రాంతాలలో స్త్రీ విద్య, స్త్రీల సామాజిక స్థితి దయనీయంగా కనిపిస్తోంది. అయినప్పటికీ ఈ వెనుకబడ్డ రంగంలో అద్భుతాలు చూపడానికి పరివర్తన ప్రక్రియ నడుం బిగిస్తున్నది. ప్రగతి పథంలో నవోత్సాహం పెల్లుబుకుతున్నది.

భారతదేశంలో పంచాయితీ రాజ్య స్థాపనకు భూమిక తయారయింది. దానితోపాటు సర్పంచ్‌లలో 30 శాతం మహిళలు ఉండాలనే నిర్ణయం కూడా జరిగింది. ఈ రిజర్వేషన్ ప్రాంతీయ స్థాయికీ, జాతీయ స్థాయికీ విస్తరిస్తుంది. ఇది యుగం పిలుపు. దీన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు.

పరిపాలనా రంగాలలో ప్రవేశం పొందడంతో ప్రారంభమయినప్పటికీ, ప్రగతి క్రమం అంత చిన్న పరిధికి పరిమితం కాదు. మహిళల విలువ గుర్తించబడిందనీ, ఆమె గౌరవించబడుతోందనీ చూపడానికి ఇది ఒక గుర్తు మాత్రమే. సంస్కరించడానికి ఇంకా అనేక రంగాలు సిద్ధంగా ఉన్నాయి. వాటిని మెరుగుపరచే బాధ్యత మహిళ భుజస్కంధాలపై మరింతగా పడుతూన్నది. సహకారం విలువ తెలుస్తున్నది. కాలు పట్టుకొని వెనక్కులాగే వికృతమైన క్రీడ ప్రతి ఒక్కరికీ హానికరము, కష్టదాయకమే అవుతుంది.

స్వాభావికంగా స్త్రీ రాబోయే రోజులలో అధిక సమర్థురాలు, నేర్పరి, మంచి సంస్కారవంతురాలు కాబోతున్నది. ఇది ఆమె నవ జీవనానికి బంగారు ఘడియ. వర్ష ఋతువు వస్తే పచ్చదనం కనిపించకపోవడం అసంభవము. వసంతం ప్రవేశముతో వృక్షాలపై రంగురంగుల పూవులు వికసించక పోవడం జరగని పని. ప్రొద్దు పొడిచిన తర్వాత అంధకారం, నిశ్శబ్దం కొనసాగడం జరుగదు. భూమికి దేవత అయిన మహిళ తన గొప్పతనాన్ని ముడిచి పెట్టుకొని కూర్చొనే పద్ధతి ఇక ముందు ఉండదు. సమర్థతతోపాటు విజ్ఞత కూడా పెరుగుతుంది. అదృశ్య శక్తి మార్గదర్శనంలో అభ్యుదయ పథంలో మహిళ ముందుకు సాగుతున్నప్పుడు, అందువల్ల జరిగే అద్భుతాలను ఆపడం ఎవరికీ సాధ్యం కాదు.

మహిళ ఇచ్చే వరాలు ఎప్పుడూ అల్పస్థాయికి చెంది ఉండవు. ఆమె భూమితో, శక్తితో, వర్షంతో ప్రాణవాయువుతో సమానంగా తన మహిమల కుంభవృష్టితో ప్రపంచంలోని అణువణువునూ మనోహరంగా, రసవత్తరంగా, సమున్నతంగా తీర్చిదిద్దుతుంది. కరుణ, దయ, సేవ – ఇవన్నీ ఆమె సమర్పణ, ఆమె దయ మాత్రమే. అవే ఈ ప్రపంచాన్ని రమ్యంగా, సంస్కారవంతంగా నిలిపి ఉంచుతున్నాయి. రాబోయే రోజులలో ఆమె తన గొప్పతనాన్ని మరింతగా పెంచి చూపవలసి ఉన్నది. ప్రతికూలతను అనుకూలతగా, పతనాన్ని ఉన్నతిగా మార్చి సమస్యలకు పరిష్కారం చూపడంలో ఆమె మహత్తర పాత్ర వహించబోతోంది.

ఇదంతా సులభంగా జరిగే పనికాదు. నియతి ఏదైనప్పటికీ, దానికోసం శక్తిని ఉపయోగించాలి. బుద్ధుడు, గాంధీ వంటి దేవాత్మలు లోకకల్యాణం కోసం అవతరించారు. కానీ ఆ లక్ష్యం సులభంగా పూర్తి కాలేదు. వారు తామూ, తమ సహచరులూ నిర్ణీత లక్ష్యాన్ని చేరడానికి త్యాగంతో, సాహసంతో ప్రయత్నాలు చేయవలసి వచ్చింది. హనుమంతుడు, అర్జునుడు మహా ప్రతాపవంతులు కావడానికి జన్మించారు. వారికి దైవానుగ్రహం కూడా పెద్ద యెత్తున లభించింది. అయినా వారు తమ సహచరులతో సహా అసాధారణమైన కార్యశూరతను చూపవలసి వచ్చింది. ఎదురుగా కంచంలో పెట్టిన అన్నం తనంతట తాను నోట్లోకి వెళ్లి పొట్టలో పడి ఆకలిని తీర్చడం అనేది జరగదు. అలాంటిది యుగావతరణకోసం జరుగబోయే మహిళా పునరుద్ధరణకు తగిన మూల్యం చెల్లించవలసివస్తే అందులో ఆశ్చర్యం ఏమీ ఉండదు.

ప్రత్యక్షంగా అయితే విద్య – స్వావలంబన, కుటుంబ పోషణ, కళాకౌశలం లాంటి రంగాలలో మేధావులు మహిళకు సహకారం అందిస్తే సరిపోతుంది. ప్రభుత్వం సహకారం అందిస్తున్నది. మహిళలు ఉద్యోగాలలో ప్రవేశిస్తున్నారు. ఈ లక్ష్యములకు ప్రగతి అనే పేరు కూడా లభిస్తున్నది. అయినప్పటికీ ఒక పెద్ద ఆటంకం ఎదురవుతున్నది. ఆచారాల రూపంలో ఎంతో అనర్థం తెచ్చిపెడుతోంది. దానితో పోల్చి చూస్తే కంటికి కనిపించే అభివృద్ధి, కృషి, ఫలితం అంతంతమాత్రమే అనిపిస్తున్నది.

ఏది ఏమయినా అన్ని విషయాలలో వలె మహిళా జాగరణలో కూడ భారతదేశం అగ్రగామిగా నిలవాలని కృషి చేద్దాం.

**జరిగేవన్నీ నా మంచికే అనుకుంటే అసంతృప్తి ఉండదు.**

నా వారితో నా మాట : 2011 -2012 (శతాబ్ది సంవత్సరం)

# శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-13

## శతజయంతి వైభవం ప్రచారకుల చేతిలోనే ఉంది

### శాంతికుంజ్‌లో వసంత పంచమి

వసంత పంచమీ ఉత్సవంతోపాటు శాంతికుంజ్ హరిద్వార్‌లో కుంభమేళా దృశ్యం అద్భుతంగా రూపుదిద్దుకుంటూ ఉంది. వసంత పంచమి పర్వం ప్రకృతి మార్పుకు ప్రారంభం మాత్రమే. వణికించే చలికి లేలేత ఎండను ప్రసాదిస్తుంది. క్రమంగా వికసించిన ప్రకృతి అన్ని దిక్కులలో పరిమళిస్తుంది. నూతన ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ప్రకృతి మాత చక్కగా అలంకరించుకుని ఋతువుకు స్వాగతం పలుకుతుంది. అందు వల్లనే యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు "ఋతూనాంకుసుమాకరః" అని వసంత ఋతువును గౌరవించారు. నూతన ఉల్లాసాన్ని, నూతన ఉత్సాహాన్ని నింపుకోగల మార్పుకు చిహ్నం వసంత ఋతువు. ఇది రాబోయే నూతన సంవత్సరం వరకు విహరిస్తుంది. ఈనాటి కలుషిత వాతావరణంలో మాటవేరు. ఋతు ధర్మాలే మారిపోతున్నాయి. నేరేడుపండ్లు డిసెంబర్‌లోనే పండుతున్నాయి. మంచు కురవడం లేదు. మామిడిపూత, మోదుగు పూలు పరిమళిస్తున్నాయి. కాని హరిద్వార్, ఋషీకేశులు హిమాలయాల సాన్నిధ్యంలో ఉండడాన ఋతువుల క్రమంలో మార్పులేదు. 1990కి పూర్వం ఎలా ఉందో, ఇప్పటికీ అదే విధంగా ఉంది. ఋతువులు తమ ధర్మాన్ని చక్కగా పాటిస్తున్నాయి.

### గొప్ప అదృష్టం - మహాకుంభం

21వ శతాబ్దిలో మొదటి కుంభమేళా హరిద్వార్‌లో ఏర్పాటు చేయబడింది. పాపాలను తొలగించుకుని, పుణ్యాన్ని సంపాదించుకోవడం కోసం లక్షల సంఖ్యలో జనులు ఇక్కడకు చేరుకుంటారు. 20.01.2010 వసంత పంచమి నుండి 28.04.2010 వైశాఖ పూర్ణిమ వరకు ఇక్కడ ఉత్సవం జరుగుతుంది. ధర్మతంత్రం యొక్క వైభవాన్ని ఇక్కడ చూడవచ్చు. సాధు పరంపరను దర్శించవచ్చు. ఆసక్తిగల వారికి మహా పురుషుల సాన్నిధ్యం లభిస్తుంది. కేవలం కుంభమేళా కొరకే హిమాలయాల నుండి దిగి వచ్చిన సాధువులను తాపసులను ఇక్కడ చూచి తరించవచ్చు. గంగామాత మనలను ఉద్ధరించడానికే దిగివచ్చిందనీ, దానిని కలుషితం చేయరాదనీ శతవిధాల బోధిస్తూ ఉంటారు. ఈ మహాకుంభమేళా విలక్షణమైన సంక్రాంతి కాలంలో వచ్చింది. దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన ఆధ్యాత్మిక పరివర్తన జరుగుతుంది. 2010 నుండి 2013 వరకు గల నాలుగు సంవత్సరాలు గొప్ప విప్లవాత్మకమైన మార్పును తేబోతూ ఉన్నాయి. ప్రపంచం యొక్క అదృష్టరేఖను నిర్ణయించే కాలం ఇదే. ఇలాంటి స్థితిలో, వసంత పంచమి పర్వదినాన, మహాకుంభమేళా ఏర్పాట్లు చేసే సమయంలో గొప్పశక్తిని పుంజుకోవాల్సి ఉంది. మనం మన మనస్సులో యుగనిర్మాణ యోజన గురించి ఎక్కడ నుండి ఆరంభించాలి? అందులో మన భాగస్వామ్యం ఏమిటి? అంటూ తర్కించుకోవాలి. చిట్టచివరకు గట్టి సంకల్పం తీసుకోవాలి.

### గురుదేవుల జన్మశతాబ్ది

2011 పరమ పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది. అది గాయత్రీ పరివారసభ్యులందరికీ మహా పర్వదినం. ఆయన 1911 సెప్టెంబరు 20 ఆశ్వయుజ బహుళ త్రయోదశినాడు జన్మించారు. వారి శత జయంతిని ముందుగా సంవత్సర క్రమంలో జరుపుకుంటున్నాము. 1911 నుండి 1990 వరకు స్థూల శరీరంతో ప్రపంచాన్ని అవలోకించారు. ప్రజలను జ్ఞానగంగలో మునకలు వేయించారు. ఇప్పుడు సూక్ష్మ, కారణ శరీరాలతో మన మధ్యలోనే ఉన్నారు. మనందరికీ అండగా నిలిచారు. ఇది కేవలం యుగఋషి జన్మ శతాబ్ది మాత్రమే కాదు. వారి ఆలోచనా స్రవంతికి కూడా జన్మ శతాబ్ది. వారితోపాటే వారి ఆలోచనా స్రవంతి కూడా భూమండలంపై అడుగుపెట్టింది. దానిని అనుసరించే శాంతికుంజ్‌లో అనేక ప్రయత్నాలు జరుగుతూ ఉన్నాయి.

### భారతదేశం అంతా ఏకకంఠంతో నినదించాలి

ఈ సందర్భంగా 2010ని ముందస్తు సంవత్సరంగా జరుపుకుంటున్నాం. భారతదేశంతోపాటు దాదాపు 70కన్నా

ఎవరికీ అనుకున్నవన్నీ జరగవు.

ఎక్కువ దేశాలను ఈ సంవత్సరం తరచి చూడాల్సి ఉంది. 08.02.2011 వసంత పంచమి నాటి నుండి జన్మశతాబ్ది ప్రారంభం అవుతుంది. దానిలో అందరూ పాల్గొవాల్సి ఉంటుంది. ఇప్పటికి దేశం మొత్తం నుండి 36000 వేల మంది కార్యకర్తలు శాంతికుంజ్‌లో జరిగిన 16 ముందస్తు శిబిరాలలో పాల్గొన్నారు. విషయాన్ని ప్రపంచవ్యాప్తం చేయాల్సిన విధానాలను నిర్ణయించుకున్నారు. శతాబ్ది వత్సరానికి ముందు సంవత్సరమంతా విస్తృత ప్రచారం చేయాలన్న సంకల్పం తీసుకున్నారు. "వి ఫర్ విక్టీరి" వలె "ఇంక్విలాబ్ జిందాబాద్" వలె మనం "మారుతాం – యుగం" మారుతుంది. అన్న నినాదాన్ని భారత ప్రజలంతా ఏక కంఠంతో నినదించాలి. ఈ నినాదం దేశం నలుమూలలా ప్రతిధ్వనించాలి. పరమపూజ్య గురుదేవులు తెలిపిన "యుగనిర్మాణ సత్సంకల్పాలు" ఒకానొక రాజ్యాంగ శాసనాలవలె అన్ని వర్గాల, మతాల, సంప్రదాయాల వారినోట ఉచ్చరింపబడాలి. అందరూ వీనిని మరల మరల చదువుతూ ఉండాలి. అప్పుడే మానవునిలో దైవత్వం, భూమి మీదకు స్వర్గం దిగివస్తాయి.

### ముండీ యజ్ఞాల పరంపర

(అధికసంఖ్యాకులు గలసభలలో కేవలం మంత్రోచ్చరణ)

యుగనిర్మాణం కొరకు ప్రజలను సమావేశపరచడానికి యజ్ఞాలు ఉపకరిస్తాయి. చిన్న చిన్న వాడలు మొదలుకుని గ్రామం, తాలూకా, జిల్లా, జోనల్, ఉపజోనల్ స్థాయిల్లో ముండీ యజ్ఞాలు, దీప యజ్ఞాలు ముమ్మురంగా చెయ్యాల్సి ఉంటుంది. కుండీ యజ్ఞాల కన్నా ముండీ యజ్ఞాలు అధిక జనాభా ఉన్నప్పుడు కేవలం మంత్రోచ్చారణ ద్వారానే ఆహుతులు సమర్పించడం 21వ శతాబ్ది జనాలకు ఆసక్తికరంగా ఉంటాయని గురుదేవులు చెపుతుండే వారు. 1989లోనే 21వ శతాబ్దికి కావలసిన విషయాలన్నీ చెప్పేశారు. చెప్పడమే కాకుండా దీపయజ్ఞాలను స్వయంగా ప్రచారం చేశారు. ఈ యజ్ఞాలలో అయితే ప్రతి ఒక్కరు పాలుపంచుకోవడానికి వీలుగా ఉంటుంది. ఈ సూక్ష్మ యజ్ఞాలలో అయితే పండితులు–పామరులు, వేర్వేరు ధర్మాలవారు, పిల్లలు–పెద్దలు తమ తమ ఆహుతులను అగ్నిదేవునకు అర్పించుకోగలుగుతారు. ఈ యజ్ఞాలు కుర్చీపై కూర్చుండి గాని, నేల మీద కూర్చుండి గాని చేయవచ్చు. ఈ యజ్ఞాల వల్ల శబ్దం ద్వారా వాతావరణ శోధన అద్భుతంగా జరుగుతుంది.

### 2011 ఫిబ్రవరి 6,7,8 తేదీలలో వసంత పర్వం

ఈ ముందస్తు సంవత్సరంలో యుగనిర్మాణ సమ్మేళనం, ముందస్తు దీపయజ్ఞాలు 2010 ప్రారంభంనుండే దేశమంతా నిర్వహించబడతాయి. వీటిలో భావనాపరమైన నిష్ఠకలవారు, క్రొత్తగా వచ్చిచేరినవారు అందరూ పాల్గొంటారు. మేధావులు, అఖండజ్యోతి, యుగనిర్మాణ యోజన పత్రికల పాఠకులు కూడా పాల్గొంటారు. **యుగ నిర్మాణం అంటే ఏమిటి? యుగ పరివర్తన అంటే ఏమిటి? అన్న విషయాలను ప్రజలందరికీ తెలియ చేయడమే ఈ ప్రయత్నాల ప్రధాన లక్ష్యం.** 08.02.2011 వసంత పంచమి సందర్భంగా ఈ సాధనలకు మహా పూర్ణాహుతి జరుగుతుంది. దానితో ఈ ముందస్తు కార్యక్రమాలు కూడా పూర్తి అవుతాయి. 2011 ఫిబ్రవరి 6,7,8 తేదీలలో ఒక దీపావళి ఉత్సవాన్ని ప్రపంచమంతటా నిర్వహిస్తారు. దీపయజ్ఞాలు అనేక చోట్ల ఒకేసారి నిర్వహించబడుతాయి. 06.02.2011నాడు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు జరుగుతూనే ఉంటాయి. 70 దేశాలలో ఒకేసారి పూర్తిచేస్తారు. అక్కడక్కడ "యుగనిర్మాణం జరుగుగాక" అనే ప్రార్థనా వాక్యాన్ని దీపాలతో వ్రాసి, దీపయజ్ఞం చేస్తారు. మనకంటే ముందున్న తూర్పుదేశాలు కొన్ని 6వ తేదీ సాయంత్రం వీలును బట్టి జరుపుకుంటాయి. ఆదివారం కావడాన విదేశాలవారికి ఇది సౌకర్యంగా ఉంటుంది. పరమపూజ్య గురుదేవుల ఆధ్యాత్మ జన్మదినం భారతదేశంలో 07.02.2011 వసంత పంచమికి ముందురోజు సాయంత్రం అన్నిచోట్లా ఒకేసారి నిర్వహించబడుతుంది. బ్రహ్మాండమైన దీపయజ్ఞ రూపంలో ఆ దీపయజ్ఞాన్ని నూతన యుగానికి స్వాగతం పలుకుతున్న హారతిగా చెప్పవచ్చు. ఇదే విధంగా అన్ని శక్తి పీఠాలలోనూ, ప్రజ్ఞా మండళ్లలోనూ, మహిళా మండళ్లలోనూ, స్వాధ్యాయ మండళ్ల లోనూ, దూర విద్యాకేంద్రాలలోనూ, సంస్కృతీ మండళ్లలోనూ, చేతనా కేంద్రాలలోనూ, గాయత్రీ పరివార్ శాఖలలోనూ దీపయజ్ఞంతో పాటు జ్ఞానయజ్ఞాన్ని కూడా కలిపి రెండు గంటల కార్యక్రమం జరుపుతారు. ఈ కార్యక్రమం 07.02.2011 నాడు జరగాలి. 08.02.2011నాడు ఉదయం పరమపూజ్య గురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినాన్ని జరుపుతారు. 6,7,8 తేదీలలో చేయాల్సిన కార్యక్రమాల వివరం పంపించబడుతుంది.

### ప్రార్థన యొక్క మూల స్వరం

దేశంలోనే కాకుండా ప్రపంచం మొత్తంలో ఒకేసారి ఆధ్యాత్మిక

**లోకం నిన్ను గుర్తించలేదు అనుకునే కన్నా, నీవు లోకాన్ని ఎంతవరకు గుర్తించావో పరిశీలించుకో.**

జ్యోతి వెలిగించబడాలి. ప్రపంచంలో ఏ మూల చూసినా 2011 ఫిబ్రవరి 6,7,8 తేదీలలో ఇదే మాట వినిపించాలి. "పరమపూజ్య గురుదేవులు జీవితమంతా వెచ్చించి సాధించిన నవయుగ అవతరణ మన ముందుకు వచ్చేసింది. మనం కళ్ళారా చూస్తూనే ఉన్నాం. అనర్థాలు తొలగిపోయాయి. అశుభాలు అంతర్థానం అయిపోయాయి. ఇకముందు అందరికీ శుభమే కలుగుగాక! ఉగ్రవాదం నశించింది. సమానత్వం వెల్లివిరుస్తోంది." అనే ఆకాంక్షతో కూడిన వేడుకోలు ప్రజల నోటినుండి వినిపించాలి. ఈ ప్రార్థనలో అందరం పాలుపంచుకోవాలి. ఈలోగా 06.02.2011 నాటికి ఉపజోనల్, జోనల్ కేంద్రాలలో యోజన సిద్ధంగా ఉంటుంది. మేధావులను, జ్ఞాన సంపన్నులను, చైతన్యవంతులైన కార్యకర్తలను, వివిధ ధర్మ సంప్రదాయాల వారిని సమావేశపరిచే యోజన పూర్తి అవుతుంది. ఈ జ్ఞానయజ్ఞం 3 గంటలు జరుగుతుంది. ఈ కార్యక్రమం అంతా స్థానిక టోలీలవారు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల ద్వారా గురుసత్తా యొక్క ఆలోచనలను అందరితో పాటు మీడియాకు కూడా తెలియచేయడం జరుగుతుంది.

### న్యూఢిల్లీ కార్యక్రమాలు

వసంతపర్వం గడిచిపోయిన తర్వాత 16,17 తేదీలలో న్యూఢిల్లీలో కార్యక్రమం నిర్వహించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా మీడియా కేంద్రంలోనూ, ఎంపిక చేయబడ్డ లక్షమంది పరిజనులతోను శతాబ్ది సంవత్సర ప్రథమ కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమం ఏదైనా పెద్ద స్టేడియంలో 4 నుండి 6 గంటలపాటు జరుపబడుతుంది. దీనిని దేశ ప్రజలందరితోపాటు ప్రపంచ ప్రజలందరు దర్శించగలుగుతారు. ఇప్పటినుండే ఆ వ్యవస్థను గురించిన ప్లాను మొదలయింది. ప్రభావశీలురైన వక్తలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిల నుండి ఎంపిక చేయాల్సి ఉంది.

### అద్భుతమైన ప్రదర్శన

కేంద్రంలో ఒక అద్భుతమైన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. దీనిని నాలుగు నెలల పాటు కుంభమేళాలో ప్రదర్శిస్తూ ఉన్నాం. ఈ ప్రదర్శనను ఎక్కడికైనా తీసుకొని వెళ్లవచ్చు. (పోర్టబుల్) ఫ్లెక్స్ తెర మీద కూడ చూసుకోవచ్చు. దీనిలో జన్మ శతాబ్ది ఉత్సవాన్ని పూర్తిగా చూడవచ్చు. యుగ నిర్మాణం అంటే ఏమిటి? ఏ విధంగా జరుగుతుంది? గురుదేవుల జీవితం ఏమి నేర్పిస్తున్నది? శాంతికుంజ్ కార్యక్రమాలు ఏమిటి? మొదలైనవన్నీ క్షుణ్ణంగా దర్శించవచ్చు. ఈ ఫిల్ము గ్రామ గ్రామానికి పయనిస్తుంది. తర్వాత శక్తి పీఠాలలోను, సత్సంగ కేంద్రాలలోను స్థాపించబడుతుంది. దీనికి పవర్ పాయింట్ స్లైడ్స్ కూడా తయారుచేయబడుతున్నాయి. అవకాశం ఉన్న చోట ప్రొజెక్టర్ ద్వారా చూసుకోవచ్చు. ఈ స్లైడ్స్‌ను అందరికీ పంపించడం జరుగుతుంది. ఈ పని 2010 మార్చి నుండే మొదలై 2012 వసంత పంచమి 28 జనవరి శనివారం వరకు నడుస్తుంది. జనవరి 28,29 తేదీలలో దేశంతోపాటు ప్రపంచం అంతా ఒకేసారి కాగడాల ఊరేగింపుతో జన్మశతాబ్ది ఉత్సవం పూర్తి అవుతుంది.

### నౌకరునుండి రాష్ట్రపతి

*ఓహియో అడవుల్లో ఒక పేదరాలు కట్టెలు కొట్టుకొని వచ్చి నగరంలో అమ్ముకునేది. దాని మీద ఆదాయంతో తన కుమారుడు 'గారిఫీల్డ్'ను పెంచి పోషించేది. తాను అడవికి వెళ్ళేటప్పుడు కుమారుని గుడిసెలో ఉంచి, తలుపులు తాళం వేసి వెళ్లేది. సాయంకాలానికి గుడిసెకుచేరుకునేది. తరువాత ప్రేమగా దగ్గరకు చేర్చుకుని చదువు చెప్పేది. ఆ విధంగా పిల్లవానికి 12 సంవత్సరాలు నిండాయి. తల్లి ఒక చిన్న బండిని కొన్నది. కట్టెలను నెత్తిమీద కాకుండా బండిమీద పెట్టుకుని నెట్టుకుంటూ పోయి అమ్ముకునేవారు ఇద్దరూ.*

*గారిఫీల్డ్‌కు చదువుకోవాలన్న కోరిక. ఒక పాఠశాల దగ్గరకు వెళ్లి పాఠశాలను శుభ్రం చేసేపనిని కుదుర్చుకున్నాడు. అక్కడ పని చేస్తూనే ఉపాధ్యాయుల సాయంతో చక్కగా చదువుకునేవాడు. మెల్ల మెల్లగా డిగ్రీ పాసయ్యాడు. అతని తెలివితేటల వల్ల మంచి ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేసుకుంటూనే అనేక సమాజసేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. అతని స్వభావం, వ్యక్తిత్వం అనేక మందిని ఆకర్షించుకున్నాయి.*

*క్రమంగా ఒక్కొక్క మజిలీ దాటుకుంటూ అమెరికా రాజ్యసభ సభ్యునిగా ఎన్నిక అయ్యాడు. తరువాత రాష్ట్రపతిగా ఎన్నుకోబడ్డాడు. ఈ విజయాలన్నీ ఆయనకు దేవతల వల్ల లభించిన వరదానాలు కావు. సేవాభావం, యోగ్యత సామర్థ్యాల వల్లనే సాధ్యపడ్డాయి.*

**పవిత్రమైన జీవితం గడిపేవాడే ఉత్తమోత్తమ కళాకారుడు.**

ఆలోచించండి - ఆచరించండి

# జన్మ శతాబ్దికి మన కర్తవ్యం

మిత్రులారా! మనమంతా గాయత్రీ పరివార సభ్యులం. పరమ పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది సందర్భంగా మనం ఏం చేయల్సి ఉంది? ఎంత వరకు చేస్తున్నాం? అందరం ఒక్క సారి ఆత్మమథనం చేసుకోవాలి. ఆచరణలో పెట్టాలి. ముందుగా చేయాల్సినపనులు

1. రాబోయే ప్రమాదాలను అరికట్టి, యుగనిర్మాణం వైపుగా సాగిపోవాలి అంటే సామూహికంగా గాయత్రీమంత్రజపం చెయ్యాల్సిఉంది. ఉదయం 6 నుండి 6-30 వరకు సాధ్యమైనంత సంఖ్యతో 5 గురికి తగ్గకుండా చెయ్యాల్సిఉంది.
2. సామూహిక జపానికి, యజ్ఞాల నిర్వహణకు జనాన్ని సమావేశపరచాలి అంటే ముందుగా సద్గోష్టి సమావేశాలు నిర్వహించాల్సిఉంది. ఆ సమావేశాలలో జపం యొక్క, యజ్ఞం యొక్క ప్రాముఖ్యతను, లాభాలను వివరించాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితిపై చైతన్యం కలిగించాల్సి ఉంటుంది. చైతన్యం పొందిన వారిని గుర్తించి సంకల్ప దీక్షలను ఇవ్వాల్సి ఉంటుంది. వారి ఇండ్లకు వెళ్లి దేవస్థాపన, కలశస్థాపనలు చేయాల్సి ఉంటుంది.
3. సంకల్ప సిద్ధులైన కార్యకర్తలు తమతమ కలశాలను తీసుకుని ఊరేగింపుగా బయలుదేరి యజ్ఞశాలకు చేరుకోవాల్సి ఉంటుంది. నియమిత వ్యక్తి వద్ద అంశదానం వ్రాయించి రసీదు పొందవలసి ఉంటుంది. అదే రోజు సాయంకాలం దీప యజ్ఞం జరిగే సమయంలో కర్తవ్యాలను తెలియ చెయ్యాల్సి ఉంటుంది.
4. యజ్ఞవేదిక అలంకరణ, హోమకుండీల ఏర్పాట్లు తగినంత హోమసామాగ్రి, వచ్చిన వారికి సుఖంగా కూర్చునే ఏర్పాట్లు మొదలైనవన్నీ చేయాల్సి ఉంటుంది.
5. యజ్ఞానంతరం జరిపే ప్రసాదవితరణ భారాన్ని సాధ్యమైనంత వరకు ఒక్కరిపైననే మోపకుండా మరి కొందరికి పంచాల్సి ఉంటుంది.
6. యజ్ఞం ముగిసిన తర్వాత జమాఖర్చుల నివేదికను ప్రకటించి, కమిటీ వారి ఆమోదమును పొందవలసి ఉంటుంది.
7. సమయదానము, అంశదానములను ఇచ్చేవారి పేర్లు నమోదు చేసుకుని, తగిన బాధ్యతలను అప్పగించాల్సి ఉంటుంది.
8. పై ప్రయత్నాల ద్వారా సంఖ్యను పెంచుకుని వాడవాడలా తిరుగుతూ గురుదేవుల వాణిని, వారి జ్ఞాన సంపదను వారి జీవన విధానాన్ని వివరంగా తెలియపర్చాల్సి ఉంటుంది.
9. సామూహిక గాయత్రీ జపం, యజ్ఞాల నిర్వహణలను మాధ్యమంగా చేసుకుని పరిజనులతో యజ్ఞ నిర్వహణా సమితిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

పైన తెలిపిన నవ సూత్రాలతోపాటు మరొక మూడు సూత్రాలను దృష్టిలో పెట్టుకోండి.

1. **ప్రజ్ఞా పరిజనులు:** ఒక్కొక్క కార్యకర్త 5 గురు క్రొత్త సభ్యులను సంస్థలో చేర్పించాలి. నూతనముగా చేరిన వీరంతా రోజూ క్రమం తప్పకుండా నిర్ణీత సంఖ్యలో గాయత్రీ మంత్ర జపం చెయ్యాలి. రోజూ ఒక్క మాలకు తగ్గకుండా చెయ్యాలి. అంతేగాక రోజూ 20 ని॥లు గురుదేవుల సాహిత్య పఠనం చేయాలి. రోజుకు 3 నుండి 5 రుపాయలు జమచేసి అంశదానంగా సమర్పించాలి.
2. **ప్రజ్ఞాపుత్రులు-పుత్రికలు:** పైవిధంగా ప్రజ్ఞాపరిజనులను 100 మందిని తయారు చేయాలి. వీరు ప్రతిరోజూ 5 మాలలు జపం చెయ్యాలి. 30 ని॥లు స్వాధ్యాయం చెయ్యాలి. తన సంపాదనలో 10% అంశదానగా సమర్పించుకోవాలి. అదేవిధంగా రోజుకు రెండు గంటలు సమయదానం ఇవ్వాలి. గ్రామాలతోపాటు మండళ్లలో, రాజధానిలో 24 కుండీల యజ్ఞాలను నిర్వహించాలి.
3. **ప్రజ్ఞాపుంజ్‌లు:** పైన తెలిపిన విధంగా 10 మందికి తక్కువ కాకుండా ప్రజ్ఞాపుత్రులను, పుత్రికలను తయారు చేయాలి. వీరంతా కలసి ప్రజ్ఞాపరిజనుల కార్యకలాపాలను తమ పర్యవేక్షణలో నడిపించాలి. వీరు పూర్తి సమయాన్ని ఇవ్వగలగాలి.

మిత్రులారా!

మరొక్కమారు పైన తెలిపిన నవ సూత్రాలను శ్రద్ధగా చదవండి. బాగా ఆలోచించండి. "ఏ ఒక్క దానినైనా మనం సంపూర్ణంగా నిర్వహిస్తున్నామా? ఎంత వరకు కృతకృత్యులం అవుతున్నాం? ఎన్ని అడుగులు ముందుకు వేశాం? ఇంకెన్ని వేయాలి? రాష్ట్రంలోని ప్రజ్ఞాపీఠాలు, మహిళా మండళ్లు, శక్తి పీఠాలు, చేతనా కేంద్రాలు తమ లక్ష్యసాధనలో ఎంతవరకు సఫలతను సాధించాయి? ఈ ప్రశ్నలన్నింటికీ సరి అయిన సమాధానం మన దగ్గర ఉన్నదా? ఉంటే ఏమిటి?" అన్న విషయాలపై మనం అందరం ఆత్మావలోకనం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమయింది. లేవండి కార్యోన్ముఖులుకండి.

ఈ అంశంపై నూతన సూచనలను, సలహాలను ఆహ్వానిస్తున్నాం. ఉత్తమ సూచనలకు, ఉత్తమ సలహాలకు తగిన సత్కారం లభిస్తుంది. మీ మీ సంకల్పాలను, మీరు నిర్వహింప తలపెట్టిన యజ్ఞ తేదీలను వెంటనే గాయత్రీ చేతనా కేంద్రానికి పంపవలసిందిగా కోరుకుంటున్నాము.

★★★

సత్ప్రవర్తనతో తండ్రిని సంతోషపెట్టేవాడే పుత్రుడు.

# ఏ పుస్తకంలో ఏముంది?

## బాల సంస్కారశాల - మార్గదర్శిని

*హిందీ మూలం* : బ్రహ్మవర్చస్

*తెలుగు అనువాదం* : *మధురకవయిత్రి:*

పొన్నూరు హైమవతీ శాస్త్రి

వెల : రూ॥ 40.00

'బాలసంస్కారశాల-మార్గదర్శిని' అనే ఈ పుస్తకం నిజంగా బాలల ప్రగతికి మార్గదర్శిని అని చెప్పవచ్చు. పరమ పూజ్య గురుదేవుల ఆలోచనాతరంగాలలో ఒక కెరటం ఈ పుస్తకం. "నేడు గాంధీ, సుభాష్, తిలక్, స్వామి వివేకానందలు లేరు. అయినా నేను స్థూలశరీరాన్ని విడిచిన తర్వాత సూక్ష్మ శరీరంతో మీ చేత తయారు చేయించగలను. క్రొత్త తరం పిల్లలను మీ ముందుకు తీసుకవస్తాను. నేను చెప్పినది దృష్టిలో పెట్టుకుని మీరు తయారుచేయాలి. పైనుండి నేను చూచుకుంటాను." అని స్పష్టం చేశారు. ఆ ఆలోచనల ఫలితమే ఈ పుస్తకం.

గతించిన నాలుగు-ఐదు సంవత్సరాల నుండి బాల సంస్కారశాలలను గురుదేవుల ఆశయాలకు అనుగుణంగా నిర్వహిస్తూ ఉన్న 'నిర్మాణాత్మక విభాగం-భిలాయినగర్' గాయత్రీ పరివార్ వారి అంకితభావాన్ని అభినందిస్తూ డా॥ ప్రణవపండ్యా-శ్రీమతి శైలబాలా పండ్యాలు- "మీ విద్య, మీ ప్రతిభ, మీ సాధనల ద్వారా చిన్నారుల హృదయాలలో సంస్కారాలను నింపి, రాబోయేతరాల వారితో నవయుగనిర్మాణానికి రహదారులు నిర్మింపచేసే మార్గదర్శిగా ఈ పుస్తకం వర్ధిల్లుతుంది" అని ఆశీస్సులు అందుకున్న పుస్తకం ఇది.

"గురుదేవుల ఆలోచనాతరంగాల నుండి కెరటాల్లావచ్చి చేరిన ఈ శిశువులను స్వయంగా వారి చేత పంపబడిన వారిగా భావించాలి. ఏదేశ భవిష్యత్తైనా ఆదేశపు భావిపౌరుల పైననే ఆధారపడి ఉంటుంది. అన్న విషయాన్ని ఎవ్వరూ కాదనలేరు. వారిలో తగిన సంస్కారాలను నింపి తీర్చిదిద్దవలసిన బాధ్యత అధికాంశం ఆ దేశపు యువత భుజస్కంధాలపై ఉంటుందని మరచిపోరాదు" అంటూ అనేక ప్రాథమిక సూత్రాలను ఉపోద్ఘాతం ద్వారా తెలియచేసిన పుస్తకం ఇది.

కేవలం ఈ పుస్తకం బాలలకే మార్గదర్శిని కాదు. బాలలలో సంస్కారాలను నింపే క్రమాన్ని పెద్దలకు చక్కగా మార్గదర్శనం చేస్తోంది. బోధన-శిక్షణ-ప్రశిక్షణ అనే మూడు అంశాలపై కార్యకర్తలు తీసుకోవలసిన జాగ్రత్తలను చక్కగా విశదీకరించడం జరిగింది.

ఇందులో ఆచార్య నియమావళిని నిర్దేశించడం జరిగింది. ఏ విధంగా ప్రారంభించాలి? ఎన్ని కాలాంశాలు నడపాలి? ఏయే కాలాంశాలలో ఏవేవి నేర్పించాలి? ఎంతెంత సమయం తీసుకోవాలి? మొదలైన విషయాలన్నీ విషయ సూచికలో స్పష్టంగా సూచించడం జరిగింది. కేవలం వారంలో రెండుగంటల సమయాన్ని మాత్రమే బాలల కొరకు వెచ్చించాల్సిన తీరుతెన్నులను తరగతి క్రమంలో వివరించడం జరిగింది.

విజ్ఞానయాత్రలు, జన్మదిన సంస్కారాలు, మహాపురుషుల జయంతులు, ఆరోగ్య సూత్రాలూ, వ్యాయామం మొదలైన విశేష విషయాలు కూడా నేర్పించే విధానం చెప్పబడింది.

ఆట, పాట, కథ ఒకటేమిటి బాలల భవితకు కావాల్సిన అనేక విషయాలు అంచల వారిగా అందించబడ్డాయి. సద్వాక్యాలు, సదాలోచనలు, మంచిఅలవాట్లు, ధ్యానం, జపం, ప్రార్థన మొదలైన విషయాలన్నీ సంక్షిప్తంగా సవివరంగా తెలుపబడ్డాయి.

204 పేజీలున్న ఈ పుస్తకాన్ని పుస్తకంలో తెలిపిన కాలాంశాల వారీగా సంవత్సర కాలంలోపే పూర్తి చేయవచ్చు. యోగాభ్యాసాలు (బొమ్మలతో సహా) సంస్కారాలను నేర్పించే ఆటలు (బొమ్మలతో సహా) ఈ పుస్తకంలో పొందుపర్చడం జరిగింది.

బాల బాలికలకు ఉపకరించే ఆధ్యాత్మిక డైరీని సూచించడం జరిగింది. ఈ బాలసంస్కార శాలలను గల్లి గల్లీలోను గ్రామ గ్రామంలోనూ ప్రతీ పట్టణంలోను, నిర్వహించవచ్చు. ఈ శాలలను నడిపించే కార్యకర్తలు విద్వాంసులే కానక్కర లేదు. పెద్ద పెద్ద డిగ్రీలు అవసరం లేదు. కనీసం 5 తరగతులు చదివిన స్త్రీ పురుషులు ఎవరైనా నిర్వహించవచ్చు. విద్యతో పాటు సంస్కారాలను అందించవచ్చు. ఇంకా ఆలస్యం ఎందుకు లేవండి. ఒక్కసారి ఈ పుస్తకాన్ని మొదటినుండి చివరి దాకా చదవండి. సంస్కారశాలలు ప్రారంభించండి. నేటి బాలలే రేపటి పౌరులు.

★★★

**భర్తహితం కోరేదే భార్య.**

వార్తలు

# రాష్ట్రమంతటా జరిగిన వివిధ కార్యక్రమాలు

## నెల్లూరు జిల్లాలో

02.12.2009 పొదల కూరు మండలం **వరదాపురం గ్రామంలో** శ్రీకాశీనాయన స్వామి గారి ఆశ్రమమునందు భాస్కర నాయుడు గారి ఆధ్వర్యంలో పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. 150 మంది పరిజనులు పాల్గొన్నారు. శ్రీ రమణమూర్తి శ్రీ ఐ.వి. రమణయ్య, శ్రీమతి రాగమ్మ, శ్రీమతి నారాయణగార్లు సహాయ సహకారాలు అందచేశారు.

02.12.2009 వింజమూరు మండలం **చంద్రవడియ గ్రామంలో** శ్రీకాశీనాయన స్వామి ఆశ్రమమునందు దత్తపౌర్ణమి సందర్భంగా త్రికుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. ఆశ్రమకమిటీ ఆధ్వర్యంలో శ్రీ భాస్కరనాయుడు, శ్రీమతి సావిత్రి గార్లు యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. 150 మంది భక్తులు పాల్గొన్నారు.

06.12.2009 **గాయత్రీ పరివార్ జిల్లా కార్యాలయంలో** మొదటి ఆదివారం శ్రీ భాస్కరనాయుడు ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. శ్రీ ఆర్. సుబ్బరామయ్య ఉభయ కర్తగా, శ్రీ టి. రమణ మూర్తి, శ్రీమతి సరళ నిర్వహించారు. 60 మంది పరిజనులు పాల్గొన్నారు.

13.12.2009, 20.12.2009, 24.12.2009, 25.12.2009, 27.12.2009 తేదీలలో ఏకకుండీ గాయత్రీ మహా యజ్ఞాలు నిర్వహింపబడ్డాయి.

**01.01.2010** నెల్లూరు జిల్లా **నార్తురాజుపాలెం గ్రామంలో** వేల్పుల వెంకయ్య, పద్మావతమ్మ గారి స్వగృహము నందు శ్రీమతి వేల్పుల భువనమోహన్ గారు గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఈ నూతన సంవత్సరంలో గురుదేవుల శతాబ్ది ఉత్సవాల కార్యక్రమాన్ని విస్తృత పరచడానికి ప్రణాళిక వేసుకున్నారు. 100 పుస్తకముల సెట్‌లు పంపిణీ చేశారు.

**01.01.2010 అల్లూరు గ్రామంలో** శ్రీ షిర్డి సాయిబాబ మందిరమునందు శ్రీ వెంకట సుబ్బయ్య గారి ఆధ్వర్యములో శ్రీ టి. రమణమూర్తి గారు, శ్రీమతి వేల్పుల భువనమోహన గారు దీపయజ్ఞము నిర్వహించారు. 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కారుమంచిలో

29.11.2009 గ్లోబల్ గాయత్రీ మంత్ర పురశ్చరణ సందర్భముగా కారుమంచి గ్రామంలో షిరిడి సాయిబాబా వారి ఆలయంలో 34 మంది సామూహిక జప సాధనలో పాల్గొన్నారు.

## తొర్రూరులో

వరంగల్ జిల్లా తొర్రూరు గ్రామంలో శ్రీ సుబ్బారావుగారి ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేయనైనాయి. ఆ సందర్భంగా 31.10.2009 రాత్రికి భక్తులు కార్య స్థలానికి చేరుకున్నారు. 01.11.2009 నాడు ఉదయం 5 కుండీలతో గాయత్రీ మహా యజ్ఞం జరిగింది. శ్రీ జి. వెంకటనారాయణ నిర్వహించిన ఈ యజ్ఞంలో 150 మంది పరిజనులు పాల్గొన్నారు.

## రామానుజనగర్‌లో

11.12.2009నాడు హైదరాబాద్ రామానుజనగర్‌లోని ఓల్డ్‌బోయిన్‌పల్లిలో ద్వికుండీయ గాయత్రి మహాయజ్ఞం నిర్వహించబడింది. ఈ యజ్ఞానికి శ్రీయం. రాజేశ్వరరావు, శ్రీ అయ్యప్పస్వామి, వారి బంధువులు 50 మంది పరిజనులు పాల్గొన్నారు. యజ్ఞకార్యాన్ని శ్రీ జి. వెంకటనారాయణ నిర్వహించారు.

## బాలసంస్కారశాల ఏర్పాటు

గాయత్రీ చేతనా కేంద్రం–హైదరాబాదులో 17.01.2010 నాడు ప్రత్యేకంగా పిల్లలకు శిక్షణను ఇచ్చే నిమిత్తం "బాల సంస్కారశాల"ను ఏర్పాటు చేయడం జరిగింది. గాయత్రీ పరివార్ దక్షిణ భారత సంచాలకులు శ్రీ అశ్వినీ సుబ్బారావుగారి అధ్యక్షతన ప్రారంభించబడింది. ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2 గం॥ల నుండి సా॥ 4 గం॥ల వరకు శిక్షణ ఇవ్వబడుతుందనీ, 9 నుండి 15 సం॥లలోపు బాలబాలికలకు ప్రవేశం ఉంటుందనీ, నీతికథలు, దేశభక్తి కథలు–పాటలు–ఆటలు మొదలైనవి నేర్పిస్తామనీ శ్రీ సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ పరమానందద్వివేది, శ్రీ కె.వి.వి.పంతులు, శ్రీ వేణుగోపాలరెడ్డి, శ్రీమతి అనసూయమ్మ

**కలిమిలోను, లేమిలోను ఒకేలా ఉండేవాడే స్నేహితుడు.**

తదితరులు పాల్గొన్నారు. **సంప్రదించవలసిన ఫోను నెం. 23700722**

## కామారెడ్డిలో

28.11.2009 నుండి 03.12.2009 వరకు కామారెడ్డి ప్రజ్ఞాపీఠంలో గాయత్రీ మహా యజ్ఞాలు నిర్వహించబడ్డాయి. ఆ సందర్భంగా శ్రీ.జి. వెంకట నారాయణ శ్రీరామాగౌడ్, శ్రీ ప్రభాకర్, శ్రీమతి లక్ష్మిగార్లకు యుగ సంగీత సాధన చేయించడం జరిగింది.

## వరంగల్లులో

**రామన్న గూడెంలో** 27.12.2009న సాయంత్రం 54 కలశాలతో కలశయాత్ర శోభాయమానంగా జరిగింది.

28.12.2009న 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞం శ్రీ శ్రీనివాసరావు, శ్రీ గురుస్వామి మరియు ఇతర గ్రామపెద్దల ఆధ్వర్యంలో తొర్రూరు గాయత్రీ పరివార్ కార్యకర్తల సహాయ సహకారాలతో శ్రీ జి. వెంకట నారాయణ, శ్రీ సదానందం, శాంతికుంజ్ ప్రతినిధులు నిర్వహించారు. శ్రీ వెంకట నారాయణ గారు గురుదేవుల, మాతాజీల పరిచయంతో పాటు గాయత్రీ మంత్ర విశిష్టత గురించి ప్రవచనం ఇచ్చారు. సుమారు 1000 మంది పరిజనులు ఈ మహాయజ్ఞంలో పాల్గొన్నారు.

**ఆత్మకూరు గ్రామంలో** 31.12.2009న గ్రామ సర్పంచి, ZPTC తదితరుల ఆధ్వర్యంలో త్రికుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీ సిహెచ్. దశరథరాం, శ్రీ ఈశ్వరయ్య గార్లు నిర్వహించిన కార్యక్రమునకు సుమారు 500 మంది గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. త్వరలో 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించుటకు సంకల్పించారు.

శ్రీ ఎ. రాధాకృష్ణమూర్తి గారు జన్మదిన సంస్కారములు-9, అన్న ప్రాసన సంస్కారములు-1, పుంసవన సంస్కారం-1 డిశంబరు నెలలో నిర్వహించారు.

## ఎర్రబాలెంలో

19.12.2009న పూజ్య శ్రీ డా. బ్రిజ్‌మోహన్ గౌడ్‌జీ, శ్రీ పరమానంద ద్వివేది, శ్రీ వేణుగోపాలరెడ్డి గార్లు శ్రీ కృష్ణ ఆనంద ఆశ్రమం, ఎర్రబాలెం (అనాధ పిల్లల ఆశ్రమం మరియు గో సంరక్షణ సంస్థ) ను సందర్శించారు. ఆశ్రమంలో వారు పిల్లలతో ఆనందంగా గడిపి వారికి మిఠాయి పంచిపెట్టారు. అక్కడ గోవుల మధ్య పిల్లల మధ్య ఆశ్రమ నిర్వాహకులకు తమ సందేశం ఇస్తూ ఆ పిల్లలను ఎంతో ప్రేమగా చూసుకొనవలసినదిగా కోరారు. వారి తల్లిగారి కోరిక అంటూ 1000/- రూ॥లు ఆశ్రమానికి సమర్పించారు.

తదుపరి, మంగళగిరి పట్టణంలోని శ్రీ బోయినపల్లి ప్రసాద్‌గారి ఇంటి ఆవరణలోని గాయత్రి పరివార్ స్థానిక కార్యాలయాన్ని సందర్శించారు. కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## మంగళగిరిలో

డిసెంబరు 2009, 17,18,19,20 తేదీలలో పాతమంగళగిరి శ్రీ పద్మశాలీయ బహూత్తమ సేవాసంఘ కళ్యాణమండపంలో, మంగళగిరి గాయత్రీ పరివార్ వారి ఆధ్వర్యంలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞము మరియు సత్రయాగం అత్యంత వైభవంగా జరిగినవి.

17.12.2009 సాయంత్రం పాత మంగళగిరి వీధులలో కలశయాత్రను అత్యంత ఉత్సాహంతో, శోభాయమానంగా నిర్వహించారు.

18.12.2009న బ్రహ్మశ్రీ కూచిభొట్ల చంద్రశేఖర శర్మగారు, తమ ఆధ్యాత్మిక ప్రవచనంలో భక్తులనుద్దేశించి, గాయత్రీ మంత్ర విశిష్టత సమకాలీన పరిస్థితులలో యజ్ఞముల ఆవశ్యకతను గూర్చి వివరించారు. ఆ రోజు దాదాపు 100 మంది పరిజనులు యజ్ఞకార్యక్రమంలో పాల్గొన్నారు.

19.12.2009న పూజ్యశ్రీ బ్రహ్మచారి శ్రీశ్రీశ్రీ శివస్వామి గారు, శ్రీశైవక్షేత్రం, తాళ్ళాయిపాలెం వారు, తమ అనుగ్రహ భాషణలో సమాజం యొక్క శ్రేయస్సుకు ఈ గాయత్రీ యజ్ఞపరంపర ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు.

20.12.2009న పూజ్య శ్రీ వెంకటేశ్వర యోగి (గురూజీ) వ్యవస్థాపకులు, వెంకటేశ్వర యోగ సేవాకేంద్రము, మంగళగిరి వారు తమ ప్రవచనంలో సమాజంలో, అభద్రత, భయం, అసూయ మొదలైనవి పోవాలంటే మానవునికి సద్బుద్ధి యొక్క అవశ్యకత ఎంతైనా ఉన్నదన్నారు. అటువంటి సద్బుద్ధిని ప్రసాదించే దివ్య మంత్రమే గాయత్రి మంత్రం అన్నారు.

మూడు రోజులు స్థానికుల సహకారంతో యజ్ఞంలో పాల్గొన్న భక్తులకు భోజన ప్రసాద వితరణ జరిగింది.

మంగళగిరి గాయత్రీ పరివార్ శాఖ సభ్యులు శ్రీ పి.యమ్. కోటేశ్వరరావు, శ్రీ యన్.వి. సుబ్బారావు గారు, శ్రీ బి.వి.యల్.యన్ ప్రసాదుగారు, శ్రీ శేషురెడ్డిగారు, శ్రీ పేర్ల

**ఏ పనీ చేయనప్పుడు అన్నీ తెలుసు అనుకుంటాం - పని మొదలుపెట్టినప్పుడు ఏమీ తెలియదు అని తెలుస్తుంది.**

వెంకటేశ్వరరావు గారు, శ్రీ బి.యల్.యన్. మూర్తిగారు, శ్రీ సీతారామశాస్త్రి గారు, శ్రీ యల్.కె. శర్మగారు కార్యక్రమ నిర్వహణలో తమ సహాయ సహకారాలు అందచేశారు. యుగ సాహిత్య విక్రయశాల నిర్వహింపబడినది. స్థానికంగా తమ సహాయసహకారాలు అందచేసిన శ్రీ సూర్యనారాయణగారు, శ్రీ సత్యనారాయణగారు మరియు శ్రీ పూర్ణ గార్లను మంగళగిరి గాయత్రీ పరివార్ శాఖ తరపున పరివార్ శాలువలలో సత్కరించడమైనది.

## ఇల్లెందులో

పరమ పూజ్య గురుదేవులు ఈనాటి సమాజమునకు ప్రత్యేకంగా అందించిన ప్రజ్ఞాపురాణ కార్యక్రమం 18.11.2009 నుండి 22.11.2009 వరకు స్థానిక జె.కె. కాలనీలోని హరిహర క్షేత్రంలో శాంతికుంజ్ ప్రతినిధులు శ్రీ రాంశంకర్ మిశ్రాజీ, ప్రహ్లద్‌సింగ్, సంజయసింగ్ గార్లు నిర్వహించారు. మొదటి రోజు జరిగిన కలశయాత్రలో ప్రజ్ఞాపురాణ గ్రంథముతో పాటు వేదములు, గురుదేవులు పాదుకలు, ప్రఖర ప్రజ్ఞ, సజల శ్రద్ధ స్మృతి చిహ్నములు, గంగాజల కలశములను శిరస్సుపై ధరించి ఊరేగింపుగా నిర్వహించారు. ఐదవ రోజు పూర్ణాహుతిగా 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించబడింది. ఈ కార్యక్రమములు జిల్లా కో ఆర్డినేటర్ శ్రీ సతీష్ ఖండేల్వాల్, ఇల్లెందు పట్టణ కన్వీనర్ యస్.వి. పరబ్ ఆధ్వర్యంలో జరిగాయి.

పూజ్య గురుదేవుల శ్రీరామశర్మ ఆచార్య 98వ జయంతి సందర్భమున ఇల్లెందులో యన్.యస్.యస్ డిగ్రీ కళాశాల, గాయత్రీ పరివార్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదానం జరిగింది.

## అశ్వాపురంలో

05.12.2009 దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం హరిద్వార్ నిర్వహిస్తున్న భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షకు సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమమునకు విశేష కృషి చేసిన శ్రీ సతీష్ ఖండేల్వాల్, జిల్లా కో ఆర్డినేటర్‌కు అభినందనలు.

## తూర్పు గోదావరి జిల్లాలో

**అనపర్తిలో** డిశంబరు 1,2,3 తేదీలలో అనపర్తి గ్రామంలో సత్రయాగం శ్రీరామానందస్వామి, శ్రీమతి నాగమణి ఆధ్వర్యంలో శ్రీమతి శ్యామల, వెంకట రెడ్డి దంపతులు నిర్వహించారు. ప్రతి రోజు శాంతి కుంజ్ సమయానుసార కార్యక్రమాలతో పాటు నవకుండీ గాయత్రీ యజ్ఞము నిర్వహించడమైనది. ఈ కార్యక్రమములో ఓం శాంతి సనాతన ధర్మ ప్రచార సమితి, పిరమిడ్ ధ్యాన కేంద్రం, సాయి సంస్థ, శ్రీ పీఠం సంస్థలవారు పాల్గొన్నారు. వారి వారి ప్రతినిధులు సాయంత్రం సందేశం అందించారు. మూడు రోజులు 300–500 మంది పరిజనులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి వెంకటరెడ్డి దంపతులు భోజనవసతులు, ఇతర సహాయ సహకారాలు అందించారు.

**రంగాపురంలో** 04.12.2009 తేదీన భూపతి రాజు సుబ్రహ్మణ్యం రాజు గారి కమ్యూనిటి హాలు గృహ ప్రవేశ సందర్భంగా శ్రీరామనంద స్వామి ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రీ మహా యజ్ఞమును శ్రీమతులు నాగమణి, సుభద్ర, గాయత్రి, కుమారి, దుర్గ నిర్వహించారు. సుమారు 50మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**చింతలపూడి గ్రామంలో** 12.12.2009 జె. సుబ్రహ్మణ్యం గారి గృహమునందు మంత్రజప పూర్ణాహుతిగా శ్రీరామానంద స్వామి ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రి మహా యజ్ఞం శ్రీమతి నాగమణి, గాయత్రీ, దుర్గ నిర్వహించారు. సుమారు 50 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**గొల్లమామిడి గ్రామంలో** నవంబర్ 1,2,3 తేదీలలో శ్రీ కోదండ రామచంద్రమూర్తి ఆలయమందు సత్రయాగం నిర్వహించబడింది. ఉదయం 4:30 గంటల నుండి 7 గంటల వరకు సాధన, 9గంటలకు పంచకుండీ యజ్ఞం, సాయంత్రం సత్సంగం, వివిధ సంస్థలవారి ప్రవచనములు అత్యంత వైభవంగా జరిగాయి. మొదటి రోజు బ్రహ్మకుమారీస్ అక్కయ్యగారు సమయం యొక్క విలువ గురించి, నాగమణిగారు గాయత్రీ మంత్ర విశిష్టతను వివరించారు. శ్రీ రామనంద స్వామి మానవుడు మాధవుడుగా ఎలా మారుతారో తెలిపారు. రెండవ రోజు శ్రీ మణికుమార్ గురుదేవులందించిన సంస్కారములతో మనిషి ఎలా మహా మానవుడవుతాడో అనే విషయం విపులంగా చెప్పారు. 3వ రోజు త్రిశక్తి పీఠం త్రినాధ గురూజీ పిరమిడ్ సొసైటి కె. స్వామిగారు తమ అమూల్యమైన సందేశం అందించారు. ఈ కార్యక్రమములో 70 మంది పాల్గొన్నారు. భోజన సదుపాయాలు శ్రీమతి టి. సావిత్రి, వారి కుమారులు (మామిడాడ గ్రామం) అందించారు. ఈ కార్యక్రమాలను పూజ్య శ్రీ రామానంద స్వామి ఆధ్వర్యంలో అమలాపురం గాయత్రీ పరివార్ నిర్వహించారు.

**ప్రేమాస్పదుడవు కాలేకపోతున్నావంటే, నిన్ను నీవు పరిశీలించుకోవాలన్నమాట.**

**11.11.2009 గాయత్రీ పరివార్ జిల్లా కార్యాలయంలో** పంచకుండీ గాయత్రి మహా యజ్ఞం శ్రీ భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో శ్రీ టి.రమణమూర్తి, శ్రీమతి టి. సరళ నాగలక్ష్మి గారు నిర్వహించారు. రీజినల్ కన్వీనర్ శ్రీమతి రాజ్యలక్ష్మి గారు కార్యకర్తలు మీటింగ్‌లో గురుదేవుల జన్మశతాబ్ది గురించి వివరించారు. 50 మంది పరిజనులు కార్యక్రమానికి హాజరైనారు.

**అమలాపురంలోగల** ఏడు పాఠశాలలో విద్యార్థుల చేత ప్రతి నిత్యం 24 సార్లు గాయత్రి మంత్రం చేయాలనే సంకల్పం చేయించటం జరిగింది. గాయత్రి మంత్ర కార్డులు అందించారు.

(1) సర్దార్ భగత్ సింగ్ పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాల-200 (2) శ్రీనంద్ టెక్నోస్కూలు-204 (3) తులిప్స్ కాన్వెంటు స్కూల్-450 (4) సుభాష్ చంద్రబోసు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల-47 (5) రాజీవ్ కాన్వెంటు-85, (6) శ్రీ సత్యవాణి కాన్వెంటు-240 (7) సరస్వతీ ప్రాథమిక పాఠశాల-52

శ్రీమతి నాగమణి గారు, సి. దుర్గా గారు ఈ కార్యక్రమం నిర్వహించారు.

**30.10.2009 అమలాపురంలోని** గీతాశ్రమంలో క్షీరాబ్ది ద్వాదశి సందర్భముగా శ్రీరామానంద స్వామి ఆధ్వర్యంలో 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞం అత్యంత వైభవంగా జరిగింది. 100 మంది పరిజనులు ఈ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**రాజమండ్రిలో** 2009 అక్టోబరు 3,4,5 తేదీలలో రాజమండ్రిలోని శ్రీ జగద్గురు పీఠంనందు పూజ్య శ్రీరామానంద స్వామి ఆధ్వర్యంలో సత్రయాగం నిర్వహించబడింది. మూడు రోజులు ఉదయం 4 నుండి 7 వరకు సాధన, 9 గంటలకు పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం, సాయంత్రం వివిధ సంస్థల వారిచే ప్రవచనములు జరిగాయి. 3వ తేదీ మాస్టర్ సి.వి.వి గారి శిష్యులు శ్రీశర్మగారు, జ్ఞాన వికాసిని సాయి వర్మగారు, గాయత్రి పరివార్ రాధాకృష్ణగారు, పిరమిడ్ సొసైటి కె.వి. స్వామి గారు , యోగదా సత్సంగ సొసైటి సభ్యులు సత్యన్నారాయణ గారు, రామకృష్ణ గారు తమ అమూల్య సందేశాలను వినిపించారు. ఈ కార్యక్రమమునకు విచ్చేసిన సుమారు 200 మంది పరిజనులకు జ్ఞాన వికాసినీ సేవా సంస్థ వారు (మూర్తిశాయి, వర్మశాయి) భక్తి శ్రద్ధలతో భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.

## గాయత్రీ ప్రజ్ఞామండలి, వైదేహినగర్

01.12.2009 దత్త పౌర్ణమి (దత్త జయంతి) సందర్భముగా నిర్వహించిన పౌర్ణమి ధ్యాన కార్యక్రమంలో 30 మంది సాధకులు పాల్గొన్నారు.

12.12.2009 శ్రీ రామానుజ మిషన్ శ్రీ చతుర్వేది స్వామి జన్మదిన వేడుకల సందర్భముగా పూజ్య గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య సాహిత్య పుస్తక ప్రదర్శన నిర్వహించబడింది. గాయత్రీ మంత్ర మహిమ, యజ్ఞ మహిమల గురించిన ఛార్టులతో ప్రదర్శన ఏర్పాటుచేశారు. 'గో' ఆధారిత ఔషధ విక్రయం ఏర్పాటు చేశారు. సుమారు ఐదువేల రూపాయల సాహిత్యం, ఔషధులు విక్రయమయ్యాయి.

13.12.2009 శ్రీ రామానుజ మిషన్ వారు అశోకా గార్డెన్స్, మెహిదీపట్నంలో ధ్యానం-అద్భుతాలు అనే విషయంపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో పూజ్య గురుదేవుల జన్మదిన సమారోహ స్టిక్కర్స్ 150 పంచబడ్డాయి. 300 సెట్స్ జన్మదిన సమారోహ పుస్తకములు విక్రయమయ్యాయి.

డా|| అకుల బేబిగారు ఈ కార్యక్రమములు నిర్వహించారు.

## ◀ అందరికీ ఆహ్వానం ▶

**22.01.2010 నుండి 30.01.2010 వరకు 9 రోజులు గాయత్రీ శక్తి పీఠం నారా కోడూరులో గాయత్రీ లఘు అనుష్ఠానం (24 వేల గాయత్రీ జపం) నిర్వహింపబడుతుంది. ఈ నవదిన గాయత్రీ శిబిరం నాల్గవది. ఇది సర్వజన శుభకరం. 30.01.2010 నాడు పూర్ణాహుతి జరుగుతుంది. సాధనలో పాల్గొని గాయత్రీ మాత కృపకు పాత్రులు కాగలందులకై కోరుచున్నాము. వివరాలకు క్రింది ఫోను నంబర్లను సంప్రదించగలరు. పాల్గొనదలచినవారు. 21.01.2010 నాటి రాత్రికే నారా కోడూరుకు చేరుకోవలసి ఉంటుంది.**

గమనిక : ప్రతి మాసము నందును శుద్ధ సప్తమి నుండి పౌర్ణమి వరకు నిర్వహింపబడుతుంది.

ఫోన్ : 0863 2534440, 0863 2534658

**కోట సుబ్బారావు**

పర్యవేక్షకులు, గాయత్రీశక్తి పీఠం - నారాకోడూరు

**కొంచెమైనా అవగాహన ఏర్పడితే, దూరదృష్టి అలవడుతుంది.**